ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
శనివారం 9, నవంబరు 2024

ఇసుక కష్టాలు ఇక తీరనున్నాయి. ఇసుక తరలింపుపై ఉన్న రుసుంను ఇప్పటికే రద్దుచేశారు. అవసరమైన వారు అందుబాటులో ఉన్న ఏరులు, వాగులు, వంకలలో ఇసుకను అనుమతుల మేరకు తరలించుకోవచ్చు. ఇందుకు సమీప సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే జిల్లాలో రీచ్‌లు లేనందున సరిహద్దు జిల్లాల నుంచి ఇసుకను తరలించనున్నారు. ఆరు చోట్ల డిపోలను ఏర్పాటు చేసి భవన నిర్మాణదారులకు అందించనున్నారు. ఇందుకుగాను రవాణా, ఎత్తుడు చార్జీలను చెల్లించాల్సి ఉంది. మొత్తంగా ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేస్తోంది.

- అందుబాటులోకి ఇసుక
- సరిహద్దు జిల్లాల నుంచి తరలింపు
- జిల్లావ్యాప్తంగా ఆరు డిపోల ఏర్పాటు
- రవాణా చార్జీలు మాత్రమే వసూలు
- వాగులు, వంకలలో తవ్వకాలకు అనుమతి
- ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకునేందుకు గ్రీన్‌సిగ్నల్
- సమీప సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి



తీరనున్న కష్టాలు

ఒంగోలు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు పాలేరు, మన్నేరు, గుండ్లకమ్మ, మూసీ పరివాహక ప్రాంతాల్లో సొంత అవసరాలకు ఇసుక ట్రాక్టర్లతో తెచ్చుకునేందుకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా ఇసుక విధానం మార్పు చేసి ఉచితంగా తెచ్చుకునేందుకు మార్గం సుగమం చేశారు. సీనరేజీ, డీఎంఎఫ్, మెరిట్ రుసుంను రద్దుచేసింది. అధికారిక రీచ్‌లు జిల్లాలో లేకపోవడంతో అందుకు సంబంధించి ఆరు ప్రాంతాల్లో డిపోలు ఏర్పాటు చేసి సరిహద్దు జిల్లాల నుంచి ఇసుక తెచ్చేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఆ డిపోలలో కేవలం రవాణా, ఎత్తుడు చార్జీలను వసూలు చేసి నిర్మాణదారులకు అందజేయాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ తీర్మానించింది. అందుకు సంబంధించి డిపోల నిర్వహణ బాధ్యత ఏజెన్సీలకు ఇవ్వాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. డిపోల నుంచే కాకుండా సరిహద్దు జిల్లాల్లో రీచ్‌ల నుంచి

మిగతా 6వ పేజీలో

చెరువుల ఆధునికీకరణకు చర్యలు

- సమగ్ర నివేదికలు రూపొందించాలి
- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

వివరాలు 6వ పేజీలో





ఒంగోలులో ఇజ్రాయిల్ పక్షి

ఇజ్రాయిల్ దేశానికి చెందిన జాతీయ పక్షి హూపో శుక్రవారం ఒంగోలులో ప్రత్యక్షమైంది. స్థానిక శర్మ కాలేజీ క్రీడామైదానంలో రెండు రోజులుగా సంచరిస్తోంది. అత్యంత అరుదైన ఈ పక్షి ఒంగోలులో కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



గ్యాస్‌కు ఈకేవైసీ ఆధార్‌కు అప్‌డేట్ కష్టాలు

- ఈకేవైసీ అయితేనే లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు
- జిల్లావ్యాప్తంగా చేయించుకోనివారు 1.5 లక్షల మంది
- పడని వేలిముద్రలు
- కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు

6



మూడోరోజూ కొనసాగిన విచారణ

పలు లోపాలను గుర్తించిన అధికారుల కమిటీ

అత్యాచార ఘటనపై ఎటూ తేలని విచారణ

- తలలు పట్టుకుంటున్న పోలీసులు

6

కదంతొక్కిన న్యాయవాదులు

- జిల్లా కోర్టు ఆవరణ నుంచి ప్రకాశం భవన్ వరకు బైక్ ర్యాలీ
- జేసీ కోర్టులో ఇబ్బందులు తొలగించాలని కలెక్టర్‌కు వినతి

6లో


జన్మదిన శుభాకాంక్షలు
స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు గారు మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ గొట్టిపాటి నర్సయ్య గారు మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ డా॥ గొట్టిపాటి శేషగిరిరావు గారు
స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ బాబు గారు
ప్రజారంజక పాలనలో
తన వంతు పాత్ర పోషిస్తూ
ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
అడుగు జాడల్లో ముందుకు వెలుతు
అంచలంచలుగా ఎదుగుతున్న
మా ప్రియతమ మంత్రివర్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
అమూల్య మినరల్స్ కొండాయపాలెం, బల్లికురవ మండలం
వెంకటాద్రి మినరల్స్ & బివిఎల్ రాక్స్ మల్లాయపాలెం
సత్యకృష్ణ గ్రానైట్స్ దివ్య గ్రానైట్
కెయస్ఆర్ గ్రానైట్స్
S.R కన్‌స్ట్రక్షన్స్ కొణిదెన
సాయి స్టోన్స్ బల్లికురవ
శ్రీ శ్రీనివాస గ్రానైట్స్ కొణిదెన
వి.కె.గ్రానైట్
కృష్ణ సాయి ఎక్స్‌పోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్
లక్ష్మీ గ్రానైట్స్ కొణిదెన
గిరిరాజ్ గ్రానైట్స్
M.V.R గ్రానైట్స్ కొణిదెన
హనుమాన్ ఎక్స్‌పోర్ట్సు మల్లాయపాలెం
ఆర్ణ గ్రానైట్స్ మల్లాయపాలెం
బల్లికురవ మండల కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్
బల్లికురవ
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు

జగన్.. నోరు అదుపులో పెట్టుకో..

● టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని


మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులపై విమర్శలు చేస్తున్న వైసీపీ అధినేత జగన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందదన్నారు. సీఎం పదవి పోయిన తర్వాత జగన్‌కు ఏమిచేయాలో తెలియక మతిభ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చి గుణపాఠం చెప్పినా ఆయన తీరులో మార్పు లేదన్నారు. మళ్ళీ తాను అధికారంలోకి వస్తే అధికారులను ఏదో చేస్తామని బెదిరింపులకు పాల్పడటం సిగ్గు చేటని, మరోసారి వైసీపీ అధికారంలోకి రావడం కల మాత్రమే అని ఆయన ఎద్దేవా చేశారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలు సొంత చెల్లిని, తల్లిని అసభ్యంగా వేధిస్తే జగన్ పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేస్తే జగన్ రాష్ట్రంలో తిరగలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ కష్టపడుతుంటే జగన్ ఓర్వలేక, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. అంతేగాకుండా రాష్ట్రంలో కొందరు అధికారులు తీరు ఇంకాల మార్చుకోలేదని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే వదిలే ప్రసక్తి లేదని నూకసాని హెచ్చరించారు.



వచ్చే నెల 5 నుంచి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు


కబడ్డీ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సూదనగుంట కోటయ్యచౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలు సంతనూతలపాడులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ట్రెజరర్ డి.రమేష్ తెలిపారు. డాక్టర్ ఎస్.రాఘవేంద్రప్రసాద్ సూదనగుంట ఫౌండేషన్ అమెరికా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు మధ్య మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 10 జిల్లాల జట్లకు సంబంధించి 400మంది క్రీడాకారులు, 100మంది న్యాయనిర్ణేతలు పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ సహకారంతో క్రీడాకారులకు ఉచిత భోజనసదుపాయం, వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని, క్రీడా దుస్తులను సైతం అందజేస్తామని చెప్పారు. అనంతరం పోటీల లోగోను ఆవిష్కరించారు. జిల్లా అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ రంగరావు, కోఆర్డినేటర్ శీనయ్య, మల్లికారాణి, క్రిష్ణమూర్తి, ఎస్.రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోత విధించిన జీతాన్ని తిరిగి చెల్లించాలి


డీఎంహెచ్‌వో సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక వైద్యశాఖ కార్యాలయలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరులో కోత విధించిన జీతాలను తిరిగి ఉద్యోగులకు చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు వచ్చే తక్కువ జీతాలలో ఎక్కువ కోత విధించడం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎఫ్‌ఆర్ఎస్ లోపాలను సవరించకుండా ఇదే పద్ధతి అమలు చేస్తే ఉద్యోగులు ఎవరికీ జీతాలు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు నెట్‌వర్క్ సమస్యతో ఎఫ్‌ఆర్ఎస్ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆదివారాలు, పబ్లిక్ సెలవు రోజుల్లోనూ ఎఫ్‌ఆర్ ఎస్ హాజరు వేయాల్సి రావడం వల్ల కూడా ఇబ్బందికరంగా ఉందన్నారు. షిఫ్ట్ డ్యూటీలు, వీక్లీఆఫ్, డేఆఫ్ తదితర సందర్భాలలో ఎఫ్‌ఆర్ఎస్ నమోదు చేయకపోవడం వల్ల ఉద్యోగులు హాజరు నమోదుకావడం లేదన్నారు. మహిళలకు ప్రత్యేకంగా వర్తించే ఐదు లీవ్‌లను ఆప్‌లోడ్ చేయాలని, ఫీల్డ్ స్టాఫ్‌కు ఎఫ్‌ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సురేష్‌బాబు

ఒంగోలుక్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఎన్.సురేష్‌బాబును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 20మంది డీఎస్పీలను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈక్రమంలో ప్రస్తుతం జిల్లాలో ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న ఎస్బీ డీఎస్పీ పోస్టులో ప్రస్తుతం ఒంగోలు పోలీసు శిక్షణ కాలేజీలో పనిచేస్తున్న సురేష్‌బాబును నియమించారు. ఆయన గతంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ డీఎస్పీగా పని చేశారు. అంతేకాకుండా ఎస్ఐగా పలు ప్రాంతాలలో పనిచేసిన అనుభవం ఉంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు, జరుగుమల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు బాధితులకు దాదాపు రూ. 3.42 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం తన స్వగృహంలో అందజేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మంత్రి స్వామికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు కార్పొరేషన్‌లో 125 మంది కార్మికులను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించడాన్ని ఖండించారు. వీరిలో 50 మంది ఆప్కాస్ ద్వారా పనిచేస్తుండగా మరో 75 మంది కరోనా సమయంలో ప్రాణాలుతెగించి ప్రజలకు సేవ చేసిన కార్మికులు ఉన్నారని తెలిపారు. చాలీచాలని జీతాలతో కార్పొరేషన్‌లో పని చేస్తున్న వారిని తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికుల పోరాటాలకు మద్దతు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం, నగర పాలకసంస్థ అధికారులు వెంటనే వారి సమస్యలపై చర్చించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శివప్రసాద్‌రెడ్డి కోరారు.

ఆధార్ స్పెషల్ క్యాంపు పరిశీలన

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని 1వ సచివాలయంలో జరుగుతున్న ఆధార్ స్పెషల్ క్యాంపును శుక్రవారం జడ్పీ సీఈవో బి.చిరంజీవి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మద్యం దుకాణం వద్దంటూ రాస్తారోకో



కర్నూలురోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఒంగోలు క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం వల్ల తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని, దీనిని ఇక్కడ నుంచి తొలగించాలంటూ శుక్రవారం రాత్రి ఒంగోలు నగరం పాలకేంద్రం వద్ద కర్నూల్ రోడ్డుపై మహిళలు బైఠాయించి రాస్తారోకో చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడమే కాకుండా అనధికారికంగా పర్మిట్ రూం ఏర్పాటు చేసి అక్కడే మద్యం తాగి గొడవలు చేస్తున్నారని పీర్లమాన్యం ప్రాంతంలో ఉన్న పలువురు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కర్నూలురోడ్డుపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న తాలుకా సీఐ అజయ్‌కుమార్ సిబ్బందితో వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్రమద్ధీకరించారు.

ఘనంగా లాస్యగ్రాండ్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ నవీన్‌కుమార్ తదితరులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లోని లాస్య గ్రాండ్ రెస్టారెంట్ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెస్టారెంట్ చైర్మన్ ఎ.నవీన్‌కుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో తమ రెస్టారెంట్ అత్యంత ప్రజాదరణ పొందిందని, దానికి కారణం ప్రజల అభిరుచులకు తగిన విధంగా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేయటమేనని చెప్పారు. అదేవిధంగా ఆధునిక హంగులతో తమ రెస్టారెంట్‌లో ఏర్పాటుచేసిన ఫంక్షన్ హాలుకు సైతం మంచి ఆదరణ లభించిందన్నారు. వినియోగదారుల కోసం లాటరీ పద్ధతిలో గోల్డ్ కాయిన్ అందజేసే స్కీమును సైతం తాము నిర్వహిస్తున్నామన్నారు. రెస్టారెంట్ అభివృద్ధికి సహకరించిన వినియోగదారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్ కుటుంబసభ్యులు, పరిమి శ్రీనివాసరావు, మేనేజర్ రాజు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండలంలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రిమ్స్‌లో బాధితురాలిని పరామర్శించిన అనంతరం ఆమె చదువుకుతున్న స్కూలును సందర్శించారు. అత్యాచారం జరిగినట్లుగా ప్రాథమిక ఆధారాలు ఉన్నందున నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న హరిబాబు

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఆశ్రమం రోడ్డులో రూ.10లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ రామాంజనేయులు, ఆర్‌వీ.సురేష్‌బాబు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సుబ్బారావు, సతీష్, రామారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలి

మద్దిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని నాగన్నపాలెం, లింగంగుంట గ్రామంలో ఏవో కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, కంది పంటలను సాగు చేసుకోవాలని, వాటి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

● హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్

మర్రిపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖా అధికారి పెరుగు శ్రీనివాస్ ప్రసాద్ కోరారు. శుక్రవారం మర్రిపూడి, అంకేపల్లి గ్రామాలల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పక్కా గృహాలు నిర్మించుకొని బిల్లులు రాని లబ్ధిదారులకు త్వరలో బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కొండపి డీఈ సత్యనారాయణ, ఏఈ వెంటేశ్వర్లు, ఏపీవో రాంబాబు, ఏపీఎం కోటేశ్వరరావు ఉన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

● పీడీ జోసఫ్‌కుమార్

టంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ జి.జోసఫ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన టంగుటూరులో గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించి ఎన్‌ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మంజూరైన 76 గోకులం షెడ్లలో 7 మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని పీడీ సిబ్బందికి సూచించారు. ఈసమావేశంలో ఎంపీడీవో దేవసేనకుమారి, ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ సుభాషిణి, ఈసీ, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామసభలో 100 అర్జీలు

నర్సింగోలు(జరుగుమల్లి), నవంబరు 8: రీసర్వే జరిగిన నర్సింగోలు గ్రామంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విస్తీర్ణంలో తేడాలను సరిచేయాలని 50 మంది, ఉమ్మడి భూములను సర్వేచేసి విడగొట్టాలని కోరుతూ 41, పట్టాదారుగా తమ పేర్లు నమోదు చేయాలని కోరుతూ 9 మంది అర్జీలు ఇచ్చారు. మొత్తం 100 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బి.జనార్దన్ తెలిపారు. సర్వేయర్ బాబూరావు, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్ర్కీనింగ్ పరీక్ష వాయిదా

ఒంగోలు నగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించాల్సిన స్ర్కీనింగ్ పరీక్ష వాయిదా వేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5,050 మంది ఎస్సీఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా పడిందన్నారు. కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున ఈ పరీక్షను వాయిదా పడిందని, ఈ పరీక్షను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ముప్పరాజుపాలెం రహదారి అధ్వానం

ఇటీవల వర్షాలకు

తీవ్రంగా దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు





గోతులమయంగా మారిన అనకర్లపూడి-ముప్పరాజువారిపాలెం

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు మరింత గోతులమయమయ్యాయి. మండలంలోని పెట్లూరు నుంచి గుర్రప్పడియ వెళ్లేరోడ్డు, కోయవారిపాలెం నుంచి జాళ్లపాలెం వెళ్లే రోడ్డు, వెన్నూరు నుంచి కట్టుబడివారిపాలెం వెళ్లే రోడ్డుకు గోతులు పడ్డాయి. కొండపి నుంచి ముప్పరాజుపాలెం వెళ్లే రోడ్డు దాదాపు రెండున్నర కిలోమీటర్లు అధ్వానంగా తయారైంది. పదిహేనేళ్ల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా తారు, కంకర చిప్స్ లేచిపోయి రోడ్డు వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో వేసిన జాళ్లపాలెం నుంచి కొండపి వరకు వేసిన తారురోడ్డు కూడా అక్కడక్కడా తారు లేచిపోయి గోతులమయంగా మారింది. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేపల మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి స్వామి

సింగరాయకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ఏఎంసీ వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం పరిశీలించారు. మార్కెట్‌లో చేపల వ్యాపారం చేసుకొనే మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మార్కెట్‌లో మరుగుదొడ్లు లేకపోవడం వలన అవస్థలు పడుతున్నామని, పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇక్కట్లు వస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో మరుగుదొడ్లు నిర్మిస్తామని, పార్కింగ్‌కు కూడా స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్‌లో పారిశుధ్య సమస్య లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అనంతరం విద్యుత్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అక్కడ కూరగాయలు, ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తామని, మరో పక్క కార్ల స్టాండ్‌కు స్థలం కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్ టీడీపీ నేతలు చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, అంకమరావు తదితరులు పాల్గొన్నారు.



చేపలమార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

11న ఒంగోలులో మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి ● మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు వెల్లడి ● మాదిగలు తరలిరావాలని పిలుపు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు వర్గీకరణ చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని, అందులో భాగంగా ఈనెల 11న ఒంగోలులో భారీగా తలపెట్టిన మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశానికి నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఆయా రాష్ట్రాల నిర్ణయాలకే ఇచ్చారన్నారు. ఈనెల 5న సీఎం చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి వర్గీకరణ త్వరితగతిన అమలు చేయాలని కోరారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా మంద కృష్ణమాదిగ అన్ని జిల్లాల్లో పర్యటించి మాదిగలను చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు మాట్లాడుతూ ఈనెల 11న ఒంగోలులోని మునిసిపల్ ఆడిటోరియం ఆవరణంలో సభ ఏర్పాటు చేశామని, దీనికి మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మాదిగలకు మేలు జరిగిందన్నారు. కాగా మంద కృష్ణ రాక సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ, మాదిగ సాంస్కృతిక, సంప్రదాయ డప్పు కళ నృత్యాలు ఏర్పాటు చేస్తామని, సుమారు పదివేల మంది కార్యకర్తలతో బహిరంగ సభ, ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదిగ సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బిక్షాలు, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు సర్వేపల్లి రవిరాజ్‌కుమార్, కత్తి ఐజక్, తిరువీధి బాబు, నరసింగరావు, వర్ల దేవదాసు, కిషోర్ కుమార్, రాజారావు, నిరంజన్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆమోదం లేకుండా తీర్మానాలా..

● పంచాయతీ కార్యదర్శులపై సర్పంచ్‌ల ఆగ్రహం

● మండల సమావేశంలో చర్చ

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల ఆమోదం లేకుండా కొన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు పెట్టినట్లు తీర్మానం చేయడంపై పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు ఎం.రామానాయుడు, షేక్.పాత్యాసాహెబ్, ఇ.విజయలక్ష్మి, టి.వెంకటరెడ్డి, ఎస్.పుల్లయ్య, ఒ.బలరామిరెడ్డి, ఎంపీటీసీ కె.సుబ్బారావు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌కె.రంతుల్లా, వైస్ ఎంపీపీ మండవ సులోచన, టి.రాగమ్మ తదితరులు సర్పంచ్‌లు ఆమోదం లేకుండా కార్యదర్శులు తీర్మానాలు చేయడంపై మండిపడ్డారు. అంతా మీరే చేసుకుంటే సర్పంచ్‌లు ఎందుకని ప్రశ్నించారు. గ్రామాల్లో చేసే ప్రతిపనికి సర్పంచ్‌ల ఆమోదం లేకుండా పనులు చేపట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుగ్రామాల్లో తాగునీరు పరిశుభ్రంగా లేదని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీడీవో డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



పేర్నమిట్టలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం పేర్నమిట్టలో అంగనవాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు అందించే భోజనం, వారికి ఇచ్చే కోడిగుడ్లు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంతనూతలపాడులోని ఏపీఆర్‌ఎస్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనం నాణ్యంగా ఉంటుందా లేదా అని అడిగితెలుసుకున్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్నభోజనాన్ని విద్యార్థులకు వడ్డించి ఆయన వారితో భోజనం చేశారు. భోజనం మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పీడీ మాధురి, డీఎస్‌వో పద్మశ్రీ, సోషల్‌వెల్ఫేర్ డీడీ లక్ష్మణ్‌నాయక్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, తూనికల కొలతల అధికారులు రియాజ్, మోనోసిస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు కార్పొరేషన్: నగరంలోని పలు కార్పొరేషన్, అంగన్‌వాడీ కేంద్రాలను రెండు రోజులపాటు జిల్లా పర్యటనలో భాగంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీనగర్‌లోని మునిసిపల్ స్కూలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని మధ్యాహ్న భోజనం, వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలను ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

చీమకుర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణం గరికమెట్టలో నూతనంగా నిర్మించిన శ్రీసీతా రామంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, లక్ష్మీ, కృష్ణ, ధ్వజ, శిఖర కలశ సహిత శ్రీసీతా లక్ష్మణ హనుమత్సమేత సీతారామాంజనేయస్వామి విగ్రహలను శాస్త్రయుక్తంగా ప్రతిష్ఠించారు. కుంభాభిషేకాన్ని జరిపి ఉత్సవమూర్తులకు కళ్యాణాన్ని నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, కౌన్సిలర్ ఇందిరా సుందరరామిరెడ్డి తదితరులు పూజలు జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు మహోత్సవంలో పాల్గొన్నారు. కమిటీ వారు అన్నదానాన్ని జరిపారు.



ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు



మూలవిరాట్‌లకు హారతి ఇస్తున్న అర్చకుడు

నాణ్యమైన విద్యనందించాలి : మంత్రి



మంత్రి స్వామిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుకు నాణ్యమైన విద్యనందించాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఉపాధ్యాయులకు సూచించారు. తూర్పునాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యేయేతర సిబ్బంది శుక్రవారం మంత్రి డాక్టర్ స్వామిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. పాఠశాల హెచ్‌ఎం సుధారాణి మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఉపాధ్యాయులంతా మంత్రికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. పాఠశాల అభివృద్ధి విషయంలో పూర్తి బాధ్యత తనదేనని అన్నారు. ఇందుకు పాఠశాల సిబ్బంది మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అక్షరాస్యతకు ఉల్లాస్ దోహదం



మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా మార్చేందుకు దోహదపడుతుందని ఎంపీడీవో జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడులో మండల పరిషత్ మీటింగ్ హాలులో ఏపీఎం సుబ్బారావు అధ్యక్షతన ఉల్లాస్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని కీర్తిపాడు, ఘడియపూడి, వెల్లంపల్లి, గుండ్లాపల్లి, పెద్దకొత్తపల్లి, దొడ్డవరం, సీతారాంపురం, ఇనమనమెళ్లూరు, లింగంగుంట, రాచవారిపాలెం గ్రామాల్లో ఉల్లాస్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంఈవో అంజనేయులు, ఉపసంచాలకులు కీర్తి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సురేఖ, డివిజనల్ పర్యవేక్షకులు టి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు హేతువాద సంఘ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలు శని, ఆదివారాల్లో స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరుగుతాయని సంఘ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభల్లో సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాళ్ళ సుబ్బారావు, మానవ వికాస వేదిక నాయకులు సాంబశివరావు, విజ్ఞానదర్శిని అధ్యక్షుడు రమేష్, డాక్టర్ సమరం, ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్, బీరం సుందరరావు తదితరులు హాజరవుతారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో ఆది, సోమవారాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు దర్శిలో టీటీడీ కళ్యాణమండపం శంకుస్థాపన కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి హాజరవుతారు. సోమవారం ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో పార్వతీపరమేశ్వరుల దర్శాల సేవా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతర నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు.

12న కృత్రిమ కాళ్ల కోసం ప్రత్యేక శిబిరం

ఒంగోలు నగరం, నవంబరు 8(ఆంధ్రజ్యో): జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లను పంపిణీ చేసేందుకు ఈనెల 12వ తేదీన ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక ప్రకాశంభవనంలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఈ శిబిరం జరుగుతుందని, అర్హులైన దివ్యాంగులు హాజరుకావాలని కోరారు. ఆధార్‌కార్డు, సదరం వైద్యపత్రం, రేషన్‌కార్డు, రెండు పాస్‌సైజు ఫొటోలు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలకు మండలంలోని కె. ఉప్పలపాడు హైస్కూల్ విద్యార్థులు కె.రేష్మ, సీహెచ్ పుష్పబిందు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎంపికైన బాలికలను శుక్రవారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వి. సుసన్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.రవికిరణ్‌కుమార్ అభినందించారు. ఎంపికైన బాలికలు ఈనెల 9 నుంచి బాపట్ల జిల్లాలో జరిగే పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారు.

కామేపల్లి జడ్పీస్కూల్ నుంచి....

రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలకు కామేపల్లి జడ్పీస్కూల్‌కు చెందిన పల్లపు అభిలాష్ ఎంపికయ్యారని స్కూల్ హెచ్‌ఎం ఎల్ అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. అభిలాష్‌ను హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచంద్రరావు అభినందించారు.

నేడు స్కూళ్లకు పనిదినంగా ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా నాలుగు రోజుల పాటు పాఠశాలలు కొనసాగలేదని, అందువల్ల రెండో శనివారం పనిదినంగా ప్రకటించాలని ఏపీటీసీఏ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ శనివారం పనిదినంగా ప్రకటిస్తూ పాఠశాలలు జరుపుకోవచ్చని డీఈవో ఆదేశాలు కూడా జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాంటిస్సోరి ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మయ్య, ఆంధ్రా శ్రీనివాస్, ఆర్కిడ్స్ అజయ్, ప్రజ్ఞ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు (కల్చరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్చకబృందం చతుర్వేద పారాయణ, నాద నీరాజనం, విష్ణు సహస్రనామ పారాయణ మొదలైన క్రతువులను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. దేవస్థాన పాలకమండలి చైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారిలు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రానైట్ వాహనాలు సీజ్



పట్టుబడిన లారీలు

చీమకుర్తి, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : రామతీర్థం ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి, కంకర రవాణా చేస్తున్న గ్రానైట్ పరిశ్రమకు చెందిన వాహనాలను శుక్రవారం మైన్స్ అధికారులు సీజ్ చేశారు. ఆరు కంకర లారీలను, మట్టి రవాణా చేస్తున్న ఒక లారీలను సీజ్ చేసి ఏపీఎండీసీ ఆవరణలో ఉంచారు.

12న ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణ కార్యక్రమం



ఆహ్వానపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో గల 60 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లకు ఈనెల 12న స్థానిక యూనివర్శిటీ హాలులో మై భారత్ పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను స్థానిక యూనివర్శిటీలో వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, గౌరవ అతిథిగా హైదరాబాద్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన రీజనల్ కో ఆర్డినేటర్ ఎం.రామకృష్ణ, యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ రామమోహన్ తదితరులు హాజరవుతారన్నారు. యూనివర్శిటీ పరిధిలోని ప్రోగ్రాం ఆఫీసర్లందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

దొడ్డవరం పంచాయతీలో డీఎల్‌పీవో విచారణ

మద్దిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దొడ్డవరం పంచాయతీలో నెలకొన్న ఆర్థిక అవకతవకలపై సర్పంచ్ పూనూరి సుబ్బారావు గతంలో మీకోసం ద్వారా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ఈనేపథ్యంలో డీఎల్‌పీవో ఆర్.పద్మ శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మండల విస్తరణ అధికారి రఘుబాబు, సర్పంచ్ పూనూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు సుభాషిణి, గత కార్యదర్శి షేక్ లతీఫ్ హాజరయ్యారు. విచారణలో భాగంగా రఘుబాబు సంజాయిషీ సమర్పించారు. అనంతరం చెత్తసంపద కేంద్రాన్ని డీఎల్‌పీవో పరిశీలించారు. చెత్త సంపద కేంద్రం పరిసరాల్లోని చిల్లచెట్లని వెంటనే తొలగించాలని, ట్రైసైకిల్‌ను రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

పొన్నలూరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పొన్నలూరులోని విప్పగుంట సెంటర్లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. కేన్సర్ కారకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. సమావేశంలో సుబ్బారావు, శైలజమ్మ, సురేష్‌బాబు పాల్గొన్నారు.


ఒంగోలులో న్యాయవాదుల బైక్ ర్యాలీ

కదంతొక్కిన న్యాయవాదులు

● నగరంలో ర్యాలీ ● సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఒంగోలుక్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ కోర్టులో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలంటూ న్యాయవాదులు కదంతొక్కారు. ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణం నుంచి ప్రకాశం భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కలెక్టర్‌కు తమ సమస్యలను వివరించారు. జాయింట్ కలెక్టర్ తమ పట్ల వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదన్నారు. అదేవిధంగా న్యాయవాదులకు జిల్లా కోర్టులో కల్పిస్తున్న సౌకర్యాలు జేసీ కోర్టులో కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహనదాస్ మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులను సైతం జేసీ కోర్టులో అసౌకర్యానికి గురిచేస్తున్నారని తెలిపారు. ఆ కేసులను కలెక్టర్ తీసుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్, సీనియర్ న్యాయవాదులు కరవది రాఘవరావు, ఆలపాటి వివేకనంద, బి.శ్రీనివాసరావు, బొడ్డు భాస్కరరావు తదితరలు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కష్టాలు

ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

వేలిముద్రలు పడక పరుగులు

కేంద్రాల ఎదుట బారులు


పోస్టాఫీసు వద్ద ఆధార్ మార్పు కోసం అవస్థలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునేందుకు ప్రజానీకం కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా ఆధార్‌ను అనుసంధానం చేస్తుంది. ఆధార్ కార్డులు ఉన్నా వేలిముద్రలు సక్రమంగా పడకపోతుండటంతో ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో వారంతా ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ అనుమతి పొందిన కేంద్రాల్లో మాత్రమే ఆధార్‌ను అప్‌డేట్ చేసేందుకు అవకాశం ఉంది. ప్రైవేటు కేంద్రాల్లో ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తుండటంతో బ్యాంకులకు క్యూకడుతున్నారు. దీంతో ఒంగోలులోని ఏ బ్యాంకు వద్ద చూసినా మహిళలు ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునేందుకు భారీగా చేరుతున్నారు. మరోవైపు జిల్లా పోస్టాఫీసుకు మహిళలు భారీగా తరలివచ్చారు. ఒంగోలు నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఉదయం 8 గంటలకే ఆయా బ్యాంకుల వద్దకు వచ్చి క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

చెరువుల ఆధునికీకరణకు చర్యలు

● సమగ్ర నివేదికలు రూపొందించాలి

● అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆధునికీకరణ పనులకు సమగ్ర నివేదికలతో పాటు ప్రతిపాదనలను రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సాగునీటి చెరువులు, కాలువల అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. అవన్నీ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పనులకు సంబంధించి సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. జిల్లాలో త్వరలో జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వరలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై ఎటూ తేలని విచారణ

తలపట్టుకుంటున్న పోలీసులు

టంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి విచారణ ఎటూ తేలడం లేదు. జరిగిన విషయాన్ని బాధితురాలు అధికారులకు స్పష్టంగా చెప్పలేకపోతోంది. దీంతో వారు తలపట్టుకుంటున్నారు. కారుమంచికి చెందిన పదేళ్ల బాలిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. రోజూ లాగానే గురువారం కూడా పాఠశాలకు వెళ్లింది. ఇంటికి వచ్చిన తర్వాత బాలిక దుస్తులపై రక్తపు మరకలు ఉండడంతో తల్లి అనుమానించి ఓ ప్రైవేట్ వైద్యుని వద్దకు తీసుకెళ్లింది. వైద్యుడు పరీక్షించి వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తీసుకువెళ్లమని సూచించారు. వెంటనే వారు ఒంగోలు రిమ్స్‌లో బాలికను చేర్చారు. అక్కడి వైద్యులు బాలికను ఏం జరిగిందని ప్రశ్నించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇప్పించారు. దీంతో పోలీసులు గురువారం బాలికను ప్రశ్నించగా రెండు రకాల సమాధానాలు చెప్పింది. ఒకసారి క్లాస్ సైన్స్ టీచర్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, మరోసారి తోటి విద్యార్థిని వల్ల రక్తం వచ్చిందని తెలిపింది. తొలి రోజున సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు విచారించారు. శుక్రవారం డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావులు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో బాలికను విచారించారు. వీరడిగే ప్రశ్నలకు బాలిక పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారంతా తలలు పట్టుకు కూర్చున్నారు. పదేపదే విచారణలతో ఆ బాలిక భయపడుతుందని అధికారులు అనుమానిస్తున్నారు.

మూడోరోజూ కొనసాగిన విచారణ

పలు లోపాలను గుర్తించిన అధికారుల కమిటీ

ఒంగోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణ మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో కమిటీ సభ్యులు పలు కీలక ఫైళ్లను పరిశీలించారు. దాదాపు 25 నుంచి 30 అంశాలపై ఫిర్యాదులు అటు ప్రభుత్వానికి, ఇటు కలెక్టర్‌కు వివిధ వర్గాలకు చెందిన వారి నుంచి అందాయి. వాటన్నింటికి సంబంధించిన ఫైళ్లను అధికారుల కమిటీ పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల లబ్ధిదారులు, రైతులు, బ్యాంకుకు చెందిన వివిధ బ్రాంచిలలో జరిగిన అవకతవకలపై తదుపరి జరిగే విచారణలో సమగ్రంగా చూసే అవకాశం ఉంది. ప్రాథమికంగా జిల్లా కేంద్ర బ్యాంకు సెంట్రల్ ఆఫీసులో అందుకు సంబంధించిన ఫైళ్లను వారు పరిశీలన చేసినట్లు సమాచారం.

కొత్త విషయాలు వెలుగులోకి..

అలాగే బ్యాంకు సెంట్రల్ ఆఫీసుతో పాటు వివిధ బ్రాంచిలలో మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో నిధులు వాడకం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పేరుతో కొందరికి వేతనాలు చెల్లింపు తదితర అంశాలలో అవకతవకలు జరిగిన విషయాన్ని వారు గుర్తించినట్లు తెలిసింది. కాగా ఆయా అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించే క్రమంలో కొన్నింటిపై పాలకమండలి సమావేశంలో చేసిన తీర్మానాలకు అనుగుణంగా తొలుత వ్యవహరించామని బ్యాంకు అధికారులు వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే పాలక మండలి సమావేశంలో వాటికి సంబంధించి ఎప్పుడు ఆ తీర్మానాలకు ఎప్పుడు ఆమోదం తెలిపారు, ఎప్పుడు అమలు చేపట్టారు, సంబంధిత అంశాలను మినిట్స్ పుస్తకంలో నోట్ చేశారా లేదా? అనే కోణంలో కూడా విచారణ కమిటీ పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా అంశాలపై పరిశీలన చేసే క్రమంలో మరికొన్ని విషయాలు వెలుగు చూస్తుండటంతో వాటిపై అనుమానాలను నివృత్తి చేసుకునే విధంగా వారు పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బ్యాంకులోని ఒకరిద్దరు ఉద్యోగులు విచారణ కమిటీ సభ్యుల చుట్టూ చేరి వారిని తప్పుదోవ పట్టించే విధంగా, ఏమి అవకతవకలు జరగలేదన్న భావన కలిగేలా ప్రయత్నించినట్లు సమాచారం. వారిని పరిగణనలోకి తీసుకోకుండా కమిటీ ప్రధాన అధికారి లోకేశ్వరరావు తన విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. శనివారంతో ప్రాథమిక విచారణ పూర్తి చేసి అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందించే యోచనలో కమిటీ సభ్యులు ఉన్నట్లు సమాచారం.

ఉచితానికి ఈకేవైసీ కష్టాలు

● నమోదైతేనే లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు

● గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి

● నష్టపోతున్న పలువురు పేదలు

● జిల్లాలో 1.5 లక్షల మంది దూరం



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 : జిల్లాలో ఉచిత సిలిండర్ పథకానికి ఈకేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో లబ్దిదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మూడు నెలల నుంచి ఉచిత సిలిండర్ పొందాలంటే తమ గ్యాస్ ఏజెన్సీల వద్ద ఆధార్‌తో లింక్ చేయించుకోవాలని చెబుతోంది. సరైన అవగాహన లేక చాలామంది లబ్ధిదారులు దూరంగా ఉన్నారు. మరోవైపు డెలివరీ బాయ్‌లు సిలిండర్ ఇచ్చే సమయలో తప్పనిసరిగా ఆ లబ్ధిదారుడిని ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం దీపావళి పండుగను పురస్కరించుకొని గతనెల 29 నుంచి ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అయితే జిల్లాలో 6,70,571 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 4,80,711కు సంబంధించిన లబ్ధిదారులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. మరో 1,89,860 మంది చేయించుకోలేదు. అయితే ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభించడంతో ఈ వారంరోజుల్లో మరో 20వేల మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,69,860 మంది స్పందించలేదు.

నమోదులో అనేక ఇబ్బందులు

ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ ఉచిత సిలిండర్లు వస్తాయి. మరోవైపు గ్యాస్ కనెక్షన్ పొందే సమయంలోనే ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాల్సి ఉంది. మరోవైపు గతంలో రేషన్ కార్డు ఉండి ప్రస్తుతం వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంత మంది గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకున్నా అది యర్రర్ చూపిస్తున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లను పొందలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకొని లబ్ధిదారులను గుర్తించి వారి ఇంటి వద్దనే చేయించే విధంగా శ్రీకారం చుట్టారు. ఈ విషయంపై ఇప్పటికే జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గ్యాస్ ఏజెన్సీలతో పాటు తహసీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సిలిండర్లను అర్హులైన వారందరికి అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంత వరకు సాధ్యమనేది ప్రశ్నార్థకంగానే మారింది.

కార్పొరేషన్‌లో మాజీ ఆర్‌ఐ 'గూడు'పురాణీ

● ఇంటిపన్నుకు నకిలీ రసీదుతో యజమానికి టోపీ ● గుర్తించిన యజమాని సీరియస్ కావడంతో మాజీ ఆర్‌ఐ కాళ్లబేరం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మాజీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అఖండ్ 'గూడు' పురాణీ వెలుగులోకి వచ్చింది. నగరంలోని అంజయ్య రోడ్‌లోని ఓ ప్రవేటు కార్డియాక్ హాస్పిటల్ ఉన్న భవనానికి ఆస్తి పన్ను రూ.72వేలు ఉండగా, ఆ పన్ను సొమ్మును కార్పొరేషన్‌కు చెల్లించాలని మాజీ ఆర్‌ఐ ఒత్తిడి పెంచారు. సదరు హాస్పిటల్ యాజమాన్యం హైదరబాదులో ఉండగా, పన్ను డబ్బులు తనకు ఇస్తే తాను కట్టేస్తానని చెప్పడంతో నమ్మిన యజమాని రూ.72 వేలు అఖండ్‌కు అందజేసినట్లు తెలిసింది. అయితే మాజీ ఆర్‌ఐ ఆ డబ్బులను కార్పొరేషన్‌కు చెల్లించకుండానే తన జేబులోకి వేసుకుని, కార్పొరేషన్‌కు చెల్లించినట్లుగా నకిలీ రసీదులు సృష్టించి యజమానికి ఇవ్వడంతో అంతా సద్దుమణిగిపోయిందని భావించారు. ఇటీవల కాలంలో ఆస్తిపన్నుల బకాయిలపై కమిషనరు సీరియస్‌గా దృష్టి సారించారు. ఆస్తి, నీటి పన్నులు వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా, సదరు హాస్పిటల్ యజమాని రూ.72వేలు బకాయి ఉన్నట్లుగా కార్పొరేషన్ అధికారులు తెలిపారు. దీంతో అవాక్కయిన వారు హైదరాబాదు నుంచి ఒంగోలుకు విచ్చేసిన వారు తాము చెల్లించాల్సిన సొమ్ము చెల్లించామని, అందుకు సంబంధించి రసీదులు కూడా తమ వద్ద ఉన్నట్లు కమిషనరు వెంకటేశ్వరరావుకు చూపించారు. ఆన్‌లైన్‌లో ఆ వివరాలు లేకపోవడంతో సదరు మాజీ ఆర్‌ఐ అఖండ్ నకిలీ రసీదు ఇచ్చినట్లుగా తెలిసింది.

దీంతో మోసపోయామని గుర్తించిన సదరు హాస్పిటల్ యజమానులు పోలీసు కేసు పెట్టేందుకు వెళ్లడంతో విషయం తెలుసుకున్న మాజీ ఆర్‌ఐ వారితో కాళ్లబేరానికి వచ్చినట్లు తెలిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి నచ్చజెప్పే ప్రయత్నంతో చేయడంతోపాటు, తప్పు నుంచి బయటపడేందుకు నానా అవస్థలు పడ్డారు. చివరికి సదరు హాస్పిటల్ యజమానులు తిరిగి రాత్రికి హైదరబాదు వేళ్లే క్రమంలో ఆ తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వడంతోపాటు, కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన సొమ్ము కూడా తానే కట్టేస్తానని బతిమాలినట్లుగా సమాచారం. మొత్తంగా ఆర్‌ఐగా ఉన్న సమయంలో అఖండ్ అనే ఉద్యోగి చేసిన అవినీతి అక్రమాలపై ఇప్పటికే కార్పొరేషన్‌లో బహిరంగ రహస్యం. అంజయ్య రోడ్‌లోని హాస్పిటల్ విషయం ఒక్కటే వెలుగులోకి వచ్చిందని, విచారిస్తే మరిన్ని అవినీతి భాగోతాలు బయటకు వస్తాయని కార్పొరేషన్ ఉద్యోగులే వెల్లడిస్తున్నారు. మొత్తంగా ఆర్‌ఐ అఖండ్ చేసిన నిర్వాకం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చనీయాంశమైంది.



నకిలీ రసీదు



తీరనున్న ఇసుక కష్టాలు

(5వ పేజీ తరువాయి)

నేరుగా ఇసుక ఉచితంగా తెచ్చుకునేందుకు అనుమతించింది.

వాగులలో ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చు

జిల్లాలో ఇసుక లభ్యమయ్యే మూసి, గుండ్లకమ్మ, పాలేరు, మన్నేరుకు సంబంధించి మొత్తం 280 ప్రాంతాల్లో ఇసుకను సొంత అవసరాలకు ఉచితంగా తెచ్చుకునే అవకాశం కల్పించారు. అందుకోసం సమీప సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళే విధంగా చర్యలు తీసుకున్నారు. వినియోగదారులు సమీప సచివాలయంలో ఇసుక అవసరానికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకొని ట్రాక్టర్ నంబరు నమోదు చేసి తర్వాత ఇసుక తీసుకెళ్లవచ్చు. అదేవిధంగా పర్యావరణం దెబ్బతినకుండా నదీపరివాహక ప్రాంతాలలో మీటరు లోతులోనే ఇసుక తవ్వకాలు చేయాల్సి ఉంది. ఇంకా ఇసుక లభ్యమయ్యే వాగులు, వంకలలో కూడా ట్రాక్టర్లు ద్వారా తీసుకు వెళ్లే అవకాశం కల్పించారు.

ఆరు ప్రాంతాలలో డిపోలు

అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో సరిహద్దు జిల్లాల నుంచి తెచ్చి ఆరు ప్రాంతాల్లో డిపోలు ఏర్పాటు చేశారు. కేవలం రవాణా చార్జీలు మాత్రమే తీసుకొని ఇసుకను అందించేందుకు జిల్లా యత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శిలో ఇసుక డిపోలను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఇసుక సరఫరా చేయనున్నారు. టన్ను ఇసుక ఒంగోలు డిపోలో రూ.980, గిద్దలూరు రూ.1,200, మార్కాపురం రూ.1,280, ఎర్రగొండపాలెంలో రూ.1,500, కనిగిరి రూ.980, దర్శిలో రూ.1,230గా ధర నిర్ణయించారు. నెల్లూరు, సంగం బ్యారేజీల వద్ద నుంచి ఈ ఇసుకను ప్రైవేటు ఏజెన్సీలు తెచ్చి నిల్వ ఉంచి సరఫరా చేస్తాయి. అందుకోసం ప్రైవేటు ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ కోరింది.

12లోపు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలో ఇసుక డిపోలు నిర్వహణకు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. కమిటీ సమక్షంలో ఈనెల 14న ఏజెన్సీలు ఎంపిక చేస్తామన్నారు. ఇతర వివరాలు, దరఖాస్తులు చేసుకునేందుకు జిల్లా మైనింగ్ అధికారిని సంప్రదించాలన్నారు.

ఆరు డిపోలు ఏర్పాటు చేస్తున్నాం

జిల్లాలో ఇసుక సరఫరా కోసం ఆరు ప్రాంతాల్లో డిపోలను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేసేందుకు జిల్లా ఇసుక స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంది. రీచ్‌లు లేనందువల్ల సరిహద్దు జిల్లాల నుంచి ఇసుక తరలించి కేవలం రవాణా చార్జీలు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. అలాగే యేర్లు, వాగులు, వంకలలో కూడా ఇసుకను సొంత అవసరాల కోసం తీసుకెళ్లే వారు సమీప సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తద్వారా ఉచితంగా ఇసుకను పొందవచ్చు. పర్యావరణం దెబ్బతినకుండా ఇసుక తవ్వకాలు చేపట్టాలి. దీనిపై ఎటువంటి అనుమానాలు ఉన్నా 9391846770, 9441009597 నంబర్లకు సంప్రదించవచ్చు.

- రాజశేఖర్, మైనింగ్ జిల్లా అధికారి

వైద్యం అందక జ్వరంతో చిన్నారి మృతి

దంపతుల మధ్య విభేదాలే పరిస్థితి తీవ్రతకు కారణం


మృతిచెందిన చిన్నారి

దర్శి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : దంపతుల విభేదాలతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. కొంతమంది చిన్నారుల జీవితాలు హృదయ విదారకరంగా ముగుస్తున్నాయి. మండలంలోని చలివేంద్ర కొండపైన మృతిచెందిన చిన్నారి ఉదంతం చూస్తే కళ్లు చమర్చుతున్నాయి. భగవంతుడు ఆ పాపకు జన్మనిచ్చిన కొద్ది నెలలకే హృదయవిదారకంగా ముగింపు పలికారు. స్థానికుల కథనం ప్రకారం.. దర్శి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌కు చెందిన చల్లా నందినికి సంతనూతలపాడుకు చెందిన యువకుడితో కొద్ది సంవత్సరాల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య పొరపొచ్చాలతో రెండేళ్ల క్రితం విడిపోయారు. ఆమె హైదరాబాద్ వెళ్లి ఒకరితో వివాహేతర సంబంధం ఏర్పడగా, ఒక చిన్నారి జన్మించింది. ఆ పాప పుట్టినప్పటి నుండి వారిద్దరి మధ్య కూడా విభేదాలు తలెత్తాయి. ఆ చిన్నారికి ఫిట్స్ వ్యాధి పుట్టుకతో వచ్చింది. ఈనేపథ్యంలో నందిని హైదరాబాద్ నుంచి గత బుధవారం దర్శికి వచ్చింది. బిడ్డకు తీవ్రమైన జ్వరం రావటంతో దర్శిలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ వద్ద చూపించింది. కుటుంబసభ్యులతో గతంలోనే వివాదం నెలకొనటంతో ఆమె ఇంటికి వెళ్లలేదు. చలివేంద్ర కొండపై గల వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల సత్రంలో తలదాచుకునేందుకు బుధవారం రాత్రి వెళ్లారు. ఆ రాత్రి నందిని కుమార్తె ఏడు నెలల చిన్నారికి జ్వరం అధికం కావటంతో మృతి చెందింది. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోక ఆ పాప మృతదేహాన్ని కొండపైన చెట్లలో వదిలేసి వెళ్లిపోయింది. తల్లి కనిపించకుండా పోవటంతో గురువారం ఆ చిన్నారి ఎలా చనిపోయిందో తెలియక రకరకాలుగా ఊహాగానాలు వినిపించాయి. ఈనేపథ్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ చిన్నారికి శుక్రవారం పోస్టుమార్టం చేసే క్రమంలో పాప తల్లి అనుకోకుండా అక్కడకు వచ్చింది. ఆమె రాకతో అసలు వాస్తవం బయటపడింది. చిన్నారి మృతిపై ప్రజలు చలించిపోతున్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు అనేక కుటుంబాలకు శాపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్

ఈపూరుపాలెం ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతలు



చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంబంధిత శాఖ ఉన్నత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలలుగా చీరాలకు సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు రెండు స్థానాల్లో బాధ్యతలు ఉండడంతో సమస్యల పరిష్కారంలో ప్రజలు ఒకింత అసంతృప్తిలో ఉన్నట్లు చెప్పాలి. ఎట్టకేలకు రెగ్యులర్ అధికారిని నియమించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నట్లుయింది. మొయిన్ డీజీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్ నుంచి చీరాలకు రానున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈపూరుపాలెం ఎస్సైగా అంబటి చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలల కిందటే ఆయనకు పోస్టింగ్ కల్పించినా అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఎట్టకేలకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధుల్లో ఉన్న శివకుమార్ ఎస్బీ విభాగానికి వెళ్లారు. చంద్రశేఖర్‌కు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రైలులో మత్తు పదార్థమిచ్చి దోపిడీ

» ఒంటరిగా ఉన్న మహిళ వద్ద 13 సవర్ల బంగారం అపహరణ

» చీరాల ఏరియా వైద్యశాలలో బాధితురాలికి చికిత్స

చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా రైలులో ప్రయాణిస్తున్న మహిళపై మత్తు పదార్థాన్ని చల్లి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. అందిన వివరాల ప్రకారం చెన్నైకు చెందిన అనూరాధ పర్చూరులోని చెల్లి వద్దకు ఒంటరిగా పినాకిని రైలులో బయలు దేరారు. ఈక్రమంలో ఆమె ఒంటిపై సుమారు 13 సవర్ల బంగారు ఆభరణాల ఉండడం చూసిన దుండగులు కన్నేశారు. ఆమె వద్ద కూర్చుని మాటలు కలిపారు. ఈక్రమంలో పర్చూరు నుంచి సోదరి ఫోన్‌లో నెల్లూరు వచ్చేవరకు బాగానే మాట్లాడింది. ఆ తరువాత నుంచి ఫోన్ అందుబాటులో లేదు. అయితే కూడా కూర్చున్న దుండగులు ఒక్కసారిగా అనూరాధ ముఖం మీద పదార్థాన్ని ఉపయోగించి స్పృహ కోల్పోయేలా చేశారు. బంగారు ఆభరణాలు, రూ.2వేల నగదు, ఫోన్ అపహరించి వెళ్లిపోయారు. కొద్దిసేపటికే కొద్దిగా స్పృహలోకి వచ్చిన బాధితురాలు దొంగతనం జరిగిందంటూ అటుఇటు తిరుగుతుండగా సహ ప్రయాణికులు ఆమెను ఆరా తీశారు. విషయం తెలుసుకుని చీరాల రైల్వే స్టేషన్‌లో దించి పోలీసులకు అప్పగించారు. దీంతో వారు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆధునిక పద్ధతులతో లాభసాటి సాగు

» రైతులకు ఎమ్మెల్యేలు ఏలూరి, వర్మ పిలుపు

» న్యూజిలాండ్‌లో వ్యవసాయ క్షేత్రాల సందర్శన


న్యూజిలాండ్‌లో ఆధునిక యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

పర్చూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాశ్చాత్య దేశాల్లో రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాగును లాభసాటిగా మార్చుకున్నారని, ఆ విధానాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ అన్నారు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా అక్కడ వివిధ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి అధ్యయనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. న్యూజిలాండ్‌లో వాతావరణ పరిస్థితులు, పంటలు, తెగుళ్ళు, వ్యాధులను గుర్తించేందుకు రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. నీటి పొదుపును పాటిస్తూ అవసరాలకు అనుగుణంగా జల వనరులను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు నూతన యంత్ర పరికరారాలు వాడేలా, ఆధునిక సాగు పద్ధతులు అనుసరించేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాల న్నారు. యువ రైతులు ఆధునిక పద్ధతులతో అద్భుతాలు సృష్టిస్తున్నారని గుర్తు చేశారు.

విద్యుత్ శాఖ మంత్రితో భేటీ

న్యూజిలాండ్ విద్యుత్ శాఖ మంత్రి సిమియన్ బ్రౌన్‌తో ఎమ్మెల్యేలు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మ భేటీ అయ్యారు. విద్యుత్ సిస్టమ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ రంగంలో ప్రధానంగా జలశక్తి, భూ ఉష్ణ శక్తి, పవన శక్తిని ఉపయోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించినట్లు ఏలూరి తెలిపారు. విద్యుత్ రంగంలో నూతన సంస్కరణలను అమలు చేస్తున్నామని బ్రౌన్ చెప్పారని అన్నారు.

పంచారామాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు

పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో దర్శించుకునేందుకు అద్దంకి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. 10, 17, 24 తేదీ లలో రాత్రి 8 గంటలకు బయలుదేరుతాయన్నారు. సూపర్‌లగ్జరీకి రూ.2 వేలు, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1600, పల్లెవెలుగుకు రూ.1300 చార్జీ అని తెలిపారు. అరుణాచలం యాత్ర కు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 10, 17, 24 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కాంచీపురం, అరుణాచలం (గిరి ప్రదక్షిణ) ఉంటుందన్నారు. చార్జీ రూ.2వేల రూపాయలని తెలిపారు. అద్దంకి ప్రాంత భక్తులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు.



జిల్లాలో ఆధ్యాత్మిక సౌరభాలకు అంకురార్పరణ జరుగుతోంది. పొదిలి కేంద్రంలో సనాతన ధర్మ వ్యాప్తికి బీజం పడుతోంది. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో రూ.100 కోట్లతో సనాతన ధర్మ సేవా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిగల్ స్వీయపర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక కేంద్రం ఊపిరిపోసుకుంటోంది. నేటి యువతరానికి హిందూధర్మం, భారతీయ సంస్కృతి, కళలు జీవిత నైపుణ్యాన్ని అందించే ఓ బృహత్తర విజ్ఞాన కేంద్రం త్వరలో పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.



క్లాసుల నిర్వహణ

వస్తున్నాయ్.. వస్తున్నాయ్..

సనాతన సౌరభాలు

ఓబులక్కపల్లిలో ఆధ్యాత్మిక సేవా కేంద్రం

- ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న సనాతన ధర్మ సేవా గ్రామం
- వేద, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు
- విద్యాబోధనతోపాటు అనేక అంశాల్లో శిక్షణ



ఆధ్యాత్మిక విద్యాలయం

పొదిలి, నవంబరు 8 : సనాతన ధర్మ సేవా కేంద్రంలో ప్రస్తుతం 6, 7 తరగతులకు విద్యాబోధన కొనసాగుతోంది. వచ్చే ఏడాది 8, 9 తరగతుల విద్యాబోధన కూడా చేస్తారు. శిల్పకళా, నాదస్వరం, వ్యవసాయం, క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. స్థానికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించనున్నారు. క్రీడా కేంద్రంలో విద్యార్థులతోపాటు స్థానిక క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు పోటీలు నిర్వహిస్తారు. 31 ఎకరాల స్థలంలో ఆధునిక హంగులతో శాశ్వత భవననిర్మాణ పనులు పూర్తయ్యాయి. వేదశాల, శాస్త్రీయం, ఇతర ఆధ్యాత్మిక విషయాల అధ్యయనంతోపాటు ఆధునిక విద్యను అందించనున్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

- జి.మాధవి, ప్రిన్సిపాల్



జిల్లాలో ఎక్కడా లేని విధంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించడం కోసం ఈ విద్యాలయం రూపుదిదుకుంటుంది. ప్రస్తుతం 6, 7 తరగతుల క్లాసులు నిర్వహిస్తున్నాం. ఇక్కడ విద్యార్థిని పరిపూరణమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతాం. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పుతాం. ఇతర విద్యార్థులకు కూడా వసతిగృహం ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నాం. ఈ విద్యాలయంలో బాలరకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇక్కడ సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, లెక్కల బోధన ఉంటుంది.

వివిధ రకాల అంశాల్లో తర్ఫీదు



వసతిగృహం

- సాధారణ ప్రజల కోసం కంచి కామకోటి శంకర విద్యాలయం ద్వారా 6 నుంచి 12 తరగతుల వరకు సీబీఎస్‌సీ లేదా స్టేట్ సిలబస్‌తో బోధన చేయనున్నారు.
- స్థానిక ప్రజలకు శిల్పకళా, కుండల తయారీ, హార్టీకల్చర్, అగ్రికల్చర్, టైలరింగ్, ఎలక్ట్రికల్, పంబ్లింగ్, కార్పెంటరీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ డ్రైవింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వనున్నారు.
- సంస్కృతం, సనాతన ధర్మంపై అధ్యయనం చేసేందుకు చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ సంస్కృత్ అండ్ వేదిక్ స్టడీస్‌ను ప్రారంభించనున్నారు.
- విస్తృతమైన గ్రంథాలయంతోపాటు వేదాలు, ఉపనిషత్తులు, వేదాంగాలపై పరిశోధన నిమిత్తం శంకర అద్వైత పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- కంచి కామకోటి త్రివేణి విద్యార్థి వసతిగృహం పేరుతో వైదిక విద్యార్థులు అధ్యాపకుల కోసం పూర్తిస్థాయి ఆచారానికి అనుకూలంగా ఆధునిక వంట సౌకర్యాలతో భోజన సదుపాయం కల్పించనున్నారు.
- 100 మంది విద్యార్థులకు గదులను నిర్మిస్తున్నారు.
- వేదపండితులు అధ్యాపకులు సందర్శనకు వచ్చినప్పుడు ఆధునిక వసతులతో అతిథిగృహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- జయేంద్ర సరస్వతి కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు అవుట్‌పేషెంట్ వైద్యసేవలను అందించనున్నారు.
- భారతీయ గోసంపదను సంరక్షించేందుకు పూర్తిస్థాయిలో గోశాల నిర్మాణం జరుగుతుంది.
- వివిధ హోమాలు, యాగాలు జరిపేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక యాగశాల నిర్మిస్తున్నారు.
- హనుమాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పేరుతో వ్యాయామశాల, అశ్వనీ నక్షత్రం నుంచి రేవతి వరకు 27 నక్షత్రాలకు రకానికి ఒక మొక్క ప్రకారం 27 రకాల మొక్కలతో నక్షత్రవనం ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణం పరిఢవిల్లే విధంగా 10 ఎకరాల్లో మొక్కల పెంపకాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- కళలు, ఫొటోగ్యాలరీ, వేదగ్రంథాల ప్రదర్శన సదుపాయం కల్పించడంతోపాటు యోగా సెంటర్‌ను ఇండోర్ గేమ్స్ కోసం ఇండోర్ స్పోర్ట్స్ రూములను ఏర్పాటు చేస్తున్నారు.



కల్యాణం.. కమనీయం

శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం కంభం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం దేవస్థాన ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు దామోదర వ్రతం, కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- కంభం, ఆంధ్రజ్యోతి





కార్తీకంలో ధరల దడ

పూలు, పండ్లకు గిరాకీ

కొనేందుకు భయపడుతున్న భక్తులు

మహాశివునికి కార్తీక మాసం అత్యంత ప్రీతిపాత్రమైనది. పూజా కార్యక్రమాలు అధికంగా జరుగుతాయి. ఏడాది పొడవునా పూజలు ఒక ఎత్తు అయితే కార్తీక దీపారాధనకు అత్యంత ప్రముఖ్యత ఉంటుందని భక్తుల విశ్వాసం. అయ్యప్ప, శివ, భవాని మాలలు ధరించి దీక్షలు తీసుకుంటారు. ఇప్పటికే వేలాది మంది దీక్షలు చేపట్టారు. దీంతో పూలు, పండ్లకు మంచి గిరాకీ ఏర్పడడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు రూ.20, రూ.30లకే పూజా సామగ్రి వచ్చేవి, ప్రస్తుతం రూ.100 నుంచి రూ.200 ఖర్చు చేయాల్సి వస్తుందని భక్తులు వాపోతున్నారు. పూజా సామగ్రిలో ఉపయోగించే టెంకాయ, పూలు, పండ్లు అన్నీ బయటి నుంచి దిగుమతి చేస్తున్నామని, రేట్లు అందుకే పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

- కంభం, ఆంధ్రజ్యోతి



చీరపై రంగులతో డిజైన్లు వేస్తున్న బాలశంకర్ దంపతులు

రంగు రంగులో.. ఎన్ని హంగులో..!

- చీరలపై డిజైన్లు చీరాలకే సొంతం
- తోటవారిపాలెంలో దంపతుల హ్యాండ్ డిజైన్ వర్క్
- చేతి కుంచెలతో ఆకర్షణీయంగా తయారు
- వివిధ ప్రాంతాలకు పెరుగుతున్న ఆర్డర్లు

చీరాల, నవంబరు 8 : సాదా చీరలపై రంగు, రంగుల డిజైన్లు, ఆకర్షణీయమైన హ్యాండ్ వర్క్ చీరాల ప్రత్యేకత. మండలంలోని తోటవారిపాలేనికి చెందిన ఇరువురు దంపతులు సాదా చీరలపై చేతి కుంచెలతో వివిధ రంగుల డిజైన్లు వేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మొదట రోజుకు ఒకటి, రెండు చీరలపై డిజైన్ చేసే వీరు ప్రస్తుతం రోజుకు సుమారు 15 నుంచి 20 చీరలు తయారు చేసే స్థాయికి ఎదిగారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన బూదాటి బాలశంకర్, భ్రమరాంబ దంపతులు సాదా చీరలపై రకరకాల డిజైన్లు వేస్తూ మన్ననలు పొందుతున్నారు. బాలశంకర్ తన 12వ ఏట నుంచే రంగులతో హ్యాండ్ వర్క్ చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకురాతి నాగేశ్వరరావు అనే పెయింటర్ ఈయనకు స్ఫూర్తి. గోడలపై రంగులు వేసే నాగేశ్వరరావు వద్ద ఈయన శిక్షణ పొందారు. సాదా వస్త్రాలపై రంగులతో డిజైన్లు వేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ముందడుగు వేశారు. చూసిన వారందరూ బాగున్నాయని మెచ్చుకునేవారు. దీంతో బాలశంకర్ అదే పనిని తన వృత్తిగా ఎంచుకున్నారు. వివాహం జరిగాక తన భార్య భ్రమరాంబకు ఆ కళను నేర్పారు. అప్పటి నుంచి దంపతులు ఇరువురు సాదా చీరలపై ఫెవికాల్ కలర్స్‌తో వివిధ రకాల డిజైన్లు వేస్తున్నారు. ఆర్డర్లపైనే వారు ఎక్కువగా డిజైన్లు చేస్తుంటారు. వారు చేసే డిజైన్లు వినియోగదారుల అభిరుచి మేరకు రూ.600 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. ఈ చీరలపై వేసే రంగులు ఉతికినా చెడిపోకపోవడం ప్రత్యేకత. చేతి కళలు అంతరించిపోతున్న తరుణంలో ఈ దంపతులు సృజనకు మారుపేరుగా తమ వృత్తిలో రాణిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆదరణ ఎక్కువగా ఉంది



మేం వేసే డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. ఒకప్పుడు సరదాగా నేర్చుకున్న కళ, ప్రస్తుతం మాకు, మాతోపాటు మరికొంత మందికి భృతి కల్పిస్తోంది. మన్ననలు పొందగలుగుతున్నాం. అదే మాకు తృప్తి.

- బూదాటి బాలశంకర్, తయారీదారుడు, తోటవారిపాలెం



పాలకేంద్రం వద్ద ధర్నా

మద్యం దుకాణం వద్దంటూ రాస్తారోకో

ఒంగోలుక్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణం వల్ల తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయంటూ శుక్రవారం రాత్రి స్థానిక పాలకేంద్రం వద్ద కర్నూల్ రోడ్డుపై మహిళలు బైఠాయించి రాస్తారోకో చేశారు. మద్యం దుకాణం తెరవడమే కాకుండా అనధికారికంగా పర్మినెంట్ రూం ఏర్పాటు చేసి అక్కడే మద్యం తాగి గొడవ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మద్యం దుకాణాన్ని తొలగించాలని పీర్లమాన్యం ప్రాంతంలోని కొందరు మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఒంగోలు తాలుకా సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జగన్... నోరు అదుపులో పెట్టుకో!

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులపై విమర్శలు చేస్తున్న వైసీపీ అధినేత జగన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ హితవు పలికారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం పదవి పోయిన తర్వాత జగన్‌కు ఏమిచేయాలో తెలియక మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చి గుణపాఠం చెప్పినా ఆయన తీరులో మార్పు లేదన్నారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలు సొంత చెల్లిని, తల్లిని అసభ్యంగా వేధిస్తే జగన్ పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేస్తే జగన్ రాష్ట్రంలో తిరగలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కష్టపడుతుంటే జగన్ ఓర్వ లేక, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తు న్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొందరు అధికారులు తీరు ఇంకా మార్చుకోలేదని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే వదిలే ప్రసక్తి లేదని నూకసాని హెచ్చరించారు.

వచ్చేనెల 5 నుంచి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు



కబడ్డీ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంతనూతలపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూదనగుంట కోటయ్యచౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీలు సంతనూతలపాడులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కు ర్రా భాస్కరరావు, ట్రెజరర్ డి.రమేష్ తెలిపారు. డా క్టర్ ఎస్.రాఘవేంద్రప్రసాద్ సూదనగుంట ఫౌండేష న్ అమెరికా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వా రు మాట్లాడుతూ ప్రతీ రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు మధ్య మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 10 జిల్లాల జట్లకు సంబంధించి 400మంది క్రీడాకారులు, 100మంది న్యాయనిర్ణేతలు పాల్గొంటారని తెలిపా రు. అసోసియేషన్ సహకారంతో క్రీడాకారులకు ఉచి త భోజనసదుపాయం, వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొం టారని, క్రీడా దుస్తులను సైతం అందజేస్తామని చె ప్పారు. అనంతరం పోటీల లోగోను ఆవిష్కరించా రు. జిల్లా అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ రంగరావు, కోఆర్డినేటర్ శీనయ్య, మల్లికారాణి, క్రిష్ణమూర్తి, ఎస్. రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

లారీ నుంచి జారిపడి క్లీనర్ మృతి

కంభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ఉల్లిపాయల లోడుతో ఉన్న లారీపై నుంచి జారిపడి షేక్ జమాల్(47) లారీక్లీనర్ మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం కడప జిల్లా మైదుకూరు నుంచి కలకత్తాకు ఉల్లిపాయల లోడుతో వెళుతున్న లారీ కంభానికి వచ్చిన సమయానికి వర్షం పడుతుండడంతో ఉల్లిపాయలు తడవకుండా ఉండేందుకు లారీపై పట్ట కప్పేందుకు కందులాపురం కూడలిలో లారీని పక్కకు ఆపారు. క్లీనర్ జమాల్ లారీ పైకి ఎక్కి పట్ట కప్పుతుండగా పట్టుతప్పి కిందపడ్డాడు. తల వెనుక భాగాన బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జమాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

180 మద్యం సీసాలు స్వాధీనం

● ఐదు కేసులు నమోదు

మార్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.బాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం బెల్ట్ షాపులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 180 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఏఈఎస్ బాలయ్య తెలిపిన వివరాల మేరకు, ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో రెండు, మార్కాపురం, కంభం, గిద్దలూరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం ధరలు పెంచి అమ్మడం కానీ, బెల్టు దుకాణాలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కంభంలో పది క్వార్టర్ బాటిళ్లు సీజ్

కంభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంభంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ బెల్టుషాపుపై ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి దాడి నిర్వహించారు. దాడిలో శ్రీకాంత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా బెల్టుషాపు నిర్వహించినా, అక్రమంగా మద్యం అమ్మినా వెంటనే సమాచారం అందించాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

గిద్దలూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న 21 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కొమరోలు పట్టణంలో అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ జయరాజ్ సిబ్బందితో కలిసి వెళ్లి మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 21 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జయరాజ్ హెచ్చరించారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలజీనాయక్

గిద్దలూరుటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు దుకాణాలలో ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏడీఏ డి.బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్, చక్రవర్తి ట్రేడర్స్, పలు దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్‌లో అమ్మకాలకు, డీబీటీలో అమ్మకాలకు వ్యత్యాసం ఉన్నందున మన గ్రోమోర్ సెంటర్‌లో రూ.4,09,150 సరుకును, అలాగే చక్రవర్తి ట్రేడర్స్‌లో రూ.1,78,500లకు సంబంధించి ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఓ-ఫార్మ్ ప్రిన్సిపల్ సర్టిఫికేట్స్ లైసెన్సులో పొందుపరచుకోవాలని డీలర్లకు సూచించారు. ఆయనతోపాటు మండల వ్యవసాయాధికారి వై.విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

త్రిపురాంతకం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని, అన్నసముద్రం, మేడపి గ్రామాల్లో పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ ఏడీఏ డి.బాలాజీనాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ డీలర్లు అందరూ తప్పనిసరిగా రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు నిర్వహించాలని, సూచించారు. ఎవరైనా ఎంఆర్‌పీ ధరలకంటే అధికంగా అమ్మినా, నకిలీ మందులు అమ్మినా లైసెన్సు రద్దు చేస్తామన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరు డీలర్లు రేట్లు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏవో నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు

పెద్దారవీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు సంబంధించి నిబంధనలు తప్పక పాటించాలని ఏవో బుజ్జిబాయ్ హెచ్చరించారు. మండలంలోని కుంట గ్రామంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లతో ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ అనుమతిలేని కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపులలో కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

పుల్లలచెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కొమరోలు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన పిడికిటి పెద్దవీరయ్య ఇంట్లో శుక్రవారం ఒక్కసారిగా సిలెండర్ పేలి మంటలు వచ్చాయి. స్థానికులు మంటలను ఆపే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో మంటలకు ఇళ్లు కాలిపోయింది. ఇంటిలోని రూ.2 లక్షల నగదు, మూడు తులాల బంగారం మంటల్లో కాలిపోయిందని బాధితుడు తెలిపారు.

కార్యాలయ ప్రారంభం పేరుతో హడావుడి

● అలాంటిదేమీ లేదని ఎంపీడీవో వివరణ



గొల్లపల్లిలోని సచివాలయం

త్రిపురాంతకం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి సచివాలయాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి సర్పంచులు ప్రారంభం పేరుతో హడావుడి చేయడం ప్రజాప్రతినిధులు, అధికారుల్లో చర్చకు దారితీసింది. దీనిపై మండల స్థాయి అధికారులులకు గానీ, గ్రామ స్థాయిలో ఉన్న అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం లేదు. ఇదే సచివాలయాన్ని ఈ ఏడాది జనవరి 22న ప్రారంభించినట్లు ఇప్పటికే శిలాఫలకం ఆవిష్కరించారు. అయినా ప్రస్తుతం ప్రారంభం పేరుతో హడావుడి చేయడం చర్చనీయాంశమైంది. దీనిపై స్థానిక ఎంపీడీవో వివరణ ఇచ్చారు. ప్రస్తుతం ప్రారంభం వంటి కార్యక్రమం ఏమి జరగలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో శిలాఫలకం ఏర్పాటు మినహా సచివాలయాన్ని ప్రారంభించలేదన్నారు. త్వరలోనే అధికారులకు, ప్రజాప్రతినిధులకు పూర్తిస్థాయిలో సమాచారం ఇచ్చి సచివాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.

తీగలేరు పనులు కొనసాగేనా?

● రెండు దశాబ్దాల కాలంగా ప్రతిపాదనలకే పరిమితం ● పలుమార్లు మారిన అంచనాలు



చిన్నకండ్లేరు చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పుల్లలచెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే వెనుకబడిన మండలమైన పుల్లలచెరువు మండలం కరువు కాటకాలకు పుట్టినిల్లు. గత 15 సంవత్సరాల నుంచి కనీస వర్షపాతం నమోదు కాక తాగు, సాగు నీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో నూతనంగా 800 వందల అడుగుల వరకు బోర్లు వేయించినా గంగ జాడ కనిపించడం లేదు. పుల్లలచెరువు మండలంలో కరువు కష్టాల నుంచి శాశ్వత విముక్తి కలగాలంటే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి తీగలేరు-5 కాలువను పుల్లలచెరువు చిన్నకండ్లేరు చెరువుకు అనుసంధానం చేయడమే మార్గం.

తీగలేరును చిన్నకండ్లేరు చెరువుకు అనుసంధానం చేయడం ద్వారా, పుల్లలచెరువు మండలంతో పాటు



డీపీఆర్‌లో పొందు పరిచిన పాత మ్యాప్

ఎర్రగొండపాలెం మండలానికి కూడా ఎంతో ప్రయోజనం వుంది. సాగు, తాగు నీటికి ఎటువంటి డోకా వుండదు. మండలంలోని 15 పంచాయతీలకు తాగు నీరు, 10 వేల ఎకరాల సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. ఈ అనుసందానంపై గతంలో ప్రభుత్వం ప్రకటించిన మ్యాపు ప్రకారం పుల్లలచెరువు మండలంలోని 10 గ్రామాలకు మాత్రమే ప్రయోజనం చేకురుతుంది. యండ్రపల్లి, మల్లాపాలెం, ఉమ్మడివరం, పుల్లలచెరువు, తెల్లగట్ల, గంగవరం పంచాయతీలకు ప్రయోజనం ఉండదు. అయితే చిన్నకండ్లేరు వద్ద అనుసంధానం చేయడం ద్వారా ఈ ఐదు గ్రామాలకు కూడా ఉపయోగం చేకూరనుంది.

పుల్లలచెరువుకు ఎగువన వుండే ఈ చెరువు నాలుగు కొండల మధ్యలో చిన్నకట్టతో ఏర్పడింది. ఈ చెరువుకు నల్లమల అటవీ ప్రాంతంలో చిన్న చిన్న వాగులు అనుసంధానంతో పెద్ద వరద ప్రవాహం వుంది. చిన్నకండ్లేరుకు దిగువ వైపున ఎల్లప్పుడు వాగులో నీరు ఉండడంతో బోర్లలో సమృద్ధిగా నీళ్లు వచ్చేవి. చిన్నకండ్లేరు గత 15 సంవత్సరాల నుంచి నీరుసరిగా లేకపోవడంతో పుల్లలచెరువు మండలంలో తాగు, సాగు నీటీ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీగలేరు-5 కెనాల్‌ను పొడిగించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు.

మ్యాపులో పలుమార్లు మార్పులు

ఈ తీగలేరును చిన్నకండ్లేరు చెరువుకు అనుసంధానం చేయాలని వెలిగొండ ప్రాజెక్టు డీపీఆర్‌లోనే రెండు దశాబ్దాల క్రితమే పొందుపరిచారు. అయితే మధ్యలో వచ్చిన కాంట్రాక్టర్ ఖర్చుకు వెరసి కొమరోలు గ్రామంలోని దువ్వలేరు కాలువకు అనుసంధానం చేయాలని చూడగా స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై 2014 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి నాయకులు అప్పటి నీటి పారుదలశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన కాలువ పొడిగింపునకు అనుమతులిచ్చారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఆ పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు పూర్తిగా నిలిచి పోయాయి. పొడగింపు పనులు మరుగున పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తీగలేరు కాలువను పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

పాత మ్యాపు ప్రకారం అనుసంధానం చేయాలి

వెలుగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువను పాత మ్యాపుప్రకారం చిన్నకండ్లేరు చెరువు వరకు పొడిగించాలి. దీంతో అన్ని గ్రామాల్లో శాశ్వతంగా నీటి సమస్యలు తీరుతాయి. ప్రభుత్వం రూ.20 కోట్లు ఖర్చు చేస్తే దీని వలన ప్రజలకు అధనంగా సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కరువును శాశ్వతంగా పారదోలవచ్చు. కూటమి ప్రభుత్వం త్వరగా పనులు ప్రారంభించాలి.

మాజీ ఎంపీపీ మార్తాల సుబ్బారెడ్డి

భూగర్భజలాలు సమృద్ధిగా పెరుగుతాయి

వెలిగొండ తీగలేరును చిన్నకండ్లేరు చెరువుకు అనుసంధానం చేయడం ద్వారా భూగర్భ జలా లు పెరుగుతాయి. ప్రభుత్వ అధికారులు ప్రజల కు ఉపయోగపడే విధంగా చేయడం వలన శాశ్వత ప్రయోజనాలు ఉంటాయి. దీంతో రైతులకు మేలు చేకూరనుంది.

టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ నాయకులు

సమగ్రాభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు

● పనితనంతోనే ఆరోపణలకు సమాధానం
● రాజకీయాలకు అతీతంగా తొలగింపు
● మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం కోసమే పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు స్థానిక శాసన సభ్యుడు కందుల నారాయణరెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణ జనాభా నానాటికి పెరుగుతోందన్నారు. ప్రస్తుతం లక్షకు పైచిలుకు చేరిందన్నారు. అదే సమయంలో రహదారులు మాత్రం కుంచించుకుపోతున్నాయన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జటిలమైందన్నారు. అంతేకాక ఎక్కడా పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోయిందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం కూడా మున్సిపల్ పారిశుద్ధ్య విభాగానికి తలకు మించిన పనైందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నిబంధనలకు అనుగుణంగా ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం 20 రోజుల క్రితమే సర్వేచేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చిందన్నారు. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతోనే చర్యలు తీసుకున్నామన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కొంతమేర సమయం ఇవ్వడాన్ని కూడా రాజకీయం చేశార న్నారు. నోటీసులు ఇచ్చి బెదిరించి తాము లంచాలు తీసుకున్నామని కొందరు విషప్రచారం చేశార న్నారు. ఈ పద్ధతులు మార్చుకోవాలన్నారు. త్వరలో మార్కాపురం పట్టణానికి రోజు మార్చి రోజు సాగర్ నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని ప్రతి ఇంటికి నీటిని అందించేందుకు రూ.62 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. అంతేకాక దూపాడు వద్ద సాగర్ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి నీటిని వేగంగా పంపింగ్ చేసేందుకు రూ.3.5 కోట్లతో రెండో పైప్‌లైన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతుంద న్నారు. మెడికల్ కాలేజీ తరలి పోతోందని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయ న్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారమే అయినా పీపీపీ పద్ధతిలో కళాశాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంద న్నారు.

జిల్లా ఏర్పాటే ప్రధాన లక్ష్యం

పశ్చిమ ప్రకాశ ప్రజల ఆకాంక్ష మేరకు నూతనంగా జిల్లా ఏర్పాటు, ఈ ప్రాంత ప్రజల వరప్రదాయిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ విషయంలో ప్రజల్ని మోసం చేసిందన్నారు. ఎన్నో పనులు పెండింగ్‌లో ఉన్నా నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టు పూర్తయినట్లు మాయమాటలు చెప్పి జాతికి అంకితం చేశారన్నారు. తాము ఇప్పటి నుంచి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు చేసినా మరో రెండేళ్ల సమయం పడుతుందన్నారు. కూటమిలోని అన్ని పార్టీలు జిల్లా ఏర్పాటుకు సముఖంగా ఉన్నాయని, సీఎం చంద్రబాబునాయుడు కూడా జిల్లా ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, కనిగిరి బాలవెంకటరమణ, మాలపాటి వెంకటరెడ్డి, కందుల రామిరెడ్డి, దొడ్డా రవికుమార్, గొలమారి నాసర్‌రెడ్డి, రంగస్వామి, ఈవీఎల్ తదితరులు పాల్గొన్నారు.

కుంట ప్రాంతంలో సర్వే



కుంట ప్రాంతాన్ని సర్వే చేస్తున్న అధికారులు

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నరవ రోడ్డులోని కాశిరెడ్డికుంట ప్రాంతాన్ని అధికారులు సందర్శించారు. ఈ కుంట ప్రాంతాన్ని పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. మరికొంతమంది స్థలాలు అమ్ముకుంటున్నట్లు చాలా సంవత్సరాలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆక్రమిత స్థలాలు ఎన్ని ఉన్నాయో గుర్తించేందుకు వీలుగా అధికారులు రీసర్వే చేశారు. తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని రెవెన్యూ సర్వేయర్, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సర్వే చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూర్తిస్థాయిలో సర్వేచేసిన అనంతరం ఆక్రమణల విషయం చెబుతామని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తాడివారిపల్లె విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తర్లుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ, సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ అజీమ్‌బాషా తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో కడప, కర్నూలు జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్-14 బాలికల విభాగంలో గీతారెడ్డి, నందిని, భారతిలక్ష్మీ, ఏడుకొండలు, అండర్-17 విభాగం పోటీలలో శివరామరాజు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యా యుడు మోడీ రాజశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

త్రిపురాంతకం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం రాత్రి ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొండా మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.తిరుపాలు, గౌరవాధ్యక్షుడిగా ఎన్.లక్ష్మణమూర్తి ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సెలర్లుగా కె.నాగభూషణం, బి.సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్.సుబ్బారెడ్డి, కోశాధికారిగా ఎస్‌కె.అజీమ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వెన్నా వెంకటరెడ్డి, పరిశీలకులుగా బీవీ.నరసింహారావు, బాబుల్‌నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన మండల స్వర్ణోత్సవ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ఓవీ.వీరారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడడంలో యూటీఎఫ్ ముందుంటుందన్నారు. అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి సంఘానికి చేసిన సేవలను కొనియాడారు.

పక్కాతూకంతో రేషన్ పంపిణీ చేయండి

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



గోడౌనును తనిఖీ చేస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

పొదిలి, నవంబరు 8 : రేషన్ బియ్యాన్ని గోడౌన్ నుంచి దుకాణాలకు తోలే సమయంలో పక్కాగా తూకం, సీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫుడ్‌కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అధికారులకు సూచించారు. కాటా వేసి గోతాలు సీలు పరిశీలించి మాత్రమే సరఫరా చేయాలన్నారు. మూటలు చేసి మాత్రం సరఫరా చేయకూడదన్నారు. డీలర్‌కు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. వాటిలో అవకతవకలు జరిగినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు నాశిరకం బియ్యం పంపిణీ జరిగితే వెంటనే తనకు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థుల ఆహారం విషయాల్లో తేడాలు, అనారోగ్య కారణాలు వస్తే సహించేంది లేదన్నారు.

పలు సమస్యలపై హమాలీల ఫిర్యాదు

హమాలీలకు పెంచిన కూలీలరేట్లు ఏడాది గడుస్తున్నా అమలు కాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఎంఎల్ఎస్ పాయింట్ పొదిలిలో ఉండగా, దొనకొండ సబ్ పాయింట్‌గా ఉండేదన్నారు. అయితే ఇప్పుడు పొదిలిని సబ్ పాయింట్‌గా చేసి దొనకొండను ఎంఎల్ఎస్ పాయింట్‌గా చేశారన్నారు. దీంతో ఈ హమాలీ పనిని ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్నారు. అంతేకాకుండా గతంలో పొదిలి పాయింట్ కింద ఉన్న కొనకనమిట్ల మండలానికి చెందిన ఏడు దుకాణాలను మార్కాపురం పాయింట్‌లో కలపడం వలన నెలకు రూ.26వేలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మండలాలకు నడికూడలిగా ఉన్న పొదిలి పాయింట్‌ను ఎంఎల్ఎస్ పాయింట్‌గా చేయాలని కోరారు. కార్యాక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, డీఎం జి.వరలక్ష్మీ, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ సురేఖ, గోడౌన్ డీటీ సుష్మా తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు వెంటనే నీటిని విడుదల చేసి నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డితో కలిసి ఈనెల 12న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మార్కాపురం రానున్నారన్నారు. ప్రాజెక్టు పరిశీలించి మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహిస్తారని ఈ సందర్భంగా సదస్సుకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. మార్కాపురం మెడికల్ కళాశాల పనులు ఆపి కళాశాలకు తరలించే పనులు మానుకోవాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సోమయ్య, డీకేఎం రఫి, బాలనాగయ్య రూబెన్, జె.రాజు, కాశయ్య, నన్నేసా, శారా పాల్గొన్నారు.

కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

13 రోడ్లకు రూ.16.42 కోట్లు అవసరం అవుతుందని నివేదిక



అధ్వానంగా ఉన్న పంచాయతీరాజ్ రహదారి

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లగా బటన్ నొక్కుడు కార్యక్రమానికే ప్రాధాన్యత ఇచ్చింది. రోడ్లు, కాలువలు, ఇతర ఏ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దగా నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. దీంతో గత ఐదేళ్లలో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. చిన్నపాటి గుంతలను కూడా పూడ్చక పోవడంతో ఆ గుంతలు పెరిగి పెద్దవయ్యాయి. రాకపోకలకు ఇబ్బంది కలుగ చేస్తున్నాయి. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో చాలా రోడ్లు అధ్వాన్నంగా తయారవడంతో ముత్తుముల అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే రోడ్లను బాగు చేయించాలని తలపెట్టారు. ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులను పిలిపించి అన్ని రోడ్లను పరిశీలించి ఎక్కువగా అధ్వాన్నం గా రోడ్లను మొదటి విడతలో బాగు చేయాలని, క్రమేణ అన్ని రోడ్లను బాగు చేసేందుకు వీలుగా పరిశీలించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీరాజ్ డీఈ గిద్దలూరు, రాచర్ల, బేస్తవారపేట మండలాల పరిధిలో అధ్వాన్నంగా ఉన్న 13 రోడ్లలో కొత్త రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయిం చారు. రూ.16.42 కోట్లు వ్యయం అవుతుందని డీఈ నివేదిక ఇచ్చారు. ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు డీఈ సుబ్బారెడ్డి తెలిపారు.

ప్రతిపాదించిన రోడ్లు ఇవే

గిద్దలూరు మండలంలోని కెఎస్‌పల్లి నుంచి దూర్‌చింతల తాండా వరకు 3.20 కోట్లు, భీమలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి దిగువమెట్ట తాండా వరకు 2 కోట్లు, అంబవరం నుంచి ఉప్పలపాడు వరకు 80లక్షలు, కంచిపల్లి గ్రామ లింకు రోడ్డుకు 2 కోట్లు, గిద్దలూరు నుంచి పాములపల్లెకు 2 కోట్లు వ్యయం అవుతుందని ప్రతిపాదనలు పంపారు. రాచర్ల మండలంలోని అనుమలవీడు-రంగారెడ్డిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఓబులరెడ్డిపల్లి గ్రామం వరకు రూ.60లక్షలు, రంగారెడ్డిపల్లి-సోమిదేవిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అచ్చంపల్లి గ్రామం వరకు కోటి రూపాయలు, అనుమలపల్లి-ఆకవీడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అక్కపల్లి గ్రామం వరకు రూ.60లక్షలు, కాలువపల్లి-గంగంపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, అలాగే బేస్తవారపేట మండలంలోని బేస్తవారపేట- చిన్నకంభం రోడ్డు నిర్మాణానికి 1.20 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డునుంచి జేబీ కృష్ణాపురం వరకు రూ.1 కోటి పిటకాయగుళ్ల నుంచి వంగపాడు గ్రామం వరకు రూ.1.30 కోట్లు, ఒంగోలు-నంద్యాల రోడ్డు నుంచి సలకలవీడు వరకు రూ.70 లక్షలు వ్యయం అవుతుందని అచనా వేశారు. ఈ మొత్తం రోడ్ల నిర్మాణానికి 16.42 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టాలని, నిధుల మంజూరుకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

రోడ్లపైనే మురుగు నీరు

● అవస్థలు పడుతున్న స్థానికులు



రోడ్డుపై పారుతున్న మురుగు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌సింగ్ కాలనీలో రహదారిపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. గత ప్రభుత్వంలో మురుగు కాలువను అరుణోదయ స్కూల్ వరకు నిర్మించారని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు తెలిపారు. ఆ డ్రైనేజీ కాలువను భగత్‌సింగ్ కాలనీ వరకు పొడిగించకుండా వదిలివేయడంతో మురుగునీరు పారే అవకాశం లేక రోడ్లపైనే ప్రవహిస్తున్నదని తెలిపారు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి భగత్‌సింగ్ కాలనీ ఆఖరివరకు డ్రైనేజీ నిర్మించాలని, మురుగునీరు రోడ్లపై పారకుండా చూడాలన్నారు.

23న నీటి సంఘాల ఎన్నికలు

మార్కాపురం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి). మండలంలోని 8 నీటి సంఘాలకు ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె చిరంజీవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని భూపతిపల్లి, తిప్పాయపాలెం, వేమలకోట, శివరాంపురం, పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం, మార్కాపురం-2 నీటి సంఘాలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సభ్యులకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6 వతేదీ నుండి 10 వతేదీ వరకు ఓటర్ల జాబితాను తయారు చేసే ప్రక్రియ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఓటర్ లిస్టు తుది జాబితాను గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 11, 12వ తేదీలలో ఓటరు జాబితాపై అభ్యర్ధనలు స్వీకరిస్తామన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరి దీపం-2 వర్తింపు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం 2 పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి మూడు సిలిండర్‌లకు నగదు జమ చేస్తామన్నారు. మార్కాపురంలో ఉన్న మూడు గ్యాస్ ఏజన్సీలలో దీపం-2 పథకం వివరాలను ఫ్లెక్సీల రూపంలో ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ, నగదు జమలో ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జనవరి ఒకటవ తేదీ 2025 సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కును కల్పిస్తామన్నారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీలలో మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో బిఎల్‌వోలు, ప్రజలకు అందుబాటులో ఉండి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తదితర సవరణలు చేపడతారన్నారు.

చిత్తు కాగితాల సేకరణ కుటుంబాలకు చేయూత

తాళ్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిత్తుకాగితాలు సేకరిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు సామగ్రిని అందజేశారు. దారం వారిపాలెం గ్రామసచివాలయం వద్ద శుక్రవారం చిత్తు కాగితాల సేకరించే 30 కుటుంబాలకు 15 రకాల సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి డి.సుశీల, డిజిటల్ అసిస్టెంట్ రవీంద్రబాబు, గ్రామ పెద్దలు సామియేల్, కోటయ్య, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, నిత్యావసరాల వస్తువుల ధరలను తగ్గించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల శాఖ కార్యదర్శి కె.మాల్యాద్రి ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాపోరు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అల్లాబక్ష్, వై.వీరనారాయణ, ఖాదర్‌బాషా, చల్లా వెంకటేశ్వర్లు, కె.శంకర్ పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పుల సవరణలకు గ్రామసభలు

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి అన్నారు. శుక్రవారం మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరులో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో తప్పులు జరిగి ఉంటే రైతులు తమ గ్రామ సభలో తెలపాలన్నారు. గతంలో ఉన్న రికార్డులు తీసుకొనివస్తే సరిచేసి రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. అనంతరం రైతుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వో రాఘవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్యాస్ గోడౌన్ సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. గోడౌన్ వద్ద వినియోగదారులకు సిలిండర్లు ఇవ్వొద్దని తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు ఇంటి వద్దకు వచ్చి సిలిండర్ ఇవ్వాలన్నారు. గోడౌన్ వద్ద ఇస్తే మాత్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్యాస్ కార్యాలయంలో రికార్డులను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎంవీఎస్ఆర్ మూర్తి, వీఆర్‌వో సీహెచ్ బ్రహ్మతేజ, బొల్లేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ రైతులకు సూచించారు. శుక్రవారం జమ్మలమడకలో జరిగిన పొలం బడి కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రబీలో సాగు చేసే నూతన వరి రకాలైన ఎన్ఎల్ఆర్ 3354, ఎంపీయూ 1282 రకాల గురించి వివరించారు. పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడటం వల్ల పైరు ఎదుగుదల నశించి దిగుబడి తగ్గుతుందన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం కాలనీలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ వై.నాగరాజు తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఈసందర్భంగా 12 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ. 8,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమవారం దర్శి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ అంకారావు, ప్రేమానిధి, తుపాకుల శ్రీను పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

పీసీపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు స్థానిక గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఇండస్ట్రియల్ విజిట్ కోసం విద్యార్థులు గ్రామ సచివాలయానికి వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఐటీ ఉపాధ్యాయులు నాగార్జున సచివాలయంలో ఉద్యోగుల విధులు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సాంకేతికపరమైన పలుఅంశాలపై అక్కడి ఉద్యోగుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు!
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అత్తాల జపన్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో మునుపెన్నడూ లేని విధంగా తన సొంత నిధులు, దాతల సహకారంతో తల్లీబిడ్డల వార్డును కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఉద్యోగులు నిర్లక్ష్యం వహించిందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు పూర్తయినా నేటికీ పలుప్రాంతాలకు తాగునీరు అందకపోవడంపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిన వెంటనే నియోజకవర్గంలోని చెరువున్నింటినీ అనుసంధానం చేసి కాలువల ద్వారా సాగర్ జలాలను నింపి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. శాఖల వారీగా రెండు రోజుల్లో అభివృద్ధి కోసం అవసరమైన తీర్మానాలను తనకు పంపిస్తే త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో చర్చిస్తానని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఉద్యోగులు నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సమావేశంలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులు తమతమ శాఖల ప్రగతిని వివరించడంతో పాటు ఆయా శాఖల్లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత నూతనంగా చేపడుతున్న కొత్త పథకాలను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించి ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతుండగా వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య మరికొంతమంది సభ్యులు లేచి గతంలో 2009-14 సమయంలో ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డి ఉన్నప్పుడు గ్రామాలకు త్రాగునీరు కొరత లేకుండా సాగర్ జలాలు అందాయన్నారు. ఆతర్వాత గత పదేళ్లుగా మండలంలో సగం గ్రామాలకు కూడా తాగేందుకు సాగర్ జలాలు సరఫరా కావడంలేదన్నారు. ప్రధానంగా దివాకరపల్లి, వెంగళాయపల్లి, బుడ్డారెడ్డిపల్లి, కొత్తపల్లి, పెద్దన్నపల్లి గ్రామాల్లో కిడ్నీ బాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, జడ్పీటీసీ లక్ష్మీకాంతం, సీఐ ఖాజావలి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశం ముగిసిన తరువాత వివిధ సమస్యలపై ప్రజలు తీసుకు వచ్చిన అర్జీలను స్వయంగా తీసుకున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పీసీపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనర సింహారెడ్డి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పీసీ పల్లిలో పాత బ్యాంకు సెంటరు నుంచి ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వరకు రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులు చేపట్టలేదన్నారు. దీంతో గుంతలుపడి కొద్దిపాటి వర్షం కురిసినా చెరువులను తలపించాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఉపాధి నిధులను మంజూరుచేశారన్నారు. పీసీపల్లి మండలంలో 13 పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటి ద్వారా నేరేడుపల్లి, పీసీపల్లి, జంగాలపల్లి, తలకొండపాడు, గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, సీసీరోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈనెలాఖరులోగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులన్నింటినీ పూర్తిచేయించి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని పంచాయతీరాజ్ అధికారులను డాక్టర్ ఉగ్ర ఆదేశించారు.

అధ్వానంగా రహదారులు

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం
- మరమ్మతులకు నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- ప్రజలకు తీరనున్న ఇక్కట్లు


గుంతలమయమైన దర్శి-తూర్పుగంగవరం రోడ్డు


అధ్వానంగా పాతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు

దర్శి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో దర్శి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు గుంతలమయమై అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత ఛిద్రమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు ఎక్కడా తట్టెడు మట్టి కూడా పోయలేదు. దీంతో రహదారులు దారుణంగా తయారయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దుస్థితిని గుర్తించింది. మరమ్మతులకు నిధులు మంజూరు చేయటంతో అధికారులు టెండర్లు పిలిచారు.

దర్శి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు 82 కిలోమీటర్లు గుంతలు పడి దెబ్బతిన్నాయి. ఈ గుంతలను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.1.09 కోట్లు నిధులు మంజూరు చేసింది. అర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచి పనుల నిర్వాహణకు సన్నద్ధమవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని అనేక రోడ్లు అధ్వానంగా మారాయి. నియోజకవర్గంలో మొత్తం 127.53 కిలోమీటర్లు రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. మరమ్మతుల కోసం రూ.33.90 కోట్లు నిధుల విడుదల కోసం పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఆ నిధులు కూడా విడుదల అయ్యే అవకాశం ఉంది. వచ్చే సంక్రాంతి లోపు రోడ్ల మరమ్మతులు పూర్తిచేసి గుంతల రహిత రాష్ట్రంగా అభివృద్ధి పర్చాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

పంచారామ క్షేత్రదర్శినికి ప్రత్యేక బస్సులు

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రదర్శిని యాత్రలకు కనిగిరి నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్‌డీ సయాన బేగం తెలిపారు. శుక్రవారం పామూరు ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రయాణికులతో కలిసి పంచారామ క్షేత్ర, అరుణాచల యాత్రలకు సంబంధించి కనిగిరి ఆర్టీసీ డిపో తరుపున ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎం మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలైన కాణిపాకం, గోల్డెన్ టెంపుల్(శ్రీపురం), కాంచీపురం, (విష్ణుకంచి, శివకంచి), అరుణాచలం(గిరిప్రదర్శన), తిరుత్తణి, శ్రీకాళహస్తి క్షేత్రాలను భక్తులు దర్శించుకునేందుకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు.

నవవంబరు 11, 23, డిసెంబరు 14న మహాజ్యోతి దర్శనానికి కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్ సర్వీసులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పంచారామ క్షేత్రదర్శిని కోసం శైవక్షేత్రాలైన అమరావతి, భీమవరంలోని సోమేశ్వరం, పాలకొల్లులోని క్షీరారావం, ద్రాక్షరామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కొమరారామం క్షేత్రలకు ఈనెల 10, 17, 24 తేదిల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనిగిరి ఆర్టీసీని లాభాల బాట పట్టించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. పామూరు బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తక్షణమే బస్టాండ్ ప్రాంగణంలో చిల్లచెట్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి.మహేష్, సూపర్‌వైజర్ కె.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


పంచారామ క్షేత్రదర్శిని కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం సయానబేగం

రాష్ట్రంలో వైషమ్యాలను సృష్టించేందుకు కుయుక్తులు

- పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ ధ్వజం

తాళ్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైషమ్యాలను సృష్టించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తూర్పుగంగవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు యత్నిస్తూ, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ రాక్షస పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో తిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. వైసీపీ అరాచక పాలనతో పెట్టుబడిదారులు రాష్ట్రంలోకి రాకుండా పోయారన్నారు. చంద్రబాబు పనితీరు పట్ల ఆకర్షితులైన పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారని చెప్పారు. మాజీ సీఎం జగన్ సామాజిక స్పృహ అంటూ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సొంత చెల్లి, తల్లిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వ్యక్తికి వత్తాసు పలుకుతూ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. రుషికొండపై నిర్మించిన భవనాల వల్ల రాష్ట్రఖజానాకు రూ.500 కోట్ల నష్టం కలిగించారన్నారు. ఈ విషయంలో అక్రమాలకు పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయవచ్చునన్నారు. ఎమ్మార్పిఎస్ నేత మంద కృష్ణ మాదిగ హోంమంత్రి అనితకు మద్దతుగా మాట్లాడిన మాటలకు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వక్రభాష్యం చెబుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మధ్య దూరం పెంచేందుకు చేస్తున్న ఎత్తులు సాగవన్నారు.

సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, గొందిరమణారెడ్డి, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజి

ఉద్యాన పంటలు సాగుచేయాలి

కనిగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు విరివిగా ఉద్యానపంటల సాగును చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సబ్సిడీ శనగ విత్తనాలు, పంట నూర్పిడి యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగుచేస్తే భవిష్యత్తులో ఆదాయం కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడి విరివిగా పొగాకు సాగు చేపట్టడంతో మన రాష్ట్రంలోని పొగాకు ఎగుమతి తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. ఈ పరిణామాలతో రైతులు పొగాకు సాగును వీలైనంత వరకు తగ్గించాలన్నారు. పొగాకు పంటతో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టడం వల్ల నష్టాలు రాకుండా బయట పడవచ్చునని సూచించారు. రాష్ట్రంలో వర్షాభావ ప్రాంతమైన ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన కనిగిరిలో గతంలో నిమ్మ, బత్తాయి తోటలను అత్యధికంగా సాగు చేసేవారన్నారు. కనిగిరి నుంచి ఇతర రాష్ట్రాలకు కూడా బత్తాయి, నిమ్మ ఎగుమతి ఉండేదన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగు నిర్వీర్యమై పోయిందన్నారు. కనిగిరి ప్రాంతంలో ఉద్యాన పంటల సాగులో అత్యధిక దిగుబడులు, ఆదాయాలు వస్తాయన్నారు. రైతులు ఆదిశగా పంటల సాగు చేయాలని కోరారు.


సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఉద్యానపంటలు సాగు చేసే రైతులకు కూటమి ప్రభుత్వం సబ్సిడీతో పాటు పంట రుణాలు కూడా మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ఏడీఏ ఈవీ రమణ, ఏఓ జ్యోష్నాదేవి, ఏఈవోలు, అధికారులు పా ల్గొన్నారు.

అయితే, ఈ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చిన జడ్పీటీసీ కస్తూరిరెడ్డి ప్రాధ్యాన్యతాక్రమంలో ప్రజాప్రతినిధులకు కుర్చీలు వేయాలన్నారు. తనను కార్యక్రమానికి పిలిచి అవమానించ వద్దంటూ మాట్లాడిన మాటలు చర్చకు దారి తీసింది.

స్థానం కాదు సమర్థత ముఖ్యం

నాయకుడంటే సింహాసనంపై కూర్చున్న రాజులా భ్రమ పడకూడదని ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన పదవికి ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. తాను ఎప్పుడూ ఎవరిని తగ్గించే అలవాటు లేదన్నారు. కార్యక్రమానిక ఆలస్యంగా మీరు వచ్చారని జడ్పీటీసీని ఉద్దేశించి అన్నారు. ఇక్కడ ఎవరూ గొప్ప కాదు, తక్కువ కాదు అని అన్నారు. తనకు ప్రజల మధ్యన కూర్చుని కార్యక్రమం చేపట్టాలని ఉంటుందని చెప్పారు. అయితే, అధికారులకు ప్రొటోకాల్ పాటించాలని ఉంటుంది. అయినా కూర్చున్న స్థానం ముఖ్యం కాదని.. పాలనా సమర్థత ముఖ్యమన్నారు. ఈసందర్భంగా తన పక్కన ఉన్నవారిని లేపి జడ్పీటీసీ కస్తూరిరెడ్డికి తన పక్కన సీటు వేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూ చించారు.


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి శ్రావణ్ కుమార్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పసుపుగల్లులో గురువారం రాత్రి షేక్ గౌసాబీ అనే మహిళ విష జ్వరంతో మృతి చెందింది. దీంతో శుక్రవారం గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.జాస్మిన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్ళి తగు సూచనలు చేశారు.

జిల్లా మలేరియా అధికారి శ్రావణ్‌కుమార్ సమీపంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఫ్లోరోసిస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. అనంతరం వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, ఎబేట్ పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జాస్మిన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవారెడ్డి, సీహెచ్‌వో నారాయణరావు, కస్తూరి కుమారి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

వెలిగండ్ల, నవంబరు 8: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెలిగండ్ల ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని నాగులవరం గ్రామానికి చెందిన కొప్పుల జగన్‌మోహన్‌రెడ్డి అనే వ్యక్తి శుక్రవారం వెలిగండ్లలో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా మద్యం తరలిస్తుండగా తనిఖీ చేసినట్టు చెప్పారు. అతని వద్ద ఉన్న 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మండలంలో కోడి పందాలు, పేకాట లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్

కనిగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాల్షియంతో కూడిన ఆహారం తీసుకోవటం ద్వారా ఫ్లోరోసిస్ నుంచి బయటపడవచ్చని జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ వి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని చినఇర్లపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి నివారణకు పాలు, పెరుగు, రాగిజావ అధికంగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని వృద్ధులకు ఫ్లోరోసిస్ నివారణ చర్యలు గురించి వివరించారు. స్వచ్ఛమైన మంచినీటిని సేవించడం ద్వారా ఫ్లోరోసిస్‌ను నివారించవచ్చునని చెప్పారు. ఫ్లోరోసిస్ కారణంగా వైకల్యం పొందిన 46 మందికి కేంద్ర ప్రభుత్వం సహకారం ద్వారా వచ్చిన వీల్‌ఛైర్స్, వాకింగ్ స్టిక్స్, లంబార్ బెల్ట్‌లను అందజేశారు. ఇంకా అవసరమైన వారికి త్వరలో ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ దాదాషరీఫ్, హెల్త్ సూపర్‌వైజర్ ఆంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ భాస్కర్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తూ మృత్యువాత

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తూ మృత్యువాత పడిన హృదయవిదారక ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కె.ఓబులేసు (45) అనే వ్యక్తి పామూరు మండలం పాబోలువారిపల్లిలో తన బంధువు మృతి చెందడంతో కడసారి చూపుకోసం శుక్రవారం పాబోలువారిపల్లి గ్రామానికి బైక్‌పై వచ్చారు. అంత్రక్రియలు పూర్తయిన తరువాత రాత్రిపూట స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో జాతీయ రహదారి పనులో భాగంగా పాబోలువారిపల్లి వద్ద నిర్మాణమవుతున్న బ్రిడ్జిని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో ఓబులేసుకు బ్రిడ్జికి ఉన్న ఇనుప చువ్వలు గుచ్చుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకొన్న పామూరు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. బంధువు కడసారి చూపునకు వెళ్లి అనంతలోకాలకు వెళ్లవా అంటూ కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్నారు.

టీడీపీ సభ్యత్వాల లక్ష్యాన్ని అధిగమించాలి

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల లక్ష్యాన్ని బూత్ కమిటీ ఇన్‌చార్జులు అధిక మించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం పామూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన టీడీపీ శ్రేణులతో మాట్లాడారు. ఈనెల 11 జరుగనున్న శాసనసభ సమావేశాల నాటికి సభ్యత్వాల లక్ష్యాన్ని అధిగ మించి కనిగిరి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. లక్ష్యాన్ని అధిగమించినవారికే గుర్తింపు ఉంటుందని చెప్పారు. బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు పట్టుదలతో పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల. పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజారహంతుల్లా, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి పాలపర్తి వెంకటేశ్వర్లు, పందిటి హరీష్, పువ్వాడి వెంకట్‌చౌదరి, మెంటా నరసింహారావు, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

21న పెదఇర్లపాడులో శివలింగాల ప్రతిష్ఠ

కనిగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలోని పెద ఇర్లపాడులో గల శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివలింగ ప్రతిష్ఠోత్సవం ఈనెల 11న జరుగుతుందని మహారుద్ర పీఠం వ్యవస్థాపకుడు పలుకూరి సుబ్బారావు స్వామి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆలయంలో చేపట్టే కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈనెల 15న లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్తీకమాసం సందర్భంగా ఈనెల21న 108 శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనటం పూర్వజన్మ సుకృతమని, తప్పకుండా పాల్గొంటానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతెలిపారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు కనిగిరి విద్యార్థుల ఎంపిక

కనిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు కనిగిరి పట్టణంలోని చింతలపాలెం హైస్కూల్‌కు చెందిన విదార్థులకు ఎంపికైనట్లు హెచ్ఎం రామశర్మ తెలిపారు. ఈనెల 2న జిల్లాలోని గొట్లగట్టు హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17లో జరిగిన బాలబాలికల రగ్బీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అక్షర, కీర్తి, లక్ష్మీప్రసన్న, నిత్యశ్రీ, హిమజలు కడప జిల్లాలోని కమలాపురంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొట్లగూడూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చందలూరి మధు కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధనరావు రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ నగదును శుక్రవారం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిబావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సర్పంచ్ వై.బాల, అనపర్తి శశిమహేశ్వరరావు, కమ్మ నరసింహం, కోటపాటి రాజ, కోటపాటి రాంమోహన్ ఆయనకు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
శనివారం 9 నవంబరు 2024 బాపట్ల 4 పేజీలు







ప్రజా జీవితంలో తిరుగులేని ఆధిపత్యం కొనసాగించే రాజకీయ ఉద్దండులు అరుదుగా కనిపిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అలాంటి అరుదైన గౌరవం సొంతం చేసుకున్న నాయకుడు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్. ముఖ్యమంత్రి చంద్రబాబును మినహాయిస్తే రాష్ట్ర మంత్రివర్గంలో ఐదు పర్యాయాలు వరుస విజయాలతో మంత్రి పదవిని అలంకరించిన ఏకైక ప్రజానేత రవికుమార్ ఒక్కరే. హంగూఆర్భాటాలు లేని రాజకీయ జీవితం సాగించడం ద్వారా ఆ ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. ప్రజలతో పయనిస్తూ.. వారి కోసమే పనిచేస్తూ.. నిజాయితీ రాజకీయాలకు నిలువుటద్దంలా నిలుస్తున్నారు. ప్రస్తుతం కేబినెట్ మంత్రిగా, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంతరంగీకులైన మంత్రుల్లో ముఖ్యుడిగా ఉన్నప్పటికీ.. రవికుమార్ మనస్తత్వం, నడవడిక మారలేదు. ప్రజా సేవ, అభివృద్ధి సాధన కోసం ఆయన పడుతున్న తపనను చూసి ప్రజలు ఔరా! అని మెచ్చుకుంటున్నారు. 2004లో మార్టూరు, 2009 నుంచి అద్దంకి నియోజకవర్గ ప్రజల ఆదరణతో ముందుకు సాగుతున్న ఆయన రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజల మన్ననలు పొందగలరనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.



రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి
గొట్టిపాటి రవికుమార్ పుట్టిన రోజు
సందర్భంగా ప్రత్యేక సంచిక



మనిషి మనసు మారలేదు

- నిన్న ఎమ్మెల్యే అయినా.. నేడు మంత్రి అయినా ఒకే పంథా
- హంగూ ఆర్భాటాలకు దూరం
- కక్షసాధింపులు లేకుండా స్నేహహస్తం
- కొనసాగుతున్న ఊరూరా పర్యటనలు.. ఇంటింటి పలకరింపులు
- మూడు నెలలకే ముఖ్యమంత్రి నుంచి కితాబు
- నియోజకవర్గంలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి
- శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టి
- ఇదీ మంత్రి గొట్టిపాటి నడవడిక



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుపు. ఆ వెంటనే కీలకమైన మంత్రి పదవి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రత్యేక ఆదరణ. పెరిగిన బాధ్యతలు, పనిభారం. అయినా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మనసు మారలేదు. ఎమ్మెల్యేగా ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ముందుకు సాగుతున్నారు. ఆయన వద్దకు వచ్చే ప్రజలను పోలీసులు అడ్డగించరు. రవికుమార్‌ను కలిసేందుకు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన అవసరం లేదు. నేరుగా ప్రజలు ఆయన్ను కలవొచ్చు. బాధ్యతలు, పని భారం పెరిగినప్పటికీ నియోజకవర్గంలో ఎప్పటిలాగానే ఊరూరా.. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించడం షరా మామూలుగానే సాగుతున్నాయి. మంత్రి రవికుమార్ ఇంటికి వెళ్లినా, ఆఫీస్‌కు వెళ్లినా పోలీసుల అడ్డగింతలు, సిబ్బంది ఛీత్కారాలు, నియోజకవర్గానికి వస్తే కుయ్‌కుయ్‌మని హారన్‌లు, ప్రజలను ఆమడదూరంలో ఆపే ప్రత్యేక పోలీసు బలగాలు అసలు కనిపించడం లేదు. బాధ్యతలు పెరిగాయి కదా అని నియోజకవర్గ ప్రజల సమస్యలను, అభివృద్ధిని ఆయన విస్మరించ లేదు. దీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సంబంధించిన ఫైళ్లు కదిలాయి. ఇక స్థానికంగా జరగాల్సిన పనులు, తన వద్దకు వచ్చిన వారి వ్యక్తిగత సమస్యలను గతంలో వలే ఆయనే వినడం, సంబంధిత అధికారులకు నేరుగా ఫోన్ చేయడం యథాప్రకారం జరిగిపోతుంది. ఇదంతా ఆయన నిర్దిష్టమైన ప్రణాళికతో నడవడంతోపాటు ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలన్న ఆయన మనస్తత్వానికి దర్పణం పడుతోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రాధాన్యం

రాష్ట్రంలో ప్రస్తుత నాయకుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లాంటి ఒకరిద్దరు మినహా వరుసగా ఐదుసార్లు గెలుపొందిన వారిలో అద్దంకి ఎమ్మెల్యే అయిన గొట్టిపాటి రవికుమార్ ఒకరు. వ్యాపార రంగం నుంచి అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ పర్యాయం గెలుపొందిన వెంటనే మంత్రి అయ్యారు. అధికారికంగా కానీ, అనధికారికంగా కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా అంశాలపై సమీక్ష చేసేటప్పుడు పిలిచే అతికొద్దిమంది మంత్రులు, ముఖ్యనేతల్లో రవికుమార్ ఒకరయ్యారు. మూడున్నర నెలల్లో అనేక అనధికారిక సమీక్ష సమావేశాలకు రవికుమార్‌ను ముఖ్యమంత్రి పిలిపించుకొన్నారు. అంతేకాక తన 100 రోజుల పాలన ముగుస్తున్న సమయంలో క్షేత్రస్థాయిలో అసలు ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు సీఎం చంద్రబాబు ముగ్గురు, నలుగురు మంత్రులతో సమావేశం కాగా అందులో కూడా రవికుమార్ ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి మంత్రుల నియామకంలో భాగంగా రవికుమార్‌కు రెండు జిల్లాల బాధ్యతలు ఇవ్వడం సీఎం చంద్రబాబు వద్ద రవికుమార్‌కు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

కక్ష సాధింపులకు తావులేదు

వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులతో రవికుమార్ ఆర్థికంగా కుంగిపోయిన విషయం విదితమే. సుమారు 11 గ్రానైట్ క్వారీలు, రెండు ఫ్యాక్టరీలు మూలనపడ్డాయి. న్యాయపరమైన పోరాటం చేశారే తప్ప అప్పటి ప్రభుత్వానికి లొంగలేదు. ఇప్పుడు తన క్వారీలను వినియోగంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారే తప్ప కక్షసాధింపుతో ఎదుటివారి క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడే పనులు చేయలేదు. చివరకు పాలిషింగ్ ఫ్యాక్టరీల వారు రవాణా చేసే వాహనాలపై గతంలో వైసీపీ నాయకులు అవలంబించిన వసూళ్ల విధానం జోలికెళ్ల లేదు. తన అనుచరులు కానీ, పార్టీ శ్రేణులు కానీ ఆ విషయంలో జోక్యం చేసుకోకుండా నిరోధించగలిగారు. రాష్ట్రంలో గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు ఉన్న ప్రాంతాల్లో అనేక చోట్ల అవలంబిస్తున్న వసూళ్ల కార్యక్రమం తన నియోజకవర్గంలో అమలు కాకుండా చూడటం ద్వారా అందరి మన్ననలు పొందగలిగారు.

పనిభారం పెరిగినా..

ఇటు మంత్రి బాధ్యతలతోపాటు, అటు చంద్రబాబు అప్పగించే పార్టీ బాధ్యతలతో రవికుమార్‌కు పనిభారం పెరిగింది. దీంతో తమకు ఆయన దూరమవుతారన్న భావన అద్దంకి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, శ్రేణులతోపాటు గొట్టిపాటి అభిమానులు, యావత్తు ప్రజానీకంలో ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. మంత్రి అయిన తర్వాత తొలివారంలో రవికుమార్ పనిభారాన్ని గమనించిన కొందరు టీడీపీ నాయకులైతే మంత్రి అయిన వారు తర్వాత ఎమ్మెల్యేగా ఓడిపోతున్నారంటే ఆ పదవి మోజులో నియోజకవర్గ ప్రజలను పట్టించుకోకపోవడమేనన్న వ్యాఖ్యానాలు కూడా వేశారు. అయితే మూడు నెలలు తిరిగే సరికి ఆ నాయకులే విస్తుపోయేలా రవికుమార్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. గడచిన రెండు నెలలపాటు ఆంధ్రజ్యోతి బృందం ఆయన పనితీరు, నడవడికను పరిశీలించగా గతం కన్నా మిన్నగా ప్రజలకు అందుబాటులో ఉన్నారన్న విషయం తేటతెల్లమైంది. గతంలో మాదిరిగానే నియోజకవర్గంలో పార్టీశ్రేణులు, మద్దతుదారుల ఇళ్లలో ఏ కార్యక్రమాలు జరిగినా ఆయన హాజరవుతున్నారు. ఆ సందర్భంగా ఆ గ్రామంలోని పార్టీశ్రేణుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. గత రెండు మాసాలు పరిశీలన చేయగా సరాసరిన వారంలో ఐదురోజులు ఎప్పటిలాగా రవికుమార్ చిలకలూరిపేటలోని స్వగృహంలో కానీ, నియోజకవర్గంలో ఏదో ఒక మండలంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. వారంలో నాలుగు రోజులపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాలను సందర్శించడం కనిపించింది. గతంలో మాదిరిగానే ఆయన పర్యటనలు, పలకరింపులు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న రవికుమార్


వృద్ధుడి సమస్యను వింటున్న మంత్రి గొట్టిపాటి


దివ్యాంగురాలికి ట్రై మోటారు సైకిల్‌ను అందజేస్తున్న రవికుమార్

హంగూ ఆర్భాటాలకు దూరం

అధికార పార్టీ నాయకుడైతే చాలు చుట్టూ పోలీసులు లేక ప్రైవేట్ సైన్యాన్ని వెంటేసుకొని హడావుడి చేస్తున్న నాయకులు మనకు కనిపిస్తున్నారు. ఇక మంత్రి అయిన వారు నియోజకవర్గానికి వస్తారో రారో తెలియక సచివాలయానికి, వారు ఉండే విజయవాడ నివాసానికి వెళ్లి రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. కానీ రవికుమార్ మంత్రి అయిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే సమయాన్ని పెంచారంటే అతిశయోక్తి కాదు. అలాగే శాఖాపరమైన పనుల ఒత్తిడి పెరిగితే రాత్రి బసచేసేందుకు తాడేపల్లిలో నివాసం చూసుకున్న ఆయన అవకాశం ఉన్న మేరకు రాత్రికి చిలకలూరిపేటకు చేరుతున్నారు. చిలకలూరిపేటలోని ఇంటి వద్ద పాత విధానమే తప్ప మంత్రి అయిన తర్వాత వచ్చే పోలీస్ బందోబస్తు, హంగులు పక్కన పెట్టారు. ఉదయం 7 గంటల నుంచి నియోజకవర్గ ప్రజలతో గడుపుతున్నారు. ఒక వేళ తాడేపల్లిలో ఉన్నా ఉదయం 10.30 గంటల వరకు వచ్చిన వారిని కలిసి ఆతర్వాత సచివాలయ చాంబర్‌కు వెళ్తున్నారు. అక్కడ శాఖాపరమైన సమీక్ష సమావేశాలు ఉన్నా ముందుగా తనకోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారిని పంపించిన తర్వాతే వెళ్తున్నారు. ఇలా ఎక్కువ సమయాన్ని తనకోసం వచ్చే వారికి కేటాయిస్తున్నారు. చిలకలూరిపేట, తాడేపల్లిలోని నివాసం వద్ద సచివాలయంలోని తన చాంబర్ వద్ద కూడా ఆర్భాటాలు, హంగులు లేకుండా వచ్చిన ప్రజలను పోలీసులు నెట్టివేసే పద్ధతికి అవకాశం లేకుండా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో పర్యటించే సమయంలోనూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలా ఒంటరిగా వెళ్లారో ఇప్పుడూ అలాగే వెళ్తున్నారు. ఆయన వద్ద ప్రైవేటు సైన్యం లేదు. పోలీసు బందోబస్తు అదనంగా లేకుండా చూసుకుంటున్నారు.


మల్లాయపాలెంలో ప్రత్యేక లైన్ పనులు చేస్తున్న కూలీలు

పరపతి పెరిగింది. పనిభారం ఎక్కువైంది. అయినా నియోజకవర్గ సమస్యలను ఆయన ఏమాత్రం విస్మరించలేదు. ప్రతిపక్ష నాయకులు సైతం అడ్రస్ లేకపోయినా రవికుమార్ మాత్రం మంత్రిగా వచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. నియోజకవర్గం మొత్తంగా విద్యుత్‌శాఖ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. విద్యుత్ లైన్‌ల ఆధునికీకరణ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ కార్యక్రమాలు తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేశారు. నిజానికి రూ.200 కోట్లకుపైగా నిధులు అవసరం కానున్నాయి. అందుకు కేవలం విద్యుత్‌శాఖ పరిధిలో ఉన్న నిధుల నుంచి కేటాయించడం కష్టం. దీంతో అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చుకునే

ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఉద్దేశంతో విద్యుత్‌శాఖ పనుల అమలుకు అప్పుడే శ్రీకారం పలికారు. గతంలోవలే ఆకస్మికంగా సాగర్ కాలువలపై పర్యటనలు చేపట్టారు. రైతుల విజ్ఞప్తి, తన దృష్టికి వచ్చిన అంశాలకు అనుగుణంగా మేజర్ కాలువల మరమ్మతు పనులకు ఆయన ఆదేశించగా అధికారులు ప్రారంభించారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల ఈనాం, అగ్రహారం భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ వాటి పరిష్కారానికి తొలిసారి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి రవికుమార్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు మంత్రికాగానే ఆ విషయం గుర్తు పెట్టుకొని ఆ భూములు సర్వేచేసి రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయడం పెద్ద విజయంగా ఆప్రాంత ప్రజలు కొనియాడుతున్నారు. పోలిరెడ్డి, కొరిశపాడు ఎత్తిపోతల పథకం, భవనాశి రిజర్వాయర్ నిర్మాణ పనులు గత పదేళ్లగా ముందుకు కదలలేదు. వాటిపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష చేసి పనుల్లో పురోగతి కోసం కృషి చేస్తున్నారు. గుండ్లకమ్మ గేట్ల సమస్యను సంబంధిత మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి అధికారులతో ఒకటికి రెండుసార్లు సమావేశాలు నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపారు. వారంలో కనీసం రెండు రోజులు ఆయా మండలాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి స్థానిక, ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మూడు నెలల్లోనే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం వందల దరఖాస్తులు పంపి అందులో అత్యధిక మందికి ఆర్థిక సహాయం అందేలా చేయగలిగారు. కీలకమైన అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా చేసే ప్రక్రియకు శ్రీకారం పలికారు.


అద్దంకి పట్టణం వ్యూ

అద్దంకి అభివృద్ధికి పక్కా ప్రణాళిక

- గ్రామగ్రామానా సీసీ రోడ్లకు నిధులు మంజూరు
- రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సన్నాహాలు
- 100 పడకల ఆసుపత్రిపై మంత్రి రవికుమార్ దృష్టి

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని అద్దంకి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. మెరుగైన సరఫరాకు అవసరమైన పనులు ప్రారంభించారు. అదేసమయంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను కూడా ప్రత్యేక కోటాలో మంజూరు చేశారు. దశాబ్ద కాలం వరకు ఎలాంటి లోవోల్టేజీ సమస్య లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒకప్పుడు తాలూకా కేంద్రంగా ఉన్న అద్దంకి పట్టణం మండల వ్యవస్థ వచ్చిన తరువాత మండలం, నియోజకవర్గ కేంద్రానికే పరిమితమైంది. జిల్లాల పునర్విభజన సమయంలో కూడా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని భావించినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరగలేదు. అయితే ప్రస్తుతం అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు వేగవంతంగా ఫైలు కదులుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో అన్ని సౌకర్యాలు, వసతులతో అద్దంకిలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుపై కూడా గొట్టిపాటి రవికుమార్ దృష్టి సారించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో ఈనాం, అగ్రహారం భూముల సమస్యల శాశ్వత పరిష్కారానికి కూడా వేగంగా పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల రూపాయలతో అన్ని గ్రామాలలో రూ.20 నుంచి రూ.50 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. అద్దంకి పట్టణంలో కాలువ కట్టను మినీ బైపాస్ రోడ్డుగా మార్చేందుకు నిధుల మంజూరుపై కూడా దృష్టి సారించారు. గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో ఉన్న అవకాశాలను వినియోగించి అద్దంకి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.


మోదేపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవికుమార్ (ఫైల్)


ఏల్చూరులో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్



మెరుగైన విద్యుత్ సరఫరాపై దృష్టి

- శిథిలావస్థలో ఉన్న స్తంభాల తొలగింపు
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జిల్లాలోనే బల్లికురవ మండలం టాప్
- పరిశ్రమలు, గృహాలకు లోవోల్టేజీ లేకుండా ప్రత్యేక లైన్‌ల ఏర్పాటుకు మంత్రి రవికుమార్ కృషి


కొప్పెరపాడు సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మెరుగైన విద్యుత్ సరఫరాపై ఆశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టి సారించారు. ప్రత్యేక విద్యుత్ లైన్లను మంజూరు చేయించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు రూ.2 కోట్లతో ప్రత్యేక లైన్‌ను వేయించారు. మండలంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో 300 మంది రైతులకు 180 ట్రాన్స్‌ఫార్మర్లను, 200 విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించారు. జిల్లాలోనే బల్లికురవ మండలం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ప్రథమ స్థానంలో ఉంది. అలాగే వేమవరం గ్రామం వద్ద గ్రానైట్ పరిశ్రమలు పెద్దఎత్తున ఉండటం, వాటికి తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి రవికుమార్ రెండు కిలోమీటర్ల మేర రూ.24 లక్షలతో త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించారు. అలాగే కొప్పెరపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా 5 ఎంబీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి ప్రారంభించారు. గ్రామాలలో గృహాలకు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న లోపాలను గమనించి ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారామండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, మల్లాయపాలెం గ్రామాలలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసి శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తీసి వేయించి బాగా ఎత్తు ఉన్న స్తంభాలను, కొత్త లైన్‌ను మంత్రి రవికుమార్ ఏర్పాటు చేయించారు. మండల కేంద్రమైన బల్లికురవలో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి దూరంగా వేయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్నాయి.


















జన్మదిన శుభాకాంక్షలు
స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు గారు మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ గొట్టిపాటి నర్సయ్య గారు మాజీ మంత్రివర్యులు
స్వర్గీయ డా॥ గొట్టిపాటి శేషగిరిరావు గారు
స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ బాబు గారు
ప్రజారంజక పాలనలో
తన వంతు పాత్ర పోషిస్తూ
ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
అడుగు జాడల్లో ముందుకు వెలుతు
అంచలంచలుగా ఎదుగుతున్న
మా ప్రియతమ మంత్రివర్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
అమూల్య మినరల్స్ కొండాయపాలెం, బల్లికురవ మండలం
వెంకటాద్రి మినరల్స్ & బివిఎల్ రాక్స్ మల్లాయపాలెం
సత్యకృష్ణ గ్రానైట్స్ దివ్య గ్రానైట్
కెయస్ఆర్ గ్రానైట్స్
S.R కన్‌స్ట్రక్షన్స్ కొనిదెన
సాయి స్టోన్స్ బల్లికురవ
శ్రీ శ్రీనివాస గ్రానైట్స్ కొనిదెన
వి.కె.గ్రానైట్
కృష్ణ సాయి ఎక్స్‌పోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్
లక్ష్మీ గ్రానైట్స్ కొనిదెన
గిరిరాజ్ గ్రానైట్స్
M.V.R గ్రానైట్స్ కొనిదెన
హనుమాన్ ఎక్స్‌పోర్ట్సు మల్లాయపాలెం
ఆర్ణ గ్రానైట్స్ మల్లాయపాలెం
బల్లికురవ మండల కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ బల్లికురవ
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు


జన్మదిన శుభాకాంక్షలు
స్వర్గీయ గొట్టిపాటి
హనుమంతరావు గారు
మాజీ మంత్రివర్యులు
ప్రజలు మెచ్చిన నేతగా
తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొంది
రాజకీయాలలో ఘనాపాటిగా ముద్ర వేసుకొని
తనను నమ్మిన వారికి తాను ఉన్నానని భరోసా కల్పిస్తూ
అంచెలంచెలుగా ఎదుగుతూ
స్వర్ణాంధ్ర రూపకర్త శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవలు అందిస్తున్న
మా అద్దంకి ముద్దుబిడ్డ
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
ముమ్ముందు మరెన్నో
జన్మదిన వేడుకలు జరుపుకోవాలని
మనస్ఫూర్తిగా
కోరుకుంటూ...
మీ...
శ్రీ గొట్టిపాటి
రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖమాత్యులు
కామేపల్లి లక్ష్మీప్రసాద్
కామేపల్లి గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్
జొన్నతాళి, మార్టూరు మండలం
శ్రీ నారా
చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

II

శనివారం 9 నవంబరు 2024





బాపట్ల రూరల్ పరిధిలో బధిరుల పాఠశాల వెనుక జరుగుతున్న ఇసుక తవ్వకాలు(ఫైల్‌ఫొటో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ

నిబంధనలు పాటించకుంటే కేసులు

- బెల్ట్ నిర్వాహకులపై 87 కేసుల నమోదు
- దుకాణదారులకు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరిక

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేకుంటే కేసుల నమోదుకు వెనుకాడబోమని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. బాపట్లలోని ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు 87 కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. నిరంతర తనిఖీలలో భాగంగా నాటుసారా అమ్ముతున్న 28 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం పేర్కొన్న ధరలకే మద్యం అమ్మాలని, ఇలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ దేవదత్తు, అసిస్టెంట్ సూపరిటెండెంట్లు జనార్ధనరావు, వెంకటేశ్వరరావు, సీఐ గీతిక పాల్గొన్నారు.

జీఐఎస్ పరిజ్ఞానంతో రాజధాని పనులు వేగవంతం

తుళ్లూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి) ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతాయని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఎస్రీ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జీఐఎస్ మ్యాపింగ్ టెక్నాలజీపై విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఉద్యోగులకు కార్యశాల జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, జీఐఎస్ సాంకేతికతతో నిర్మాణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయగలమన్నారు. ఈ టెక్నాలజీని ఉద్యోగులు అందిపుచ్చుకొని అత్యున్నత లక్ష్యాలను అధిగమించాలన్నారు. నిత్య జీవితంలో చరవాణితో సాంకేతికతను ఏవిధంగా పెంపొందించుకుంటున్నామో అదేవిధంగా జీఐఎస్‌ను కూడా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్రీ ఇండియా ప్రతినిధి డాక్టర్ రమాచక్రవర్తి జీఐఎస్ మ్యాపింగ్ వినియోగాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యశాలలో ఏపీ సీఆర్డీ అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సుకు ఆగస్టులో నిర్వహించిన మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9205 మంది విద్యార్థులు హాజరు కాగా వారి లో 6923 మంది ఉత్తీర్ణత సాధించిన ట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వ విద్యాలయ వెబ్ సైట్ నుంచి పొం దవచ్చునని పే ర్కొన్నారు. ఫలితా లకు సంబంధించి ఎవరైనా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.1680 చెల్లించి ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తులను ఆయా కళాశాలలకు అందజేయాలని సూచించారు.



తెనాలి: కొల్లిపర వద్ద ట్రాక్టర్లకు ఇసుక ఎత్తుతున్న కూలీలు

ఉచితమని వస్తే ఊరుకోం

ఇసుక ఉచితం.. ప్రభుత్వం ప్రకటించింది.. ముఖ్యమంత్రి చెప్పారు.. అని వస్తే ఊరుకునేది లేదు. మా ఇసుక. మా ఇష్టం.. అంటూ రీచ్‌ల వద్ద నేతలు, ఇసుక అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం.. నేతలకు, అక్రమార్కులకు వరంగా మారింది. సీఎం చెప్పినట్లుగా సొంత అవసరాల కోసం రీచ్‌ల వద్దకు వెళ్తే అక్కడి వారి దౌర్జన్యాలు, బెదిరింపులకు బలికావాల్సి వస్తోంది. సీఎం చెప్పారు మీరేందని ఎదురు తిరిగితే నదిలోకి దిగితే పాతరేస్తామని తెనాలి పరిధిలోని రీచ్‌ల వద్ద కొందరు బరితెగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా ఉచిత ఇసుక అమలు కావడంలేదు. వైసీపీ హయాంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నేతలు ఇసుక పేరుతో కాసులు పోగేసుకుంటున్నారు. ఇసుక అక్రమాల విషయంలో గత వైసీసీకి, ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద తేడాలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. సామాన్యులు ఇబ్బంది పడకుండా ఇసుక తెచ్చుకునేందుకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దందా చేస్తున్నారు. మరోవైపు మరికొందరు పంచాయతీ, పోలీసుల పేరుతో అధికార దందా సాగిస్తున్నారు.

- నదిలోకి ట్రాక్టర్ దిగాలంటే రూ.500 కట్టాలి.
- అందరికంటే ముందు లోడ్ చెయ్యాలంటే రూ.600 అదనం.
- బయటి నుంచి వచ్చిన ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లిస్తేనే ఇసుక.
- పంచాయతీల్లో జరిగే రోడ్ల నిర్మాణానికి ఇసుక కావాలంటూ పంచాయతీ కార్యదర్శుల పేరు, కార్యాలయ స్టాంప్‌తో లేఖలు
- పోలీస్‌నంటూ రాత్రుళ్లు రెండు లారీలతో ఇసుక తరలింపు
- పల్నాడు జిల్లాల్లో రాత్రిళ్లు వందల కొద్దీ లారీలతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- రీచ్‌ల వద్ద నేతల బెదిరింపులు
- నదీ మార్గంలో గండికొట్టి మరీ దౌర్జన్యం
- నగదు ఇవ్వకుంటే ట్రాక్టర్ దిగనివ్వని వైనం
- అధికారం మారినా కొనసాగుతున్న ఇసుక దందా
- పట్టించుకోని అధికారులు.. యథేచ్ఛగా అక్రమాలు
- అక్రమార్కులకు వరంగా మారిన ప్రభుత్వ వెసులుబాటు



తెనాలి: అరవింద వారధి దగ్గర పెదలంక వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

బాపట్ల, తెనాలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు అవుతున్న ఉచిత ఇసుక విధానం. ఇసుక సామాన్యులకు కూడా సులభంగా అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తూ.. ఇసుకలో నేతలు, వారి అనుచరులు జోక్యం చేసుకోవద్దని హెచ్చరిస్తున్నా ఆలకించే వారే లేరు. ఇసుక అక్రమ సంపాదనకు రుచిమరిగిన అక్రమార్కులు మాత్రం ఇంకా కాసులు దోచేస్తూనే ఉన్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువున, దిగువున ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల సొంత అవసరాల కోసం నేరుగా రీచ్‌ల వద్దకు వచ్చి ఇసుకను తవ్వి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వగా ఇదే అవకాశంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకల్లో మాత్రమే స్థానికులు తమ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంటే అసైన్డ్, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు తెగబడి సొమ్ము చేసుకుంటున్నారు. సొంత అవసరాలకు ఇసుక కోసం ముందస్తు అనుమతి తీసుకుని పర్మిట్ ఉండాలని నిబంధన ఉన్నా వాటిని పట్టించుకునే వారే లేరు. ఈ తవ్వకాల వెనక కీలకంగా వ్యవహరిస్తున్నది పాలకపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణమే కావడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు వేస్తున్నారు. పల్నాడు జిల్లాల్లో అయితే రాత్రిళ్లు వందల కొద్దీ లారీల్లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో ఎత్తి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాట రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతి లేకపోయినా నేతల ఘరానా దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. చాలాచోట్ల గత ప్రభుత్వంలో ఇసుక దందా నడిపిన వైసీపీ నాయకులు, వారి అనుచరులే మళ్లీ అక్రమాలకు పాల్పడుతుంటే, మరికొన్నిచోట్ల కూటమి నేతల పేరుచెప్పి వారి అనుచరులు ఇసుక దందాకు తెరతీస్తున్నారు. తాడేపల్లి మండలం మొదలు రేపల్లె మండలం వరకు కృష్ణా తీరంలో ఇసుక దందాకు అడ్డేలేకుండా పోతోంది. బ్యారేజి దిగువున గుంటూరు జిల్లాలో చిర్రావూరు, గుండిమెడ, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, బొమ్మువానిపాలెం, చిలుమూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, ఓలేరు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిలో మూడింటికి మాత్రమే మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. మిగిలినవాటిలో స్థానిక కూటమి, వైసీపీ నేతలు హవా కొనసాగిస్తూ వసూళ్ల దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల డబ్బు కట్టకుంటే వాహనాలు నదిలోకి దిగడానికి వీలులేదంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్న పరిస్థితులూ ఉన్నాయి. రీచ్‌ల వద్ద ఉన్న వారు అడిగినట్లు నగదు ఇవ్వకుంటే నదిలోకి దిగనివ్వమంటూ అడ్డుకుంటున్నారు. కొన్ని దగ్గర్ల ఇతరుల వాహనాలు నదిలోకి దిగే దాలు మార్గానికి గుంతలతో గండ్లు కొట్టేస్తున్నారు. కొల్లూరు మండలం పెసర్లంక, గాజుల్లంక, చిలుమూరు దగ్గర అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానుల నుంచి కూడా జనసేన, టీడీపీ నాయకులు రూ.500 కప్పం వసూలు చేస్తున్నట్లు సమాచారం. అరవింద వారధి దగ్గర డబ్బు కట్టకుండా ట్రాక్టర్లు లోనికి దిగుతున్నాయని వారం క్రితం ఎక్స్‌కవేటర్‌తో గొయ్యితవ్వించేశారు.

హెచ్చరించినా.. తగ్గేదిలేదు..

బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, అత్తలూరివారిపాలెం తదితర రీచ్‌ల వద్ద పక్షం రోజుల క్రి తం వరకు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేశారనే ఆరోపణలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ పరిశీలించారు. ట్రాక్టర్‌కు రూ.600 మించి వసూలు చేయరాదని, అంతకు మించి వసూ లు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అయినా మరికొన్ని అడ్డదారులు సృష్టించుకుని వసూ ళ్లు మాత్రం ఆపలేదు. ఇసుక రీచ్‌లు ఉండే గ్రామాల పరిధిలోని ట్రాక్టర్‌లకు రూ.500 అ దనంగా వసూలు చేస్తుంటే, బయట ప్రాంతాల నుం చి ఇసుక కోసం వచ్చే ట్రాక్టర్‌లకు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ముందుగా లోడింగ్ కావాలంటే అదనంగా రూ.600 చెల్లిస్తే కూ లీలే ఆ వాహనం దగ్గరకు వెళ్లి ఇసుక లోడ్ చేస్తున్నారు.

పంచాయతీల పేరుతో..

గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో జరిగే నిర్మాణ అవసరాలకు ఇసుకకు ప్రత్యేక అనుమతి ఉంది. ఆయా పనుల వివరాలతో పంచాయతీ తీర్మానం చేసి దాని ఆధారంగా కార్యదర్శి లేఖను ఇస్తే ఆ మండల తహసీల్దార్ సిఫార్సుతో ఇసుక లోడ్ చేసుకోవచ్చు. లేదంటే పంచాయతీరాజ్ ఏఈ లేఖ ఇచ్చినా సరిపోతుంది. అయితే కొన్ని రీచ్‌ల వద్ద నేరుగా పంచాయతీ కార్యదర్శుల పేరు, స్టాంప్‌తో చేతిరాతతో ఉన్న లేఖలను చూపి వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ లేఖలు అసలా, నకిలీనా అంటే సమాధానం చెప్పేవారు పరిశీలించే వారే లేరు. నిజాంపట్నం, కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి, బాపట్ల మండలాల్లోని పంచాయతీల పేరుతో లేఖలు ఎక్కువగా వస్తున్నాయి. పంచాయతీ లేఖ ఉందని పోలీసులూ కూడా వాటిని వదిలేస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులకు కాసులు పండుతున్నాయి.

బుసక పేరిట తమ్ముళ్ల మేత

ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికలు, ఇసుక తవ్వకాలకు నిబంధనలను పట్టించుకోకుండా కొందరు నేతలు అధికారిక దందా చేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు అడ్డుకుంటే తాము తవ్వుతున్నది ఇసుక కాదని బుసక అని అక్రమార్కులు ఎదురుదాడికి దిగుతున్నారు. బుసక అయినా అనుమతులు ఉండాలన్నా పట్టించుకోవడవడంలేదు. బాపట్ల జిల్లాలో చీరాల, వేటపాలెం, చినగంజాం, బాపట్ల రూరల్ మండలాల పరిధిలో అక్రమార్కులు ఏకంగా ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఇటీవల చీరాల టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే వారిపైనే అక్రమార్కులు ఎదురుదాడికి దిగారు. బాపట్ల రూరల్ పరిధిలోని బధిరుల పాఠశాల వెనక అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ పరిధిలో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారీతిన జరుపుతున్నారు. అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతలే ఇసుక అక్రమ తవ్వకాల వెనుక ఉండటంతో కొందరు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారు. బాపట్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఇసుక భూముల్లో పది నుంచి 15 అడుగుల వరకు లోతుపెట్టి మరీ తవ్వేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్మేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులంతా బాపట్లలో ఉన్నా అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుంది.

దుగ్గిరాల కానిస్టేబుల్‌నని చెప్పి..

దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర గత వారం నుంచి ఓ వ్యక్తి తాను దుగ్గిరాల కానిస్టేబుల్‌ననిచెప్పి ఏకంగా లారీలతోనే ఇసుకను తరలించేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పెదకొండూరు రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుంటే బిల్లులు చూపాలని దౌర్జన్యం చేసి, అనుమతి లేని ట్రాక్టర్లను అడ్డుకుని లారీల్లో తమతోనే ఇసుక లోడ్ చేయించుకెళ్తున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. అయితే అతడు నిజంగా పోలీసా! లేక ఆ పేరుచెప్పి దౌర్జన్యానికి పాల్పడుతున్న నకిలీనా అనేది తేలాలి. దీనిపై తెనాలి రూరల్ పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే మాత్రం తమ కానిస్టేబుల్ ఎవరూ రారని, ఒకవేళ ఎవరైనా కానిస్టేబుల్ పేరుచెప్పి ఇసుక దందాకు సిద్ధపడితే సమాచారం ఇవ్వాలన్నారు.



బాపట్ల: వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన ట్రాక్టర్లు

అంతర్ రాష్ట్ర గజదొంగ అరెస్టు

- రూ. పది లక్షల బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా కేసులు

మంగళగిరి సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వరుస చోరీలకు పాల్పడుతున్న గజదొంగను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో 150కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ వివరాలను గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తోట శివకుమార్ అలియాస్ శివ విశాఖపట్నంలో స్థిరపడి నేర సామ్రాజ్యానికి తెరతీశాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడ్డాడు. చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడం, తిరిగి నేర ప్రవృత్తిని కొనసాగించడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన తరువాత మంగళగిరి మండలం ఎర్రబాలెం, నవులూరు గ్రామాల్లో వరుసగా ఏడు చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడి కోసం విస్తృతంగా గాలించారు. ఎట్టకేలకు నిందితుడు శివతోపాటు అతనికి సహకరించిన యిమ్మిడి నాగేశ్వరరావులను శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి, బంగారు తాపడంతో తయారు చేసిన రెండు చేతి గడియారాలు, ద్విచక్ర వాహనం కలిపి మొత్తం రూ.పది లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన మంగళగిరి రూరల్ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ అభినందించి రివార్డులను అందజేశారని చెప్పారు. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఆధునిక పద్ధతులతో లాభసాటి సాగు

» రైతులకు ఎమ్మెల్యేలు ఏలూరి, వర్మ పిలుపు » న్యూజిలాండ్‌లో వ్యవసాయ క్షేత్రాల సందర్శన

పర్చూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాశ్చాత్య దేశాల్లో రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాగును లాభసాటిగా మార్చుకున్నారని, ఆ విధానాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ అన్నారు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా అక్కడ వివిధ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి అధ్యయనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. న్యూజిలాండ్‌లో వాతావరణ పరిస్థితులు, పంటలు, తెగుళ్లు, వ్యాధులను గుర్తించేందుకు రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. నీటి పొదుపును పాటిస్తూ అవసరాలకు అనుగుణంగా జల వనరులను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు నూతన యంత్ర పరికరారాలు వాడేలా, ఆధునిక సాగు పద్ధతులు అనుసరించేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాల న్నారు. యువ రైతులు ఆధునిక పద్ధతులతో అద్భుతాలు సృష్టిస్తున్నారని గుర్తు చేశారు. విద్యుత్ శాఖ మంత్రితో భేటీ

న్యూజిలాండ్ విద్యుత్ శాఖ మంత్రి సిమియన్ బ్రౌన్‌తో ఎమ్మెల్యేలు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ భేటీ అయ్యారు. విద్యుత్ సిస్టమ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ రంగంలో ప్రధానంగా జలశక్తి, భూ ఉష్ణ శక్తి, పవన శక్తిని ఉపయోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించినట్లు ఏలూరి తెలిపారు. విద్యుత్ రంగంలో నూతన సంస్కరణలను అమలు చేస్తున్నామని బ్రౌన్ చెప్పారని అన్నారు. ఎమ్మెల్యేలతోపాటు ఆంధ్రా తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు మద్దుకూరి దిలీప్, టీడీపీ న్యూజిలాండ్ కోఆర్డినేటర్ జితేందర్ నిమ్మగడ్డ, అశోక్ గోరంట్ల ఉన్నారు.



న్యూజిలాండ్‌లో ఆధునిక యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

నేటి నుంచి బ్రహ్మంగారి మఠానికి బస్సు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నుంచి బ్రహ్మంగారి మఠానికి శనివారం నుంచి బస్ సర్వీస్ నడపనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ప్రతి రోజు అద్దంకిలో ఉదయం 5-30 గంటలకు బయలుదేరి దర్శి, పొదిలి, బేస్తవారిపేట, పోరుమామిళ్ల మీదుగా 11 గంటలకు బ్రహ్మంగారి మఠానికి చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మంగారిమఠంలో బయలుదేరి సాయం త్రం 5-45 గంటలకు అద్దంకి చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పంచారామాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు

పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో దర్శించుకునేందుకు అద్దంకి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. 10, 17, 24 తేదీ లలో రాత్రి 8 గంటలకు బయలుదేరుతాయన్నారు. సూపర్‌లగ్జరీకి రూ.2 వేలు, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1600, పల్లెవెలుగుకు రూ.1300 చార్జీ అని తెలిపారు. అరుణాచలం యాత్రకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 10, 17, 24 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కాంచీపురం, అరుణాచలం (గిరిప్రదక్షిణ) ఉంటుందన్నారు. చార్జీ రూ.2వేల రూపాయలని తెలిపారు. అద్దంకి ప్రాంత భక్తులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు.

శింగరకొండ ఆలయానికి కంప్యూటర్ అందజేత

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం కార్యాలయంలో వినియోగించుకునేందుకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్‌ను శుక్రవారం కెనరా బ్యాంక్ ఒంగోలు రీజనల్ హెడ్ రవికుమార్, అద్దంకి బ్రాంచి మేనేజర్ బాలాజీ ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీలలోని కానుకలను శుక్రవారం లెక్కించారు. జూలై 3 నుంచి శుక్రవారం వరకు హుండీల కానుకలను లెక్కించగా రూ.37,41,594 ఆదాయం వచ్చినట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 32 యూఎస్ డాలర్లు కూడా వచ్చినట్లు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వేణు గోపాలపరావు, ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు.

నారాయణ మృతదేహం వెలికితీత

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో గల్లంతైన తేలుకుట్ల నారాయణ (27) మృతదేహం శుక్రవారం సాయంత్రం బయటపడింది. ముండ్లమూరు మండలం బట్లపల్లికి చెందిన నారాయణ తన స్నేహితులతో కలిసి గుండ్లకమ్మ నదిలో ఈతకు వెళ్లి గురువారం సాయం త్రం గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది, ఒంగోలు నుంచి వచ్చిన మత్స్య శాఖ సిబ్బంది ప్రత్యేక బోట్‌లతో గాలించగా, సాయంత్రం గుండ్లకమ్మ నదిలో నర్రావారిపాలెం సమీపంలో బయటపడింది. బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుండ్లకమ్మ నది వద్దకు వచ్చారు. నారాయణ మృతదేహం బయటకు తీసిన సమయంలో ఒక్కసారిగా బోరున విలపించారు. ఏడాది బాబు కాగా, భార్య నిండు గర్భిణి ఉంది.

వ్యాసరచన పోటీల్లో శ్రీకర్‌కు బహుమతి

చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సమితి పాపరాజు తోట వారు ఆధ్యాత్మిక విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీకర్ సత్తా చాటి బహుమతి సాధించాడు. ఈమేరకు సంబంధిత నిర్వాహకులు శ్రీకర్‌ను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీలతో విద్యార్థులు లక్ష్యాలపై దృష్టి పెరుగుతుందని వివరించారు.


మూలవిరాట్ విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

రాములోరిని తాకిన ఆదిత్య కిరణాలు

చిన్నగంజాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెద్ద గంజాం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో శుక్రవారం ఉదయం 6.35 నిమిషాల నుంచి 7గంటల వరకు సూర్యకిరణాలు మూలవిరాట్ విగ్రహాలను తాకినట్లు అర్చకులు తెలిపారు. విషయం తెలుసుకున్న భక్తులు ఆ అద్భుతాన్ని చూసేందుకు పోటీపడ్డారు. శనివారం కూడా సూర్యకిరణాలు స్వామివారి విగ్రహం మీద పడనున్నట్లు అర్చకులు తెలిపారు.

తప్పిపోయిన బిడ్డ తల్లికి అప్పగింత

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన బిడ్డను ఎట్టకేలకు ఈపూరుపాలెం ఎస్సై శివ కుమార్ తల్లికి అప్పగించారు. ఒడిసాకు చెందిన మనోజ్ నాయక్, జున్ను దంపతులు పొట్టకూటి కోసం చీరాల మండలం కావూరివారి పాలెంకు వచ్చి పని చేసుకుంటున్నారు. అయితే గత శనివారం ఇంటి నుండి అదృశ్యమైన కుమారుడు మొళాయ్ నాయక్ ఆచూకీ కోసం ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబును గుర్తించి శుక్రవారం తల్లి జున్నుకు ఎస్సై అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.









సన్మాన గ్రహీత మంజులదేవిని సత్కరిస్తున్న ప్రతినిధులు

లూథరన్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల అర్థ శాస్త్ర అధ్యాపకురాలు గారపాటి మంజులాదేవి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాల సమావేశం హాలులో అభినందన సభ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అవార్డులు బాధ్యతను పెంచుతాయని, వాటిని సాధించడమే కాకుండా ఆ విలువలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టరేట్ సాధించిన మంజుల సేవలు అభినందనీయమన్నారు. చిన్నప్పటి నుంచీ ఆమె కష్టించి ఉన్నతంగా ఎదిగారన్నారు. మంజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపల్ పుష్పరాజ్, గుండె వైద్యనిపుణులు డా.ఐ.బాబురావు, సుభాషిణి, జయశీలరావు, విద్యాసాగర్, నూకతోటి సదానందరావు, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మార్టూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు తాగి నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మహిళ ఇండేల శ్రీలక్ష్మి (35) శుక్రవారం వేకువ జామున మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. శ్రీలక్ష్మికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన వివాహిత గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమె గడ్డి మందు తాగగా, గమనించిన కుటుంబసభ్యులుఆమెను మార్టూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందారు. తండ్రి కాశిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విచారణ జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్ నియామకం

ఈపూరుపాలెం ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతలు



చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్ నియామకం అయ్యారు. ఈమేరకు సంబంధిత శాఖ ఉన్నత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత మూడు నెలలుగా చీరాలకు సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు రెండు స్థానాల్లో బాధ్యతలు ఉండడంతో సమస్యల పరిష్కారంలో ప్రజలు ఒకింత అసంతృప్తిలో ఉన్నట్లు చెప్పాలి. ఎట్టకేలకు రెగ్యులర్ అధికారిని నియమించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నట్లుయింది. మొయిన్ డీజీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్ నుంచి చీరాలకు రానున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈపూరుపాలెం ఎస్సైగా అంబటి చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలల కిందటే ఆయనకు పోస్టింగ్ కల్పించినా అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఎట్టకేలకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధుల్లో ఉన్న శివకుమార్ ఎస్‌బీ విభాగానికి వెళ్లారు. చంద్రశేఖర్‌కు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా అందించాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా అందించాలని జిల్లా సమగ్ర శిక్షా ఏసీపీవో లక్ష్మీకుమారి కోరారు. శుక్రవారం బల్లికురవ గ్రామంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలను కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సమగ్ర శిక్షా అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ భోజనం తినేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జీసీడీవో చారులత, ఎంఈవో రమేష్ పాల్గొన్నారు.

రేపు పురస్కార సభ

అద్దంకిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మారం వారి సేవా సదన్‌లో ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కార సభ సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు అధ్యక్షతన జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సభలో అభినయ హరిశ్చంద్రగా ప్రసిద్ధుడైన మిద్దెబోయిన ఆంజనేయరాజుకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

రైలులో మత్తు పదార్థం చల్లి దోపిడీ

- ఒంటరిగా ఉన్న మహిళ వద్ద 13 సవర్ల బంగారం అపహరణ
- చీరాల ఏరియా వైద్యశాలలో బాధితురాలికి చికిత్స

చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా రైలులో ప్రయాణిస్తున్న మహిళకు మత్తు పదార్థాన్ని చల్లి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. అందిన వివరాల ప్రకారం చెన్నైకు చెందిన అనూరాధ పర్చూరులోని చెల్లి వద్దకు ఒంటరిగా పినాకిని రైలులో బయలుదేరారు. ఈక్రమంలో ఆమె ఒంటిపై సుమారు 13 సవర్ల బంగారు ఆభరణాల ఉండడం చూసిన దుండగులు కన్నేశారు. ఆమె వద్ద కూర్చుని మాటలు కలిపారు. ఈక్రమంలో పర్చూరు నుంచి సోదరి ఫోన్‌లో నెల్లూరు వచ్చేవరకు బాగానే మాట్లాడింది. ఆ తరువాత నుంచి ఫోన్ అందుబాటులో లేదు. అయితే కూడా కూర్చున్న దుండగులు ఒక్కసారిగా అనూరాధ ముఖం మీద పదార్థాన్ని ఉపయోగించి స్పృహ కోల్పోయేలా చేశారు. బంగారు ఆభరణాలు, రూ.2వేల నగదు, ఫోన్ అపహరించి వెళ్లిపోయారు. కొద్దిసేపటికే కొద్దిగా స్పృహలోకి వచ్చిన బాధితురాలు దొంగతనం జరిగిందంటూ అటుఇటు తిరుగుతుండగా సహ ప్రయాణీలకు ఆమెను ఆరా తీశారు విషయం తెలుసుకుని చీరాల రైల్వే స్టేషన్‌లో దించి పోలీసులకు అప్పగించారు. దీంతో వారు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. అనూరాధ ఇప్పుడిప్పుడే పూర్తి స్పృహలోకి వస్తుంది.

ట్రక్కుని ఢీకొని వ్యక్తి మృతి

చీరాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ట్రక్కును వెనుక నుంచి ఢీకొని వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి వద్ద జరిగింది. స్థానిక తానా కాలనీ (జబ్బార్ కాలనీ)కి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు కోళ్లకు మేత తీసుకుని మోపెడ్ మీద కడవకుదురు నుంచి ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో రోడ్డు ప్రక్కన నిలిపి ఉన్న ట్రక్కును చూసుకోకుండా ఢీకొని అక్కడిక్కడే మృతిచెందారు. వేటపాలెం పోసుసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ నూతన కమిటీ

అద్దంకిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ సమావేశం జరిగింది. అనంతరం యూటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇట్టా రామారావు, ప్రధాన కార్యదర్శిగా బేతాళ పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడిగా వినుకొండ సుధాకర్, సహాధ్యక్షుడిగా యు.రాజశేఖర్, కోశాధికారిగా రామారావును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హరిబాబు, సోమేపల్లి హనుమంతరావు, టీవీ రత్నం, కే. గంగాధర్, కోటేశ్వరరావు, సాంబశివరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.








నేడు దీక్షధారులకు భిక్ష

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా శనివారం రాత్రి 7 గంటల నుంచి అద్దంకి పట్టణంలోని ఒంగోలు రోడ్డులో సూర్య రెస్టారెంట్‌లో దీక్షధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు అద్దంకి రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి కరి పరమేష్ తెలిపారు. మధ్యాహ్నం వేయిస్తంభాల గుడిలో దీక్షా భక్తులకు సద్ది (భోజనం) ఏర్పాటు చేసినట్లు అద్దంకి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్ తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ భుజంగరావు

పర్చూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పర్చూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.భుజంగరావు హెచ్చరించారు. శుక్రవారం ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడులో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తూ విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే అట్టి దుకాణ దారునిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఎక్కడైన బెల్ట్ షాపులను నిర్వహిస్తే 9440902496 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.



సోమశిలకు 6,143 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 6,143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.700 టీఎంసీ ల నిల్వ ఉన్నట్లు అధికా రులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండ లేరుకు తెలుగుగంగ ద్వారా 10,000, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అక్కడ అలా..



ఇది కర్నూలులో ఉల్లి దుస్థితి ఇది. అక్కడ గిట్టుబాటు ధర లేక.. నిల్వ చేసుకునే సౌలభ్యం లేక ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లిగడ్డలను ఇదిగో ఇలా నేలపాలు చేశారు.

ఇక్కడ ఇలా..



మరి నెల్లూరులో ఇందుకు విరుద్ధం. డిమాండ్‌కు తగ్గట్టు ఉల్లిపాయలు లేవంటూ వ్యాపారులు ధరలు పెంచేశారు. నాణ్యమైన గడ్డలు కావాలంటే కిలోకు రూ.60 వరకు పెట్టాలి. మరీ పచ్చివి అయితే 40 రూపాయలు పలుకుతు న్నాయి.

ఉల్లి.. లొల్లి!

- ధర లేక కర్నూలులో కుళ్లిపోతున్న గడ్డలు
- నెల్లూరులో మాత్రం ఎగబాకుతున్న ధర
- ప్రభుత్వం యంత్రాంగం చొరవ అత్యవసరం
- నేరుగా రైతుల వద్ద కొని ప్రజలకు విక్రయిస్తే ఇరువురికీ మేలు

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : వంటలో కీలకమైన ఉల్లిపాయల ధర రోజు రోజుకు పెరిగిపోతోంది. మార్కెట్‌లో ఉల్లి పరిమాణాన్ని బట్టి వ్యాపారులు ధరను నిర్ణయిస్తున్నారు. చిన్నవి రూ.32 నుంచి 35 పలుకుతుండగా, మోస్తరు సైజులో ఉన్నవి రూ.40 నుంచి45, పెద్ద గడ్డలు రూ.60 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ ధరలు మార్కెట్‌లో రోజుకు రోజుకు మారిపోతున్నాయి. జిల్లా అవసరాలకు దాదాపుగా కర్నూలు, నంద్యాల ప్రాంతాల నుంచి అధికంగా దిగుమతులు చేసుకుంటున్నారు. ఆ తరువాత మహారాష్ట్ర నుంచి వస్తున్నాయి. కర్నూలు సమీప ప్రాంతాల్లో ఉల్లి దిగుబడులు అధికంగా రావడంతో అక్కడి మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గిట్టుబాటు ధర లభించకపోవడంతోపాటు సకాలంలో కొనుగోలు జరగక ఉల్లిపాయలు కుళ్లిపోతున్నాయి. కొంతమంది రైతులు నేలపాలు చేస్తున్నారు. అయితే, జిల్లాలో మాత్రం ధరలు దిగిరావడం లేదు. ఉల్లి డిమాండ్ ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు, అధికారులు రైతుల వద్ద కొనుగోలు చేసి సబ్సిడీ ధరకు ప్రజలకు అందించేవారు. అయితే కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు పతనమవుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అక్కడి రైతులతో సంప్రదించి కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందజేయవచ్చు. అంతేగాక వ్యాపారుల దోపిడీని అడ్డుకోవడంతోపాటు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించినవారు అవుతారు. ఆ దిశగా జిల్లా ఉన్నత యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కారుచౌకగా భూములు లాక్కుంటే ఊరుకోం!

కందుకూరు తహసీల్దారు ఎదుట రైతుల నిరసన

167-బీ జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ భూములను కారుచౌకగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఇందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించమని కందుకూరు మండలంలోని మహదేవపురం, ఓగూరు, పలుకూరు గ్రామాల రైతులు స్పష్టం చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులను కలుస్తామని, వారి నుంచి స్పందన లేకుంటే పోరాటానికి సిద్ధపడతామని స్పష్టం చేశారు. కందుకూరు మండలం ఓగూరులో శుక్రవారం జరిగిన అభిప్రాయ సేకరణలో తహసీల్దారు ఇక్బాల్‌ను అన్నదాతలు నిలదీశారు. ఎకరా రూ.2 కోట్లు ఉన్న భూమికి రూ.20 లక్షలు ఇవ్వడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ ధర చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామనీ, లేకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని స్పష్టంచేశారు.

6



కందుకూరు తహసీల్దారు ఇక్బాల్‌ను నిలదీస్తున్న రైతులు

కోటి దండాలు

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

వైభవంగా లక్ష దీపోత్సవం

కోటి సోమవారం పర్వదినాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసంలో శ్రవణ నక్షత్రం వచ్చిన రోజును కోటి సోమవారంగా శివకేశవాలయాల్లో జరుపుతారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రాతః కాలం నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు జరగ్గా, వైష్ణవాలయాల్లో విశేష పూజలు జరిపారు. కాగా, నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతుల నేతృత్వంలో భారీ సెట్టింగులతో ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానందభారతీ స్వామి అఖండ జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు కార్తీక మాసం, దీపం విశిష్టతపై ప్రవచించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు.

6



అఖండ దీపం వద్ద పూజలు చేస్తున్న రామానందభారతి స్వామి, వేమిరెడ్డి దంపతులు

పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోండి

- కార్పొరేషన్‌లో మంత్రి నారాయణ సమీక్ష

నెల్లూరు(సిటీ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పన్నులు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. నగర అభివృద్ధిలో ప్రధాన మైన పన్ను వసూళ్లపై శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ఇప్పటి వరకు ఎంత పన్ను వసూలు చేశారు?, ఇంకా ఎంత వసూలు చేయాలని ఆరా తీశారు. మొండి బకాయిదారులకు ఇటీవల విద్యుత్ సరఫరా కట్ చేయడంపైనా వివరాలు తీసుకున్న మంత్రి, సదరు బకాయిదారులకు రెడ్ నోటీసులతోపాటు కఠినతరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో పచ్చదనం, పరిశుభ్రత, డివైడర్ల ఆధునికీకరణ, సెంట్రల్ లైటింగ్ అంశాలపైనా నారాయణ సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం

అభ్యంతరకర పోస్టులపై పోలీసుల నిఘా ● పలువురికి 41 నోటీసులు



ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పెద్దలు, మహిళా మంత్రులు, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న వైసీపీ మూకలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టేవారిపై పోలీసు శాఖ కొరడా ఝుళిపించడానికి సిద్ధమైంది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని 41 నోటీసులు జారీ చేయడంతోపాటు విచారిస్తున్నారు. ఏ ఐడీతో పోస్టు పెట్టినా సైబర్ నిపుణుల బృందాల సహాయంతో పట్టుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. సోషల్ మీడియా గ్రూపులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

- సైబర్ నేరంగా పరిగణించి..

గతంలో ఐపీసీ చట్టాల్లో శిక్షలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం నూతనంగా అమల్లోకి వచ్చిన భారత న్యాయ సంహిత చట్టాల ప్రకారం శిక్షల కాలం పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెట్టేవారిపై భారత న్యాయసంహితలోని 352, 353(2), 353 (1) (సీ) చట్టాలతోపాటు సైబర్ నేరంగా గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా చట్టాల కింద నేరాలు రుజువైతే రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడనుంది.

- వైసీపీ మూకల ఆగడాలు

వైసీపీ నాయకులు కొందరు కార్యకర్తలను రెచ్చగొట్టి కూటమి నేతలపై సోషల్ మీడియాల్లో పోస్టులు పెట్టిస్తున్నారు. వాటిని వైరల్ చేయిస్తున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. చివరికి కార్యకర్తలు బలవుతున్నారు. అధికారంలో ఉండగా కొందరి నేతలు, కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకొని పిచ్చి పోస్టులతో అందరినీ వేధింపులకు గురి చేశారు. ఇటీవల వింజమూరు పట్టణానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ పెసల శివారెడ్డి సోషల్ మీడియాలో ప్రభుత్వం, మంత్రులపై అసభ్యకర పోస్టులు పెట్టారు. దీనిపై టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని 41 నోటీసులు జారీ చేసి విచారిస్తున్నారు.

- వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఓ వ్యక్తి సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టాడు. అలాగే సీతారామపురం మండలంలో ఓ వ్యక్తి మంత్రులు, ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి నోటీసులు జారీ చేశారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు వారి కుటుంబ సభ్యులను, న్యాయమూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్

- మిగతా 6లో



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

రబీ సాగు 7.77 లక్షల ఎకరాల్లో..

సాగునీటి సలహా మండలి సమావేశంలో తీర్మానం

- నీటి విడుదల కొనసాగించాలని నిర్ణయం
- రెండేళ్ల తర్వాత పూర్తి ఆయకట్టుకు సాగునీరు

నెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల తర్వాత జిల్లాలో పూర్తి ఆయకట్టు సాగు చేసేందుకు అవకాశం కలిగింది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాల కింద 7.77 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సాగునీటి సలహా మండలి (ఐఏబీ) తీర్మానించింది. ఇందులో సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు ఉండగా, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాలు సాగుకానుంది. ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఐఏబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతోపాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కావ్య కృష్ణారెడ్డి, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఇరిగేషన్ అధికారులు రెండు ప్రాజెక్టుల్లోని నీటి లభ్యత, ఆయకట్టు వివరాలు, సాగునీటి ప్రతిపాదనలను మండలి ముందుంచారు. దీనిపై చర్చించిన సభ్యులు రబీ సాగుకు సంబంధించి నీటి కేటాయింపులపై కీలక తీర్మానం చేశారు. పలువురు ఎమ్మెల్యేలు వారి పరిధిలోని రైతుల సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే రెండు జలాశయాల నుంచి నీటి విడుదల జరుగుతోంది. ఈ విడుదలను సాగు పూర్తయ్యే వరకూ కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు.

నీటి కేటాయింపులు..

కాలువ	ఆయకట్టు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2.47 లక్షలు	24.7
కనుపూరు కాలువ	66 వేలు	6.60
కావలి కాలువ	1.24	12.4
ఉత్తర కాలువ	72 వేలు	7.20
దక్షిణ కాలువ	42 వేలు	4.20
కండలేరు	2.26లక్షలు	22.60
మొత్తం	7.71	77.10

- సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు

సోమశిల ప్రాజెక్టులో ప్రస్తుతం 69.34 టీఎంసీలు నీరు ఉంది. రానున్న రెండు నెలల్లో మరో 11 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 80.48 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని భావించి ఆ మేరకు కేటాయింపులు జరిపారు. డెడ్ స్టోరేజ్ 7.70 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 3 టీఎంసీలు, నీటి ఆవిరి 1.50 టీఎంసీలు పోను సోమశిలలో 68.46 టీఎంసీల నీరు మిగులుతుంది. అలానే కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో 3.17 టీఎంసీలు ఉంది. మొత్తంగా ఈ ఏడాది సాగుకు 71.63 టీఎంసీలు అందుబాటులో ఉంటుందని అధికారులు లెక్కలు వేశారు. దీని ద్వారా 5.51లక్షల ఎకరాలకు 55.10 టీఎంసీలు కేటాయించాలని ఐఏబీలో తీర్మానించారు. అందులో పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 72 వేలు, దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు నీటి కేటాయింపులు జరిపారు. 10 వేల ఎకరాలకు ఒక టీఎంసీ నీటిని వినియోగించేలా నిర్ణయించారు. ఇక రాళ్లపాడుకు మరో 1.50 టీఎంసీలు పోను నికరంగా 15 టీఎంసీలు మిగులుతుందని

- మిగతా 6లో

విద్యుత్ చార్జీల పెంపుపై త్వరలో ఉద్యమం

కోవూరు (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై త్వరలో ఉద్యమం చేప ట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు తెలిపారు. విద్యుత్తు సంస్కరణలను నిరసిస్తూ శుక్రవారం గంగవరంలో సీపీఎం జాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నా యకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలను ప్రోత్సహించండి

- సిడ్బి సమావేశంలో కలెక్టర్ ఆనంద్



నెల్లూరు (వెంకటేశ్వరపురం, సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విభజిత నెల్లూరు జిల్లాలో మూడు పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, వాటిలోని చిన్న పారిశ్రా మికవేత్తలు ఉత్పత్తిని పెంచేందుకు, ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బి) పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కూడా కృషి చేయాలన్నారు. నెల్లూరులోని ఓ హోటల్లో శుక్రవారం సిడ్బి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఆధారిత జీడీపీ పెరిగే అవకాశం ఉందని, పారిశ్రామిక వ్యవసాయ రంగాలకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. బత్తాయి, మామిడి తదితర పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారని తెలిపారు. వాటిని స్థానిక మార్కెట్‌లో కాకుండా విదేశాలకు ఎగుమతి చేసే విధంగా చూడాలన్నారు. సిడ్బి హైదరాబాద్ రీజియన్ మేనేజర్ వేమూరి చంద్రమౌళి జిల్లాలో తమ బ్యాంకు లక్ష్యాలను వివరిం చారు. చిన్న తరహా పరిశ్రమలకు అందిస్తున్న రుణాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ సూచనల ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం వెంకట సురేష్, డీఐసీ ఏడీ శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఇట్టా.. నీరు కదిలేది ఎట్టా?



నెల్లూరు నగరంలోని రామిరెడ్డి కాలువలో మురికి నీరు ముందుకు కదలడం లేదు. సీఏఎం స్కూల్ నుంచి ఉమామహేశ్వ రాలయం వెళ్లే మార్గంలో కాలువ వ్యర్థాలతో నిండి పోయింది. దీనివల్ల దోమలు, దుర్గంధం వ్యాప్తి చెందుతున్నా యి. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

నెల్లూరు రైల్వేస్టేషన్ పనులకు బ్రేక్

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ విస్తరణ, అభివృద్ధి పనులు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. పునరాభివృద్ధి పథకం కింద రూ.102 కోట్లతో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన ఈ పనులు ఈ ఏడాది మే నెలకే పూర్తి కావలసి ఉంది. అయితే కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నత్తనడకన సాగిస్తూ వచ్చారు. కొంతకాలంగా పూర్తిగా నిలిపి వేశారు. అధికారులను అడిగితే వరుస పండుగలు, వర్షాల కారణంగా పనులకు బ్రేక్ వచ్చిందని చెబుతున్నారు. కానీ, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులకు బ్రేక్ వేశారని విశ్వసనీయ సమాచారం.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి)



వైభవంగా లక్ష దీపోత్సవం

• వీఆర్సీ మైదానంలో ఆధ్యాత్మిక శోభ



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవం శుక్రవారం వైభవంగా మొదలైంది. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల నేతృత్వంలో ఈ ఉత్సవం జరుగుతోంది. ఇందుకోసం 20 అడుగుల శివలింగం, అయోధ్య బాల రామాల యం, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం నమూ నాలను భారీ సెట్టింగులతో ఏర్పాటు చేశారు. ఉదయం వేమిరెడ్డి దంపతులు గోపూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అయోధ్య బాల రామునికి పూజలు, త్రయంబకేశ్వరు డికి అభిషేకాలు చేశారు. మధ్యా హ్నం వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం కేరళ బ్యాండ్ కళాకారుల ప్రదర్శన ఆకట్టు కుంది. సాయంత్రం విశాఖ పట్నం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీ స్వామి అఖండ జ్యోతితో కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనం తరం భక్తులకు మంగళ శాసనాలు చేశారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరికీ సుఖశాంతులను ఇస్తాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు కార్తీక మాసం, కార్తీక దీపం విశిష్టతపై ప్రవచనం చేశారు. కోటి సోమవారం నాడు లక్ష దీపోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. తొలిరోజు కార్యక్రమాల్లో చివరిగా భస్మాభిషేకం, హారతు లు జరిగాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబు యాదవ్, కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





భక్తులతో మాట్లాడుతున్న రామానంద భారతీ స్వామి

సంప్రదాయ దుస్తులతో దేవాలయాలను సందర్శించండి

● రామానంద భారతీ స్వామి

తోటపల్లిగూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు వచ్చే భక్తులు సంప్రదాయ ఎరుపు, తెలుపు, పసుపు దుస్తులను ధరించి అమ్మ వారిని దర్శించుకోవాలని శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖప ట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. మండలంలోని వరి గొండలో వెలసిన శ్రీజ్వాలాముఖి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి అమ్మణ్ణిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసు లు, కోడూరు శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆయన స్వాగతం పలికి పట్టు వస్త్రాలు అందచేశారు. అనంతరం రామానంద భారతీ స్వామి మాట్లా డుతూ దేవాలయాలకు వచ్చే భక్తులు శుభ్రతను పాటించి, మౌనరీతిలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. గ్రామదేవతలు శక్తివంతమైన వారని, కోపం వస్తే ఎవరూ తట్టుకోలేరని, సంప్రదాయబద్ధంగా పూజలు చేయాలని కోరారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలకు నిండుగా ఉం డాలని, కార్తీక మాసంలో ప్రతిరోజు పూజలు చేయాలని కోరారు. భక్తు లకు ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానికులు కర్పూరం శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జానా రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పెదపవని చోరీ కేసు అనుమానితులు

లింగసముద్రం, నవంబరు 8: పెదపవనిలో జరిగిన భారీ చోరీ కేసులోని అనుమానితులను శుక్రవారం పోలీసుల అదుపులో తీసుకుని విచారణ చేపడుతున్నారు. ఈ నెల 4న అర్ధరాత్రి గ్రామంలో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు 5వ తేదీ ఉదయం నుంచే విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బుచ్చికి చెందిన ఓ వ్యక్తి పెదపవనిలో ఉంటున్నాడు. ఈయనపై గతంలో కొన్ని కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులు ఇతనిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించ డంతో ఈయన ద్వారా మొత్తం సమాచారాన్ని సేకరించిన పోలీసులు నెల్లూరులో మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 8 మం దిని నెల్లూరులోని ఒక రహస్య ప్రదేశంలో ప్రదేశంలో విచారిస్తు న్నట్టు తెలిసింది. వీరిలో కొందరు పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నట్టు సమాచారం. వీరు నెల్లూరులో పని చేసుకుంటూ స్థాని కంగా ఉంటున్న కొందరి తో కలిసి నేరాలు చేస్తున్నట్టు సమాచారం. రెం డు రోజుల్లో కేసు పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కారుచౌకగా భూములు లాక్కుంటే ఊరుకోం!

• ఎకరా రూ.2కోట్ల ఉన్న భూమికి 20 లక్షల పరిహారమా!?

• కందుకూరు తహసీల్దారు ఎదుట రైతుల నిరసన

కందుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ నుంచి పోరుమామిళ్ల వరకు జరుగుతున్న 167బీ జాతీయ రహదారి పనుల్లో మొదటిదశ సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు పనులు పూర్తి కావొచ్చాయి. భవిష్యత్తులో ఈ రహదారిని 4 లేన్లు విస్తరించేందుకు అనువుగా మరోసారి భూసేకరణకు అధికారులు నోటిఫికేషన్ విడుదలచేశారు. ఈ భూసేకరణ ప్రక్రియ ప్రకాశం జిల్లా కలెక్టరు నేతృత్వంలో జరుగుతోంది. సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు ప్రభుత్వ భూమి, రోడ్డు పోరంబోకు పోను రైతుల నుంచి 22.86 ఎకరాలను సేకరించాల్సి వస్తుందని నిర్ధారించిన అధికారులు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో సింగరాయకొండ నుంచి కందుకూరు వరకు 10.99 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉండగా మిగిలిన 11.85 ఎకరాలు కందుకూరు నుంచి మాలకొండ వరకు సేకరించాల్సి ఉంది. అయితే కందుకూరు - సింగరాయకొండ మధ్య ఉన్న ప్రాంతమంతా హైవేకు ఇరువైపులా భూములు కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. ప్రస్తుతం ఎకరా రూ.2 కోట్ల వరకు ఉంది. అయితే భూసేకరణ అధికారులు పలుకూరు రెవెన్యూ పరిధిలో ఎకరానికి 20 లక్షలు, ఓగూరు రెవెన్యూ పరిధిలో ఎకరానికి 26.7 లక్షలు మాత్రమే పరిహారంగా ఇస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రకాశం జిల్లా జేసీ ఈ ప్రాంతంలో విచారణ జరిపి రైతులతో మాట్లాడినా పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో రైతుల అభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కందుకూరు తహసీల్దారు ఇక్బాల్ ఓగూరులో గ్రామసభ ఏర్పాటుచేయటంతో రైతులంతా నిరసన తెలిపారు. మార్కెట్ ధర చెల్లిస్తేనే తమ భూములు ఇస్తామనీ, లేకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణే లేనప్పుడు హడావిడిగా భూసేకరణ ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. దీంతో గ్రామసభను అర్ధంతరంగా ముగించి తహసీల్దారు వెనుదిరిగి వెళ్లారు.



రక్షణ కవచం.. న్యాయసేవల చట్టం

- నేడు న్యాయసేవా దినోత్సవం

• బాధితులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వైనం

నెల్లూరు (లీగల్), నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : మానవ మనుగడకు నీతిసూత్రాలు, నియమాల ఉనికి రక్షణ కవచాలుగా పేర్కొంటూ వాటిని న్యాయసూత్రాలుగా చట్టబద్ధం చేశారు. చట్టాలు మనిషికి కనీస అవసరాలు. స్వతం త్రత, కూడు, గూడు, నివాసం, జీవించే, పనిచేసే హక్కులను గుర్తించాయి. ఇవి కొందరికి దక్కడం లేదని ప్రాథమిక హక్కుగా గుర్తించి రాజ్యాంగ బద్ధం చేశారు. వీటి నుంచే న్యాయ సర్వీసుల అధికారిక చట్టం ప్రవేశ పెట్టింది.

● న్యాయసేవల అధికారిక చట్టం

1976లో భారత రాజ్యాంగానికి అధికరణ 39 (ఏ) జతచేసి పేద, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం రాష్ట్ర ప్రభు త్వాల బాధ్యతగా నిర్దేశించారు. ఇందుకోసం ఒక చట్టాన్ని రూపొందించారు. అదే న్యాయసేవల అధికారిక చట్టం. ఇది కేంద్ర చట్టం. ఈ చట్టం నిర్దేశించినట్టు రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉమ్మడి గా కొన్ని సూత్రాలను, నిర్దేశకాలను రూపొందిం చారు. షెడ్యూల్డు కులం లేదా తెగకు చెందిన వారు, మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు, మహిళలు, పిల్లలు, మతిస్థిమితం లేని వారు, దివ్యాంగులు, సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, పారిశ్రామిక విపత్తులు తదితర అంశాలలో బాధితులు ఉచిత సహాయం పొందేం దుకు అర్హులు. అలాగే ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టం 1956లో సెక్షన్-2 (జీ) లో తెలిపిన నిర్బంధం, సంరక్షణ సహా లేదా బాలనేర స్థుల న్యాయ చట్టం 1986 సెక్షన్ (జె)లో తెలిపిన నిర్బంధం లేక మెంటల్ హెల్త్ చట్టం 1987 సెక్షన్ 2 (జి)లో తెలిపిన మానసిక వైద్యశాల లేక మానసిక చికిత్సాలయంలో తెలిపిన నిర్బంధంలో ఉన్న వారు అర్హులు.

● లోక్ అదాలత్‌ల పాత్ర

సహృద్భావ వాతావరణంలో శాంతియుతంగా చర్చించి సమస్యలకు పరిష్కారం పొందడం అనే సిద్ధాంతం నుంచి ఈ లోక్‌అదాలత్ ఉద్భవించింది. పూర్వం కుల పెద్దలు లేదా గ్రామపెద్దలు ప్రజల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించే వారు. దేశంలో మొట్టమొదటి సారిగా 1872లో బెంగాల్ రెగ్యులేషన్ చట్టంలో ఈ పంచాయితీలకు గుర్తింపు ఇచ్చారు. అం దుకే రాజీయే రాజమార్గం అని పెద్దలు అంటారు. ఎంతటి వివాదమైన సుహృద్భావ వాతావర ణంలో అందరూ కూర్చొని మాట్లాడు కుంటే పరిష్కారం తప్ప క లభిస్తుందని పెద్దల నానుడి.

ప్రతి మూడు నెలలకోసారి

దేశవ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నారు. ఈ లోక్‌అదాలత్‌లలో రాజీకి యోగ్యమైన కుటుంబ తగాదాలు, సివిల్, ఆస్తి, రోడ్డు ప్రమాదాలు, క్రిమినల్ కేసులు, లేబర్ కోర్టు కేసులు పరిష్కరింపబడుతున్నాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా లోక్ అదాలత్ భవనాలను ప్రారంభించి ప్రతిరోజూ రాజీకి యోగ్యమైన కేసులను ఇక్కడ పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రాలలో సీనియర్ సివిల్ జడ్జి హోదా కలిగిన అధికారిని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిగా నియమించారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయ సహాయం పొందేందుకు రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నెల్లూరుతోపాటు కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కోట, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట వంటి కేంద్రాలలోను లీగల్ సర్వీసెస్ వారు లోక్ అదాలత్ కేసులను త్వరిత గతిన పరిష్కరిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రజలందరికీ తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం తన బాధ్యతగా గుర్తించి ఇటువంటి చట్టాలు చేస్తోందన్నమాట. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి లోక్‌అదాలత్‌ల ద్వారా జిల్లావ్యాప్తంగా ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. కేసుల పరిష్కారంలో ఇప్పటివరకు ఐదుసార్లు జిల్లా మొదటిస్థానం సాధించింది.

న్యాయవాదుల సహకారం మరువలేనిది



జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానాన్ని ఐదుసార్లు సాధించింది. ఈ ఘనత జిల్లావ్యాప్తంగా ఉన్న న్యాయా ధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి, అన్ని కంపెనీల బ్యాంకు సిబ్బందికి దక్కుతుంది. ఎటువంటి వివాదాలైనా రాజీ మార్గం ద్వారా సుహృద్భావ వాతావరణంలో కేసులు పరిష్కరించుకోవచ్చు.

- సి.యామిని, జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్

● మొదటి లోక్ అదాలత్

మొట్టమొదటి లోక్ అదాలత్ 1982, మార్చి 14వ తేదీన గుజరాత్‌లోని జనాఘడ్‌లో జరి గింది. ఆ తర్వాత 1984లో మహారాష్ట్రలో లోక్ న్యాయా లయాన్ని ప్రారంభించారు. మన రాష్ట్రంలో 1985, డిసెంబరు 15న విశాఖలో మొట్టమొదటిసారిగా లోక్‌అదాలత్ నిర్వహించారు. వీటి ప్రాచుర్యాన్ని గుర్తించిన ప్రభుత్వం న్యాయసేవ ప్రాధికార సంస్థల చట్టం 1987ను రూపొందించింది.

నేడు అవగాహన సదస్సు

నూతన క్రిమినల్ చట్టాలపై ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలా) ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవన్‌లో న్యాయవాదులకు అవగాహన సదస్సు జగనుంది. నూతన చట్టాలపై పలువురు న్యాయవాదులు ప్రసంగించనున్నారు. ఈ కార్య క్రమంలో న్యాయవాదులు పాల్గొనాలని ఐలా ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కో-ఆర్డినేటర్ కాకి శాంతి కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబరు 9వ తేదీన న్యాయసేవ దినోత్సవం నిర్వహిస్తున్నారు.



సత్వర న్యాయం పొందొచ్చు

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయ సహాయం అందుతుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో బాధితులకు సత్వర న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తు న్నాము. నెల్లూరులో ప్రతిరోజు కోర్టు పని దినాలలలో రాజీకి యోగ్యమైన అన్ని కేసులు పరిష్కరిస్తున్నాము. కక్షిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అలాగే నిరుపేదలు విధి వంచితులు, ప్రమాదాలలో గాయపడిన వారికి, దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారికి ఉచితన్యాయ సహాయం అందిస్తున్నాము.

- కే.వాణి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి

7.77 లక్షల ఎకరాలకు సాగునీరు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఈ నీరు రెండో పంటకు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది.

● కండలేరు కింద..

కండలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 49.38 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. రానున్న రెండు నెలల్లో మరో 10.6 టీఎంసీలు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 60 టీఎంసీలు ప్రాజెక్టులో ఉంటుందని, అందులో 8.40 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను నికరంగా 51.56 టీఎంసీలు మిగులుతుందని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందులో చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీ లు, నెల్లూరు, తిరుపతి జిల్లాల తాగునీటి అవసరాలకు 2 టీఎంసీలు, నీటి ఆవిరి 6 టీఎంసీలు, స్వర్ణముఖి బ్యారేజీ నీటి అవసరాలకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.25 టీఎంసీలను, లోయర్ రైపేరియన్ కింద 2.150 టీఎంసీలను కేటాయిం చారు. అలానే 22.60 టీఎంసీలను నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 22.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ఐఏబీలో తీర్మానించారు. ఈ కేటాయిం పులు అన్నీ పోగా మరో 10 టీఎంసీలు కండలేరులో మిగులుతోంది. ఈ నీటిని 2025 సంవత్సరంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని నిర్ణయించారు.

● కాలువలన్నీ బాగు చేస్తాం : మంత్రి

జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలను బాగు చేయించి పూర్తిస్థాయిలో వినియో గంలోకి తీసుకొస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఐఏబీ సమా వేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక్క కాలువలో కూడా పూడిక తీయలేదని, బిల్లులు మాత్రం చేసుకున్నారని ఆరోపిం చారు. వీటిపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. కాలువల అభి వృద్ధిలో రైతులు, రైతు నాయకులు సహకరించాలని కోరారు. రాష్ట్ర ఖజానా ఇప్పు డిప్పుడే గాడిన పడుతోందని, సీఎంతో చర్చించి మరిన్ని నిధులు తీసుకొస్తామని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నీటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటే ఒక టీఎంసీతో 16 వేల ఎకరాలు పండించ వచ్చునని అన్నారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. రైతుల ఆస్తి అయిన పంట కాలువలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులే కాకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కూడా కాలువలు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, ఇరిగేషన్ ఎస్ఈలు దేశానాయక్, వెంకటరమణారెడ్డి, అధికారులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

మీడియాలో పోస్టులు పెట్టిన గుంటూరుకు చెందిన వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను టీడీపీ నాయకుల ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు.

చట్టపరంగా చర్యలు తప్పవు



వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచేలా, విధ్వంసాలను రెచ్చ గొట్టేలా, ఉన్నత పదవుల్లో ఉండేవారి పట్ల అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవు. ఇప్పటికే ఉదయగిరి సర్కిల్ పరిధిలో 4 కేసులు నమోదు చేశాం. సోషల్ మీడియా గ్రూపులపై ప్రత్యేక నిఘా ఉంచాం.

- ఎన్.వెంకటరావు, సీఐ, ఉదయగిరి


ఆవులతో తాత్కాలిక గోశాల

జిల్లాలో ఆధ్యాత్మిక సౌరభాలకు అంకురార్పణ జరుగుతోంది. పొదిలి కేంద్రంలో సనాతన ధర్మ వ్యాప్తికి బీజం పడుతోంది. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో రూ.100 కోట్లతో సనాతన ధర్మ సేవా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిగల్ స్వీయపర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక కేంద్రం ఊపిరిపోసుకుంటోంది. నేటి యువతరానికి హిందూధర్మం, భారతీయ సంస్కృతి, కళలు జీవిత నైపుణ్యాన్ని అందించే ఓ బృహత్తర విజ్ఞాన కేంద్రం త్వరలో పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. సనాతన సౌరభాలు

ఓబులక్కపల్లిలో ఆధ్యాత్మిక సేవా కేంద్రం

- ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న సనాతన ధర్మ సేవా గ్రామం
- వేద, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు
- విద్యాబోధనతోపాటు అనేక అంశాల్లో శిక్షణ


క్లాసుల నిర్వహణ



ఆధ్యాత్మిక విద్యాలయం

పొదిలి, నవంబరు 8 : సనాతన ధర్మ సేవా కేంద్రంలో ప్రస్తుతం 6, 7 తరగతులకు విద్యాబోధన కొనసాగుతోంది. వచ్చే ఏడాది 8, 9 తరగతుల విద్యాబోధన కూడా చేస్తారు. శిల్పకళా, నాదస్వరం, వ్యవసాయం, క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. స్థానికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించనున్నారు. క్రీడా కేంద్రంలో విద్యార్థులతోపాటు స్థానిక క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు పోటీలు నిర్వహిస్తారు. 31 ఎకరాల స్థలంలో ఆధునిక హంగులతో శాశ్వత భవననిర్మాణ పనులు పూర్తయ్యాయి. వేదశాల, శాస్త్రీయం, ఇతర ఆధ్యాత్మిక విషయాల అధ్యయనంతోపాటు ఆధునిక విద్యను అందించనున్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

- జి.మాధవి, ప్రిన్సిపాల్



జిల్లాలో ఎక్కడా లేని విధంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించడం కోసం ఈ విద్యాలయం రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం 6, 7 తరగతుల క్లాసులు నిర్వహిస్తున్నాం. ఇక్కడ విద్యార్థిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతాం. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పుతాం. ఇతర విద్యార్థులకు కూడా వసతిగృహం ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నాం. ఈ విద్యాలయంలో బాలరకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇక్కడ సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, హింది, లెక్కల బోధన ఉంటుంది.

వివిధ రకాల అంశాల్లో తర్ఫీదు


వసతిగృహం

- సాధారణ ప్రజల కోసం కంచి కామకోటి శంకర విద్యాలయం ద్వారా 6 నుంచి 12 తరగతుల వరకు సీబీఎస్‌సీ లేదా స్టేట్ సిలబస్‌తో బోధన చేయనున్నారు.
- స్థానిక ప్రజలకు శిల్పకళా, కుండల తయారీ, హార్టీకల్చర్, అగ్రీకల్చర్, టైలరింగ్, ఎలక్ట్రికల్, పంబ్లింగ్, కార్పెంటరీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రైవింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వనున్నారు.
- సంస్కృతం, సనాతన ధర్మంపై అధ్యయనం చేసేందుకు చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ సంస్కృత్ అండ్ వేదిక్ స్టడీస్‌ను ప్రారంభించనున్నారు.
- విస్తృతమైన గ్రంథాలయంతోపాటు వేదాలు, ఉపనిషత్తులు, వేదాంగాలపై పరిశోధన నిమిత్తం శంకర అద్వైత పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- కంచి కామకోటి త్రివేణి విద్యార్థి వసతిగృహం పేరుతో వైదిక విద్యార్థులు అధ్యాపకుల కోసం పూర్తిస్థాయి ఆచారానికి అనుకూలంగా ఆధునిక వంట సౌకర్యాలతో భోజన సదుపాయం కల్పించనున్నారు.
- 100 మంది విద్యార్థులకు గదులను నిర్మిస్తున్నారు.
- వేదపండితులు అధ్యాపకులు సందర్శనకు వచ్చినప్పుడు ఆధునిక వసతులతో అతిథిగృహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- జయేంద్ర సరస్వతి కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు అవుట్‌పేషెంట్ వైద్యసేవలను అందించనున్నారు.
- భారతీయ గోసంపదను సంరక్షించేందుకు పూర్తిస్థాయిలో గోశాల నిర్మాణం జరుగుతుంది.
- వివిధ హోమాలు, యాగాలు జరిపేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక యాగశాల నిర్మిస్తున్నారు.
- హనుమాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పేరుతో వ్యాయామశాల, అశ్వనీ నక్షత్రం నుంచి రేవతి వరకు 27 నక్షత్రాలకు రకానికి ఒక మొక్క ప్రకారం 27 రకాల మొక్కలతో నక్షత్రవనం ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణం పరిఢవిల్లే విధంగా 10 ఎకరాల్లో మొక్కల పెంపకాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- కళలు, ఫొటోగ్యాలరీ, వేదగ్రంథాల ప్రదర్శన సదుపాయం కల్పించడంతోపాటు యోగా సెంటర్‌ను ఇండోర్ గేమ్స్ కోసం ఇండోర్ స్పోర్ట్స్ రూములను ఏర్పాటు చేస్తున్నారు.



కల్యాణం.. కమనీయం

శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం కంభం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం దేవస్థాన ప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు దామోదర వ్రతం, కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- కంభం, ఆంధ్రజ్యోతి





కార్తీకంలో ధరల దడ

పూలు, పండ్లకు గిరాకీ

కొనేందుకు భయపడుతున్న భక్తులు

మహాశివునికి కార్తీక మాసం అత్యంత ప్రీతిపాత్రమైనది. పూజా కార్యక్రమాలు అధికంగా జరుగుతాయి. ఏడాది పొడవునా పూజలు ఒక ఎత్తు అయితే కార్తీక దీపారాధనకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుందని భక్తుల విశ్వాసం. అయ్యప్ప, శివ, భవాని మాలలు ధరించి దీక్షలు తీసుకుంటారు. ఇప్పటికే వేలాది మంది దీక్షలు చేపట్టారు. దీంతో పూలు, పండ్లకు మంచి గిరాకీ ఏర్పడడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు రూ.20, రూ.30లకే పూజా సామగ్రి వచ్చేవి. ప్రస్తుతం రూ.100 నుంచి రూ.200 ఖర్చు చేయాల్సి వస్తుందని భక్తులు వాపోతున్నారు. పూజా సామగ్రిలో ఉపయోగించే టెంకాయ, పూలు, పండ్లు అన్నీ బయటి నుంచి దిగుమతి చేస్తున్నామని, రేట్లు అందుకే పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

- కంభం, ఆంధ్రజ్యోతి


చీరపై రంగులతో డిజైన్లు వేస్తున్న బాలశంకర్ దంపతులు

రంగు రంగులో.. ఎన్ని హంగులో..!

- చీరలపై డిజైన్లు చీరాలకే సొంతం ● తోటవారిపాలెంలో దంపతుల హ్యాండ్ డిజైన్ వర్క్
- చేతి కుంచెలతో ఆకర్షణీయంగా తయారు ● వివిధ ప్రాంతాలకు పెరుగుతున్న ఆర్డర్లు

చీరాల, నవంబరు 8 : సాదా చీరలపై రంగు, రంగుల డిజైన్లు, ఆకర్షణీయమైన హ్యాండ్ వర్క్ చీరాల ప్రత్యేకత. మండలంలోని తోటవారిపాలేనికి చెందిన ఇరువురు దంపతులు సాదా చీరలపై చేతి కుంచెలతో వివిధ రంగుల డిజైన్లు వేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మొదట రోజుకు ఒకటి, రెండు చీరలపై డిజైన్ చేసే వీరు ప్రస్తుతం రోజుకు సుమారు 15 నుంచి 20 చీరలు తయారు చేసే స్థాయికి ఎదిగారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన బూదాటి బాలశంకర్, భ్రమరాంబ దంపతులు సాదా చీరలపై రకరకాల డిజైన్లు వేస్తూ మన్ననలు పొందుతున్నారు. బాలశంకర్ తన 12వ ఏట నుంచే రంగులతో హ్యాండ్ వర్క్ చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకురాతి నాగేశ్వరరావు అనే పెయింటర్ ఈయనకు స్ఫూర్తి. గోడలపై రంగులు వేసే నాగేశ్వరరావు వద్ద ఈయన శిక్షణ పొందారు. సాదా వస్త్రాలపై రంగులతో డిజైన్లు వేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ముందడుగు వేశారు. చూసిన వారందరూ బాగున్నాయని మెచ్చుకునేవారు. దీంతో బాలశంకర్ అదే పనిని తన వృత్తిగా ఎంచుకున్నారు. వివాహం జరిగాక తన భార్య భ్రమరాంబకు ఆ కళను నేర్పారు. అప్పటి నుంచి దంపతులు ఇరువురు సాదా చీరలపై ఫెవికాల్ కలర్స్‌తో వివిధ రకాల డిజైన్లు వేస్తున్నారు. ఆర్డర్లపైనే వారు ఎక్కువగా డిజైన్లు చేస్తుంటారు. వారు చేసే డిజైన్లు వినియోగదారుల అభిరుచి మేరకు రూ.600 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. ఈ చీరలపై వేసే రంగులు ఉతికినా చెడిపోకపోవడం ప్రత్యేకత. చేతి కళలు అంతరించిపోతున్న తరుణంలో ఈ దంపతులు సృజనకు మారుపేరుగా తమ వృత్తిలో రాణిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆదరణ ఎక్కువగా ఉంది



మేం వేసే డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. ఒకప్పుడు సరదాగా నేర్చుకున్న కళ, ప్రస్తుతం మాకు, మాతోపాటు మరికొంత మందికి భృతి కల్పిస్తోంది. మన్ననలు పొందగలుగుతున్నాం. అదే మాకు తృప్తి.

- బూదాటి బాలశంకర్, తయారీదారుడు, తోటవారిపాలెం


పాలకేంద్రం వద్ద ధర్నా

మద్యం దుకాణం వద్దంటూ రాస్తారోకో

ఒంగోలుక్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణం వల్ల తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయంటూ శుక్రవారం రాత్రి స్థానిక పాలకేంద్రం వద్ద కర్నూల్ రోడ్డుపై మహిళలు బైఠాయించి రాస్తారోకో చేశారు. మద్యం దుకాణం తెరవడమే కాకుండా అనధికారికంగా పర్మినెంట్ రూం ఏర్పాటు చేసి అక్కడే మద్యం తాగి గొడవ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మద్యం దుకాణాన్ని తొలగించాలని పీర్లమాన్యం ప్రాంతంలోని కొందరు మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఒంగోలు తాలుకా సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జగన్... నోరు అదుపులో పెట్టుకో!

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులపై విమర్శలు చేస్తున్న వైసీపీ అధినేత జగన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ హితవు పలికారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం పదవి పోయిన తర్వాత జగన్‌కు ఏమిచేయాలో తెలియక మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చి గుణపాఠం చెప్పినా ఆయన తీరులో మార్పు లేదన్నారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలు సొంత చెల్లిని, తల్లిని అసభ్యంగా వేధిస్తే జగన్ పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేస్తే జగన్ రాష్ట్రంలో తిరగలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కష్టపడుతుంటే జగన్ ఓర్వ లేక, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొందరు అధికారులు తీరు ఇంకా మార్చుకోలేదని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే వదిలే ప్రసక్తి లేదని నూకసాని హెచ్చరించారు.

వచ్చేనెల 5 నుంచి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు


కబడ్డీ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంతనూతలపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూదనగుంట కోటయ్యచౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీలు సంతనూతలపాడులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కు ర్రా భాస్కరరావు, ట్రెజరర్ డి.రమేష్ తెలిపారు. డా క్టర్ ఎస్.రాఘవేంద్రప్రసాద్ సూదనగుంట ఫౌండేష న్ అమెరికా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వా రు మాట్లాడుతూ ప్రతీ రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు మధ్య మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 10 జిల్లాల జట్లకు సంబంధించి 400మంది క్రీడాకారులు, 100మంది న్యాయనిర్ణేతలు పాల్గొంటారని తెలిపా రు. అసోసియేషన్ సహకారంతో క్రీడాకారులకు ఉచి త భోజనసదుపాయం, వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొం టారని, క్రీడా దుస్తులను సైతం అందజేస్తామని చె ప్పారు. అనంతరం పోటీల లోగోను ఆవిష్కరించా రు. జిల్లా అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ రంగారావు, కోఆర్డినేటర్ శీనయ్య, మల్లికారాణి, క్రిష్ణమూర్తి, ఎస్. రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు

● విద్యుత్‌శాఖ ఈఈకి రైతు సంఘం వినతి



విద్యుత్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలో గత మూడు రోజులుగా నివాస, వాణిజ్య భవనాలకు పాత విద్యుత్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని నెల్లూరు జిల్లా రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖ ఈఈ ఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత విద్యుత్ మీటర్లను వినియోగదారులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేశారని, ప్రస్తుతం బిగించే స్మార్ట్ మీటర్లకు భవిష్యత్‌లో విడతల వారీగా డబ్బులు వసూలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

● ఫోన్ ద్వారా రీచార్జి సౌకర్యం

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి విడతగా ప్రభుత్వ కార్యాలయాలకు బిగించిన తరువాత వాణిజ్య పరిశ్రమలు, గృహాలు, వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈప్రక్రియను ఆత్మకూరు డివిజన్‌లో వేగవంతం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న ఐఆర్ మీటర్ల స్థానంలో వాటిని అమర్చుతున్నారు. కాగా, విద్యుత్ వాడిన తరువాత బిల్లు చెల్లింపు పద్ధతి ఇంతవరకు కొనసాగింది. స్మార్ట్ మీటర్ల రాకతో మొదట డబ్బు చెల్లించిన తరువాత విద్యుత్



స్మార్ట్ విద్యుత్ మీటరు బిగిస్తున్న సిబ్బంది

వినియోగించాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటరుకు రీచార్జ్ చేయించుకుని విద్యుత్‌ను వాడుకోవచ్చు. రీచార్జ్ మొత్తానికి అనుగుణంగా విద్యుత్‌ను వాడుకోవచ్చు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సుమారు 1500 పైబడి విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ. 8 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే బకాయిల గొడవ ఉండదని అధికారులు చెబుతున్నారు.

బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఏడీ

ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 11000కు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మొదటగా ఆత్మకూరు పట్టణంలో గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గృహాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం జరుగుతుందని, విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని విద్యుత్‌శాఖ ఏడీ సురేష్ తెలిపారు.

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

పీఎం ఖాన్, జలవనరుల శాఖ ఈఈ



కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కావలి డివిజన్‌లోని 108 చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని కావలి జలవనరులశాఖ ఇన్‌చార్జి ఈఈ పీఎం ఖాన్ తెలిపారు.

? డివిజన్‌లో ఎన్ని చెరువులున్నాయి.

! 9మండల్లాలో 281 చెరువులున్నాయి. వాటిలో 172 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 109 పీఆర్ చెరువులు ఉన్నాయి.

? అన్ని చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయా.

! 108 చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. వీటిలో 11 చెరువులకు మాత్రమే పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయి.

? మిగిలిన చెరువుల పరిస్థితి ఏమిటి.

! 97 చెరువులకు మరలా ప్రతిపాదనలు పంపుతాం. ఉన్న తాధికారుల నుంచి అనుమతులు వస్తే పనులు చేపడతాం.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

పశు సంవర్ధక శాఖ జేడీ రమేష్



రైతులకు బహుమతులు అందచేస్తున్న జేడీ రమేష్

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందచేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక జాయింట్ డైరెక్టర్ కె రమేష్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపాడు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సుజని ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం రాయితీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువులకు, గొర్రెలకు, కోళ్లు, పందుల పెంపకాలకు దాణా తయారుచేసే యూనిట్లు నెలకొల్పేందుకు సుమారు రూ. 20 లక్షల నుంచి కోటి రూపాయల వరకు 50 శాతం రాయితీతో రుణం అందచేస్తారని అవసరమైన పాడి రైతులు స్థానిక పశువైద్యాధికారి ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేగ దూడలకు ఏలికపాముల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో చైర్మన్ సోమయ్య, డీడీ శ్రీనివాస రావు, డీఎల్‌డీఏ జయచంద్ర, స్థానిక పశు వైద్యాధికారి సుజని, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఆవాజ్



ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆవాజ్ కమిటీ నేతలు

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌బజార్ నుంచి పాత బస్టాండ్, బీఎస్ఆర్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ కార్యదర్శి పి యస్థాని బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన షాదీ తోఫా, విదేశీ విద్య, సబ్సిడీ రుణాలు తదితర పథకాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. మసీదులలో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్ లకు ఆరు నెలలకు ఒకసారి కాకుండా ప్రతినెలా జీతాలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సమరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేస్తూ తీర్మానం చేయాలని కోరారు. లేనిపక్షంలో ముస్లింలను సంఘటితం చేసి హక్కులను కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆవాజ్ మండల కమిటీ నాయకులు పి మస్తాన్, ఎస్‌డి ఖలీల్, షేక్ ఖలీల్, షేక్ షరీఫ్, పలువురు ఇమామ్, మౌజన్, మతవల్లీలు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్ : ముస్లిం మైనారిటీల సంక్షేమానికి జరగనున్న శాసనసభ సమావేశాల్లో నిధులు కేటాయింపులు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆవాజ్ కమిటీ జిల్లా సభ్యుడు షేక్ నాయబ్ రసూల్ కోరారు. ఈమేరకు శుక్రవారం మండల ఆవాజ్ కమిటీతో కలిసి తహసీల్దారు సుబ్రద్రకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు నజీర్‌బాషా, బాషా, గఫూర్ సాహెబ్, బాలకృష్ణ, సీపీఎం నేత ఫరుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

● అనంతసాగరం: ఎన్నికల సమయంలో ముస్లీం మైనారిటీలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు టీడీ సునీతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, ఇష్తియార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలోని పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీ.రమేష్, దుర్గాప్రసాద్, టీ. గోపికృష్ణ, సునీత, సూర్య, అశోక్, శోభ, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయంలో కుంభాభిషేకం



రామాలయ కమిటీ నిర్వాహకులతో ఎమ్మెల్యే దగుమాటి

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనతాపేట సీతారామచంద్ర ఆలయంలో శుక్రవారం మహా కుంబాభిషేకంను ఆలయ కమిటీ సభ్యులు వేదపండితులతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయమర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక మాసం కోటిసోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా సంగం శివాలయంలో ఉప్పు (లవణం)ని రంగులతో కలిపి భారీ శివ లింగాకృతి ఏర్పాటుచేసి దీపాలు వెలిగించారు. అనంతరం సంగమేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలలో తాగునీరు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, ఈవోపీఆర్డీ భార్గవి, గుండుపల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ అల్లూరురాజు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి, హౌసింగ్ ఏఈ పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసి మూడేళ్లు, డీడీ కట్టి ఏడాది కావస్తున్నా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయలేదని, గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో విషపురుగుల సంచారంతో అల్లాడుతున్నామని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం సభలో ఆయా శాఖల అధికారులు వారి వారి ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 8: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐడి డీఎస్పీ కోటారెడ్డి సూచించారు. శుక్రవారం పొంగూరు హైస్కూల్ ఆవరణలో మానవ హక్కుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐడి సీఐ బాలకృష్ణ, ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాసులు, ఇన్చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సోంపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెమళ్లదిన్నె గ్రామ పంచాయతీలోని సోంపల్లి గ్రామంలో టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి నేలటూరి జాషువ, బూత్ కమిటీ కన్వీనర్ జమ్మలమడుగు ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ సభ్యత్వాలు నమోదు చేశారు. వారి వెంట గదం సుధాకర్,గొల్లపల్లి సహదేవ్, నేలటూరి రాజా,రాజారత్నం, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి : జడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ భారతి

వలేటివారిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన ఎంపీడీఓ సరేంద్రదేవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జరిగిన మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్పీటీసీ భారతి మాట్లాడారు. బడేవారిపాలెం కూలీలకు 18వారాల నుంచి ఎందుకు ఉపాధి పనులు కల్పించడం లేదని ఏపీఓను ప్రశ్నించారు. కూలీల వేతనాల్లో వ్యత్యాసాలను నిలదీశారు. అక్రమాలను గుర్తించలేకపోతే అధికారుల సమక్షంలో తాను బయటపెడతానని హెచ్చరించారు. అలాగే సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఎంపీటీసీ సభ్యులు చింతల పూడి రవీంద్ర, చౌడబోయిన యానిది, స్వర్ణ రసిం హం, సర్పంచ్‌లు దేగా వెంకటేశ్వర్లు నవ్వులూరి రాజారమేష్, అనుమోల అమరే శ్వరి, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీషా, ఎంఈఓ రవి కుమార్, వైద్యాధికారి శివశిద్ధప్ప, ఏపీఓ ఉమా మహేష్, పీఆర్‌ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

పట్టాదారుల పేర్లు తొలగింపుపై సీపీఎం నిరసన

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములకు సంబంధించి పట్టాదారు పేర్లను తొలగించడంపై సీపీఎం రైతుసంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య శుక్రవారం రైతులతో కలిసి బిజ్జంపల్లి రైతుసేవా కేంద్రంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూరీసర్వే గ్రామసభలో నిరసన తెలియచేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సంబంధించి పట్టాదారు పేర్లు ఎలా తొలగిస్తారని తహసీల్దారు సుభద్ర ఎదుట వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ గ్రామసభలో నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో తహసీల్దారు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో అంజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ స్పాట్‌లుగా మారుస్తున్నాం



తులసి మొక్కకుండీని ఏర్పాటు చేస్తున్న కమిషనర్

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత పట్టణంగా మార్చేందుకు శ్రీకారం చుడుతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌నగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసి తులసి కుండీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో బ్లాక్ స్పాట్‌లను తొలగించి గ్రీన్ స్పాట్‌లుగా మారుస్తున్నట్లు తెలిపారు. తొలుత ఒకటవ డివిజన్‌ను ప్రయోగాత్మకంగా తీసుకుని ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

శాంతినగర్ శ్మసాన వాటిక పరిశీలన

అనంతరం శాంతినగర్ బాలక్రిష్ణారెడ్డి శ్మశాన వాటికను శుక్రవారం కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఇందులో వర్షపునీరు నిల్వ ఉండి ఇబ్బందికరంగా ఉందని పట్టణ ప్రజలు చెప్పటంతో వెంటనే అక్కడ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఎంపీడీవో భవన మరమ్మతులకు చర్యలు



అధికారులతో చర్చిస్తున్న ఈఈ వేణుగోపాల్

ఉదయగిరి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాత ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పీఆర్ ఈఈ వేణుగోపాల్, డీఈ మణికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాస రాజులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనాన్ని 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే దుత్తలూరు మండలంలోని బొటికర్లపాడు, రెడ్లదిన్నె గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రవీంద్రనాధ్, సీనియర్ అసిస్టెంట్ నవాజ్, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా సేవలు అందించాలి

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా ప్రజల నుంచి ఫిర్యాదుల రాకుండా మెరుగైన సేవలు అందించాలని కావలి ఆర్డీవో వంశీక్రిష్ణ తెలిపారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ ప్రత్యేకాధికారి హోదాలో శుక్రవారం తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సేవలపై సమీక్షించారు. రెవెన్యూశాఖలో ఇంటిపన్నులు, వాటి వసూళ్లు, పన్నుల విధింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఇంజనీరింగ్ విభాగంలో మంచినీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణపై చర్చించారు. శానిటేషన్‌పై ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. పట్టణ ప్రణాళికా విభాగంపై సమీక్షిస్తూ పట్టణంలో ఎక్కడా ఆక్రమణలకు తావులేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పనబాక దంపతులకు సన్మానం



పనబాక దంపతులను సన్మానిస్తున్న చెంచలబాబు తదితరులు

ఉదయగిరి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, సీనియర్ టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్యలను శుక్రవారం తిరుమలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అలాగే టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడుని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఉడతా సుమన్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

కావలి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి యం.శోభ తెలిపారు. శుక్రవారం కావలి న్యాయస్థానంలో జరిగిన జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమస్యల పరిష్కార దిశగా న్యాయస్థానాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మీ, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురాం, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, న్యాయవాదులు సాయిప్రసాద్, కలీమ్ రోజ్‌దార్, కెనడి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాభేరి

కావలి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాభేరి నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య తెలిపారు. శుక్ర వారం వెంగళరావునగర్ 22వ వార్డులో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు పనులను త్వరగా పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, కృష్ణపట్నం పోర్టు కంటేనర్ టర్మినల్ పునరుద్ధరించాలన్నారు. ట్రూఅప్ విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో పసుపులేటి తిరుపాల్, కృష్ణ మోహన్, కృష్ణయ్య, బాబురావు పాల్గొన్నారు.

ఏరుకొల్లులో గ్రామసభ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు వై నాగరాజు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వలేటివారిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ జానకీరాం తెలిపారు. శుక్రవారం ఆయన పోకూరు హైస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. అపార్ ఐడీ పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్కూల్ అటెండెన్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిలబస్ పూర్తి చేసి రివిజన్ క్లాసులు నిర్వహించి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, హెచ్ఎం రవీంద్ర పాల్గొన్నారు.

రేపు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఏపిఎంఐపి ద్వారా 214 మంది లబ్ధిదారులకు రూ. 2.55 కోట్ల విలువ కలిగిన డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్‌లను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేస్తారని ఆనం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.